
ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక




కృష్ణకాలువ ఒడ్డున...

17-3-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

ఉత్తర జిల్లాలలో గవర్నర్ పర్యటన చిత్రాలు




ఏలూరు మ్యునిసిపల్ కౌన్సిల్ గవర్నర్ గారికి స్వాగతపత్రం సమర్పించినప్పుడు తీసిన ఛాయా చిత్రం.



గవర్నర్ దంపతులకు బెజవాడ మ్యునిసిపల్ కౌన్సిల్ సభ్యులు, ప్రభుత్వోద్యోగులు సన్మానమిచ్చి విందు చేసి నప్పటి దృశ్యం. గవర్నర్ దంపతుల మధ్య నున్నవారు బెజవాడ మ్యునిసిపల్ ఛైర్మన్ గారు



బెజవాడ రెడ్ క్రాస్ దళంవారు గవర్నర్ సతీమణికి స్వాగతమిస్తున్న దృశ్యం



శ్రీ ఆలపాటి భాస్కరరావుగారు (రాజమండ్రి) లేడీ హై గారిని గౌరవించినప్పటి దృశ్యం



గవర్నర్ సతీమణి బెజవాడ మహిళామండలిని దర్శించినప్పటిదృశ్యం

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0
విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము

సంపుటము 40
సంచిక 27


Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర ఫాల్గున శుద్ధ షష్ఠి బుధవారము



కులూలోయ సుందరి...

*



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ మార్చి నెల 17-వ తేది బుధవారము

ఆంధ్రరాష్ట్రవాంఛ-నెహ్రూ విమర్శ

"ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌లో ఎక్కడో, ఏదో లోపం ఉంది. ఆంధ్రులకు వారి గొడవే గాని ఇతర ప్రపంచం సంగతి పట్టినట్లు లేదు వారు. ఈ సంకుచితదృష్టిని వదలి యావద్భారత దేశమునుగురించివిచారించాలి" —అని మొన్న ఆదివారం భారత అధినివేశ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూగారు విశాఖపట్నం వచ్చి రాష్ట్ర కాంగ్రెస్ సన్మానపత్రానికి సమాధాన మిస్తూ చేసిన హెచ్చరిక, ఇచ్చిన సలహా యావదాంధ్రమునకు బాధాకర మైనప్పటికి, నెహ్రూ గారి మనస్తత్వమును, గ్రహించిన వారికి ఎట్టి ఆశ్చర్యమును కలిగింపదు.

ఆంధ్రులు స్వార్థపరులని సంకుచిత దృష్టిగలవారని భారతప్రధాని అనవలసినమాట గాదు. ఆంధ్రులు ఆదినుండియు స్వవిషయమును విచారించుకొననందుననె, ఔత్తరాహిక నాయకుల పిలుపుల నాలించి, సలహాల పాలించిన కారణముననె ఇప్పటికిని వారు రాష్ట్రముకొరకు ఈ మహానాయకులకు చేతులు జాపుచు దేబరించుచుండవలసిన దుర్గతి పట్టినది. గతములో స్వరాష్ట్రసంపాదనావకాశముల జారవిడచి, దేశస్వాతంత్ర్య సంపాదనమె ముఖ్యమని యెంచి గాంధిమహాత్ముని ఆజ్ఞను శిరసావహించినందులకు ఈ నాటికీ చింతించుటలేదు. నలభై సంవత్సరములుగ దేనికొరకై ఆందోళన చెందుచుండిరో, ఏ హక్కుకొరకై పోరాడుచుండిరో అట్టిది ఇప్పటికి పైవారి దయాదాక్షిణ్యములపై ఆధారపడియున్నదనిమాత్రము ఆంధ్రులు విచారించుచున్నారు. తమ రాష్ట్ర వాంఛను పదే పదే పునరుద్ఘాటించినంతమాత్రమున ఆంధ్రులు స్వార్థపరులనిగాని, సంకుచితమనస్తత్వముగలవారనిగాని ఆరోపించుట భావ్యముగాదు.

ప్రపంచశాంతికి భారత స్వాతంత్ర్యమత్యంతావశ్యకమని ఎట్లు భారత ప్రజలు, నాయకులు ఘోషించిరో, అట్లే స్వతంత్రభారతదేశ పరిపాలన గత ఏడెనిమిది మాసములుగ జరుగుచున్నట్లుగాక, లోపరహితముగ ప్రజాసత్తాకపద్ధతులపై జరుగవలెనన్న భాషా రాష్ట్ర నిర్మాణము జరుగవలెనని ఆంధ్రులు కోరుచున్నారు. సత్వర ఆంధ్రరాష్ట్ర నిర్మాణము జరుగకున్న దక్షిణాదిన యథార్థముగ, సంకుచిత, స్వార్థపరులశక్తి బలపడి దేశ ఐక్యతకే భంగము వాటిల్లగలదు. ఇటీవల దక్షిణాదిన బయలుదేరిన ద్రవిడరాష్ట్ర సమాఖ్య ఉద్యమము వలన రాగల ప్రమాదములను నివారించుటకు సత్వర భాషా రాష్ట్ర నిర్మాణ మొక్కటే మార్గము. స్వీయ ప్రయోజనములే కాంక్షించుచున్న సంకుచిత వాదులు ఆంధ్రులు గారు; ఈ ద్రావిడసమాఖ్య ఉద్యమనాయకులే. పండిట్ నెహ్రూ విశాఖపట్నమున చేసిన తమ ప్రకటన వలన వీరి ఉద్యమమును బలపరచినవారైరి. ఇకమీదట స్వరాష్ట్రసంపాదనావకాశములు సన్నగిల్లిన వను నిరాశా భావముతో ఆంధ్ర, కేరళ, కర్నాటక, తమిళులు అందరు ఈ "ఔత్తరాహిక నియంతృత్వము"నుండి బయల్పడుటకు సమైక్యకృషి జరుపవచ్చును. ఇటీవల మైసూరు ప్రధాని శ్రీ కె. సి. రెడ్డి అంతటివారును దాక్షిణాత్యప్రజలందరు ఒక సమాఖ్య ఎందు కేర్పడరా దనిరి. ఇట్టి ప్రత్యేక, ప్రతీప ఉద్యమమును ఆంధ్రు లిప్పటివరకు ప్రతిఘటించుచు వచ్చిరి. కాని ప్రధానామాత్యుని విశాఖపట్నం ప్రసంగము వారికి అనంతరము మార్గాంతరములేక ఈ ఉద్యమములో చేరిపోగలరు. ఏకప్రపంచవాది నని చెప్పుకొను పండిత నెహ్రూ ఇట్టి పరిణామమునకు దోహద మివ్వవలసినది గాదు.

ప్రధానామాత్యునకు ఆంధ్రుల రాష్ట్రవాంఛ అవగాహనమైనట్లులేదు. వారికి సమస్యలర్థమగుచున్నవిగాని వాటి పరిష్కారమార్గములు గోచరించుట లేదు. భాషారాష్ట్రము లేర్పడవలసినదే నని, కాంగ్రెస్ ఈ సూత్రము నిదివర కెన్నడో గుర్తించియున్నదని ప్రకటించుచు ఆ నిర్మాణ మెట్లు జరుగవలెనన్నదే విచారణీయాంశమనిరి. భాషారాష్ట్ర నిర్మాణమునకుగల మార్గము సుస్పష్టము. అధిగమింపనలవిగాని అవరోధములుగాని, పరిస్థితుల మరింత క్లిష్టముచేయగల సమస్యలుగాని ఏమియు లేవు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణము సుకరమేనని, ఇతర భాషా రాష్ట్రముల నిర్మాణమునకున్న అవరోధము లేవియు లేవని, అధినివేశ శాసనసభయందు వారు ప్రకటించియుండిరి. కాని ఇప్పుడు ఆంధ్రరాష్ట్ర నిర్మాణసాధ్యాసాధ్యముల విచారించుటకు ఒక ఉపసంఘమును నియమింతుమని చెప్పిరి. సాధ్యమని ఆ సంఘము సూచించినమీదట సరిహద్దు సంఘమును నియమింతుమనిరి.

ఇట్టి పరస్పర విరుద్ధప్రకటనలవలన, కార్యవిధానములవలననె ఆంధ్రులకు భారతప్రభుత్వములో ఇప్పటివరకుగల విశ్వాసము సన్నగిలిపోక తప్పదు. ఆంధ్రులకు శీఘ్రముగ రాష్ట్రము సిద్ధింపవలె నన్న ఆంధ్రనాయకులు, ఆంధ్రసంస్థలు ఏకమై వ్యక్తిగత అభిమాన దురభిమానములకు స్వస్తిచెప్పి ఐక్య కృషి జరుపుట అత్యంతావశ్యకము. పండిట్ నెహ్రూ ప్రసంగానంతరమైనను ఆంధ్రనాయకులు యావన్మందీ కలసి భవిష్యత్కార్యక్రమమును నిర్ణయించుకొని, గౌరవప్రదమైన మార్గము ననుసరింతురని ఆశించుచున్నాము.

భారతనౌకా పరిశ్రమ

భారతజాతీయ చరిత్రలో 1948 వ సంవత్సరము మార్చి 14 వ తేదీ ఒక అపూర్వదినమని చెప్పవలెను. 150 సంవత్సరముల అనంతరము భారత దేశమున భారతీయులు తయారుచేసిన ప్రథమ నౌక జలప్రవేశోత్సవమును విశాఖపట్నము రేవులో భారత అధినివేశ ప్రధానామాత్యుడు జరిపెను. బ్రిటిష్‌వారీ దేశమును పరిపాలించిన 150 సంవత్సరములలో అతఃపూర్వము అఖిలప్రపంచమునకు దారి చూపిన భారతీయుల శిల్పనైపుణ్యము, మార్గదర్శకమైన నిర్మాణకౌశల్యము జీర్ణించిపోయినది. గాంధిమహాత్ముడు పదేపదే ప్రకటించినట్లు "లాంకషైరు మిల్లులు వర్ధిల్లుటకు భారతీయ వస్త్రపరిశ్రమ శిథిలము కావలసివచ్చెను. బ్రిటిష్ నౌకావ్యాపారము వృద్ధి యగుటకు భారత నౌకా పరిశ్రమ, వ్యాపారము నాశనము కావలసివచ్చెను." భారత ప్రధాని 'జలఉష' సాగర ప్రవేశోత్సవమును చేసిన అనంతరము ప్రకటించినట్లు "ఆమధ్యకాలము చరిత్రభాగమైపోయినది. నూతనశక మారంభమైనది. కనుక జీర్ణ పరిశ్రమలు పునరుద్ధరింపబడుట ఎంతయు సమంజసము."

తూర్పు కోస్తాయందు విశాఖపట్నం అతిముఖ్యమైన రేవు. రేవు అభివృద్ధికి ప్రభుత్వము బ్రహ్మాండమైన కార్యక్రమమును ప్రారంభింపనున్నదని పండిట్ నెహ్రూ ప్రకటించెను. పూర్వకాలమున కళింగపట్నమునుండి చెన్నపట్నము వరకును అనేక రేవులుండెను. నౌకా నిర్మాణమునందేగాక నౌకా వ్యాపారమునందును ఆంధ్రులు అగ్రగాములుగ నుండిరి. ఇప్పటికినిమామూలు నౌకా నిర్మాణము ఆంధ్రరాష్ట్రమున జరుగుచునే యున్నది. ప్రభుత్వాదరణ మాత్రము లభించుటలేదు. ఆనాటి రేవులు నేడు ఎందుకూ పనికిరాని స్థితియందున్నవి. నౌకానిర్మాణాభివృద్ధికి ప్రోత్సాహ మివ్వగల నౌకావ్యాపారము పునరుద్ధరింపబడుట అవసరము. అందుకు తూర్పుకోస్తాన మరికొన్ని రేవు లభివృద్ధి జరుగవలెను. కాకినాడను లోతైన రేవుపట్నముగ మార్చుట సాధ్యముగాదని రేవు సలహాసంఘము వారు తెలిపియుండిరి. కాని కొద్ది మరమ్మతులతో తూర్పు కోస్తాన మరి నాలుగురేవులు వ్యాపారమున కనుకూలము కాగలవు. సముద్రాంతరిత ప్రమాణము సీకవసరమైన నౌకల నిర్మాణముతోబాటు, కోస్తా వ్యాపారమునకు ఉపయోగపడగల నౌకల నిర్మాణమునుకూడ కొనసాగింపవలయును

ఈ పరిశ్రమకు ఆంధ్రదేశమునందు గల అవకాశముల విచారించి ప్రభుత్వమే స్వయముగ పరిశ్రమోద్ధరణకు పూనుకొనవలెను. ప్రభుత్వము వారింకమీదట నౌకాపరిశ్రమ విషయమై ఎక్కువ శ్రద్ధ వహించెదరని పండిట్ నెహ్రూ తెలిపియుండెను. శ్రీ వాల్చంద్ హీరాచంద్‌గారును ప్రభుత్వము చేయవలసిన సహాయ స్వరూపమును వివరించియుండిరి. విశాఖ నౌకా నిర్మాణ కార్ఖానాభివృద్ధికి అవసరమైనవాటిని సింధియా వారు భారతప్రభుత్వమునకు నివేదించియుండిరని తెలిపిరి. ప్రభుత్వముకూడ పూర్వమువలె కమిటీల నియామకము లాంటి కాలహరణ కార్యక్రమములతో తృప్తిచెందక తక్షణావసరముల గుర్తించి వ్యవహరించునని ఆశించుచున్నాము. స్వతంత్రభారతమున తయారైన ప్రథమ నౌక ఆంధ్ర రేవుపట్టణమునుండి సప్త సముద్రప్రయాణమునకు బయలుదేరుట ఎంతయు సమంజసముగ నున్నది. ఆంధ్రులు పూప్రాభవమును పొందుట కిది కాగలదని ఆశించుచున్నాము.

నేటి ప్రపంచం :

ప్రపంచ ప్రజాస్వామ్య శక్తులను సంఘటిత పరచాలి

మధ్య యూరప్ స్వతంత్ర ప్రజాస్వామ్య రాజ్యమైన జెకొస్లొవాకియా కమ్యూనిజముకు బలిఅయి సరిగా రెండు వారాలయినా తిరగక ముందే, దాని విదేశాంగమంత్రి జాన్ మాజరిక్ ఆత్మహత్య చేసుకొన్నాడని ఘోరవార్త.

మొదట దేశ ప్రజాస్వామ్యాన్ని, దాని వెనువెంటనే ప్రముఖ ప్రజాస్వామ్య నాయకుడినీ స్టాలిన్ అదృశ్యహస్తం తన పొట్టన పెట్టుకొన్నదన్నమాట.

దేశ పరిపాలనాధిపత్యం సంపూర్తిగా కమ్యూనిస్టుల హస్తగతమైనప్పటికీ, ఆ కమ్యూనిస్టు ప్రభుత్వంలోనే పని చేస్తూ తన ప్రజలకు సహాయపడగలనని మాజరిక్ ఆశించాడు. కమ్యూనిస్టు ప్రధాని గొట్వాల్డ్ మంత్రి వర్గంలో అందువల్లనే విదేశాంగ మంత్రి పదవిని ఆయన స్వీకరించాడు. దేశంలో దారుణమైన రాజకీయ విప్లవం జరిగి నిరంకుశ కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడితే, జాన్ మాజరిక్ లాంటి ప్రముఖ ప్రజాస్వామ్యవాది అందులో పనిచేయడానికి సమ్మతించడమేమిటని ప్రపంచం విమర్శించింది. ఎవరెన్ని విమర్శలు చేసినా, విపత్కరమైన పరిస్థితులలో పడిపోయిన స్వదేశీయులకు ఏదో విధంగా సహాయపడలేక పోతామా అని మాజరిక్ ఆశించాడు. అతడు ఆశించిందొకటైతే, చివరకు జరిగింది మరొకటి. దేశంలో కమ్యూనిస్టు నియంతృత్వం ఏర్పడిన కొన్ని రోజులకే ఒక కార్మిక సభలో ఉపన్యసిస్తూ "నన్నూ మీలో ఒకడుగా భావించండి", అని జాన్ మాజరిక్ విజ్ఞప్తి చేశాడంటే, మాతృదేశ భవిష్యత్తు విషయంలో అతడెంత మనోవేదన చెందిందీ అవగాహన చేసుకోవచ్చు. అదే సభలో తనకు మరొక ప్రపంచయుద్ధాన్ని చూడాలనే ఉద్దేశం లేదనికూడా మాజరిక్ ఉగ్గడించాడు. అదృష్టవంతుడు అన్నమాట ప్రకారం మరొక యుద్ధాన్ని చూడకుండానే దాటిపోయినాడు. తూర్పుయూరప్‌ఖండరాజ్యాలన్నింటిలో వ్యాపించి సర్వాధిపత్య స్థాపనకోసం పరవళ్లు తొక్కుతున్న కమ్యూనిజముకు, పశ్చిమయూరప్‌లోని ప్రజాస్వామ్యానికీ మధ్య జెకొస్లొవాకియాను సామరస్యసాధనకు ఒక వారధిగా ఉపయోగపడేటట్లు చేద్దామని మాజరిక్ కలలు కన్నాడు. ఆ కలలు కలలమాదిరిగానే మిగిలిపోయినవి.

ఉత్తమదేశభక్తుడు, జెకొస్లొవాకియా రిపబ్లిక్ సంస్థాపకుడైన థామస్ మాజరిక్ కుమారుడు జాన్ మాజరిక్ దుర్మరణవార్త విని సమస్త సభ్యతా ప్రపంచం విస్తుపోయింది.

మేడమీదవున్న గది కిటికీలోనుంచి కిందికి దూకి మాజరిక్ ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త వచ్చింది.

జరిగింది ఆత్మహత్యో, లేక సిడ్నీలోని జెకొకాన్సల్ జనరల్ టాశారీ అనే అతడు చెప్పినట్లు బహిరంగహత్యో నిర్ధారణంగా చెప్పలేము కాని, జెకొస్లొవాకియాలో కమ్యూనిస్టు నియంతృత్వం ఏర్పడినతర్వాత అక్కడ ఇలాంటి విషాదసంఘటనలు తప్పవనిమాత్రం అందరూ అనుకొన్న విషయమే.

* * *

అచిరకాలంలోనే మరొక ప్రపంచయుద్ధం తథ్యమే ననే భావం ఆనాటికానాడు ప్రస్ఫుటమవుతున్నది. అగ్రరాజ్యవిభేదాలు సమరస భావంతో పరిష్కారం కావడం అసంభవమనికూడా తేలిపోతున్నది.

నిన్న మొన్నటివరకూ ఐరిష్ ప్రధానిగా పనిచేసిన డీవెలరా ఇటీవలనే న్యూయార్క్ పత్రికా విలేఖరుల సభలో నేటి ప్రపంచ క్లిష్టపరిస్థితులను సింహావలోకనం చేస్తూ ప్రకటించిన అభిప్రాయాలుకూడా ప్రపంచానికి మరొక ఘోర విపత్తు తప్పదనే భావాన్నే బలపరుస్తున్నవి.

"తృతీయ మహాసంగ్రామానికి అభిముఖంగా ప్రపంచం పడుస్తున్నదనే నా విశ్వాసం...ఐక్యరాజ్యసమితి భవిష్యత్తు విషయంలో కూడా నేను నిరాశ చెందుతున్నాను. అగ్రరాజ్యాల దృక్పథం మారితేనేగాని, ప్రపంచ శాంతిస్థాపనార్థం ఏర్పడిన ఈ సంస్థ జయప్రదం కాదు. అగ్రరాజ్యాల దృక్పథంలో ఈ మార్పు రాకపోతే, మరొక ప్రపంచయుద్ధం తప్పదన్నమాటే" అని మాజీ ఐరిష్ ప్రధాని డీవెలరా నిస్పృహ ప్రకటించాడు.

ఒక్క డీవెలరా మాత్రమే కాదు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఈ వారం చేసిన ఒక ప్రధాన ప్రకటనకూడా ఇంతకంటే మరీ నిస్పృహకు దారి తీస్తున్నది.

"ఉన్నత లక్ష్యాలతో ఏర్పడిన ఐక్యరాజ్యసమితి మొదట అనుకొన్నట్లుగా గాక మరొక కొత్త అవతారం తాల్చింది. ఈ సంస్థ తన కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చడానికి అనువైన పద్ధతిలో సభ్యులు ప్రవర్తించడంలేదు ఎంతో అవసరమైన, అతి ప్రధానమైన కార్యకలాపాలనుకూడా ఇది సాధించలేకపోతున్నది. ఏటంశక్తిని కంట్రోల్ చేయడంలోగాని, వివిధ దేశాల సైనికబలాలను పెరగకుండా మాని, తగ్గించడంలోగాని, ఐక్యరాజ్యసమితి నిర్ణయాలను అమలుపరచడానికి కావలసిన సైనికబలాన్ని సమకూర్చడంలోగాని వీటిలో ఏ ఒకదాన్నీ సమితిసభ్యులు చేయలేకపోయినారు" అని ట్రిగ్వీలీ అభిప్రాయపడుతున్నాడంటే, ప్రపంచ శాంతిస్థాపనకు ఈ సమితి ఎంతవరకు ఉపయోగపడుతున్నదో, ఇకముందు ఉపయోగపడగలదో ఊహించవచ్చు

పర్యవసానంగా శాంతిసాధన సంభవమే నని విశ్వసిస్తున్నట్లు ఉద్ఘాటిస్తున్నప్పటికీ, మొత్తంమీద ప్రస్తుతం ప్రపంచశాంతికి విఘాతమే ఏర్పడిందని ప్రెసిడెంట్ ట్రూమన్‌కు సైతం అంగీకరించక తప్పడంలేదు. శాంతిస్థాపనోద్యమంపట్ల ప్రపంచం పరిపూర్ణవిశ్వాసంతో పనిచేయకపోయినట్లయితే, మరొక భయంకర సంగ్రామంలో సమస్తప్రపంచం నాశనంగాక తప్పదని ట్రూమన్ హెచ్చరిక చేస్తున్నాడు.

ప్రపంచప్రజల మనో నిబ్బరాన్ని చిక్కబట్టి ఆత్మవిశ్వాస బలాన్ని ఎక్కువజేయడానికి ప్రెసిడెంట్ ట్రూమన్ వ్యక్తిగతంగా ఏ అభిప్రాయాలను ప్రకటించినప్పటికీ, చైనా అంతర్యుద్ధ పరిస్థితినిగాని, నేటి మధ్యప్రాచ్య రాజ్యాల స్థితిగతులనుగాని, యూరప్ ఖండ రాజ్యాల భయానక పరిస్థితులనుగాని, వీటిలో ఏ ఒకదాన్ని చూసినా, ప్రపంచం మరొక ఘోర సంగ్రామంలో చిక్కుకోడానికి ఎంతో కాలం పట్టదేమోనని ప్రతివారికీ తోచడం సహజం.

* * *

ఇప్పటికి దాదాపు పది సంవత్సరాల నుంచీ నిర్విరామంగా యుద్ధగుండంలో దిగివున్న చైనా ఆర్థికంగా, సైనికంగా చితికిపోయిందనీ, అందుచేత చైనాకు అమెరికా ఆర్థిక సైనిక సహాయం అత్యవసరంగా అందాలనీ మేజర్ జనరల్ చెన్నాల్ట్ అమెరికా ప్రజాప్రతినిధుల సభ విదేశవ్యవహారాల శాఖ ఎదుట సాక్ష్యం ఇస్తూ మొన్న హెచ్చరిక చేశాడు. చైనాకు సకాలంలో సహాయం ఇవ్వకపోతే, మూడవ ప్రపంచయుద్ధానికి రంగస్థలిని ఏర్పాటు చేయడమే అవుతుంది సుమా అనికూడా ఇతడు ఖండితంగా తన సాక్ష్యంలో చెప్పాడు. చైనాలో కమ్యూనిజం ఏర్పడనంతకాలం రష్యా యూరప్ ఖండంలో బాహాటంగా యుద్ధానికి సాహసించలేదనీ, ప్రాచ్యఖండంలో చైనాది భౌగోళికంగా అతి ప్రధానమైన, కీలకమైన స్థానమనీ, అందుచేత చైనా జాతీయప్రభుత్వాన్ని బలపరచడానికి అమెరికా సర్వవిధాల సహాయపడాలనీకూడా మేజర్ జనరల్ చెన్నాల్ట్ స్పష్టపరిచాడు. కమ్యూనిజముకు చైనా బలి అవుతూండగా చూస్తూ వూరుకొన్నట్లయితే, ఆసియాఖండం సంపూర్తిగా కమ్యూనిజముకు ఆహుతి అయేమాట వాస్తవమనీ, ఇక దానివ్యాప్తిని అరికట్టడం బ్రహ్మతరం కాదనీకూడా ఇతడు హెచ్చరిక చేశాడు. బలీయమైన చైనా తృతీయ ప్రపంచ సంగ్రామాన్ని అరికట్టినా అరికట్టలేకపోయినా, కమ్యూనిజమును వ్యాపింపజేయడానికి సకల తంత్రాంగాన్నీ పన్నుతున్న రష్యాకు పక్కలో బెదురుగా వుండేమాట మాత్రం వాస్తవం.

ప్రపంచంలో ప్రజాస్వామ్య శక్తులను బలపరచుకోవడం ఎంత అవసరమో, కమ్యూనిస్టు విజృంభణను అరికట్టడంకూడా అంతే అవసరం. ప్రజాస్వామ్య శక్తులపాలిటికి ఈనాడు కమ్యూనిస్టులు ప్రబల శత్రువులుగా పరిణమించారు. బ్రిటిష్ ఉపప్రధాని హెర్బర్ట్ మారిసన్ చెప్పినట్లు దేశపరిపాలనాధికారాన్ని తమ హస్తగతంచేసుకోడానికి కమ్యూనిస్టులు ఎంతటి నీచాతినీచానికైనా, ఎంతటి దౌర్జన్యచర్యలకైనా ఒడికడతారు. జెకొస్లొవాకియాలో గత రెండు మూడు వారాలగా జరిగిన దారుణసంఘటనలే ఇందుకు ప్రబలనిదర్శనం.

* * *

రష్యాతో ప్రత్యేక పరస్పర సైనిక సహాయ ఒడంబడిక చేసుకోడానికి ఫిన్లెండు సమ్మతించిందనీ ఫిన్నిష్ ప్రధాని త్వరలోనే మాస్కో వెళ్ళి సంప్రతింపులు జరుపుతాడనీ వస్తున్న వార్తతోపాటు పశ్చిమ యూరప్‌లో బెల్జియం, హాలెండు, లక్సెంబర్గ్, ఫ్రాన్సు, బ్రిటనుల మధ్య పరస్పరసహాయ ఒడంబడికకు పునాదులు ఏర్పడినట్లు వర్తమానం వస్తున్నది. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో ఈ ఐదు రాజ్యాల ప్రతినిధులు తొమ్మిది రోజులపాటు సమావేశమై పరస్పర ఆర్థిక, సైనిక, వైజ్ఞానికాభివృద్ధికిగాను ఒడంబడిక ముసాయిదాను తయారుచేయ గలిగారు.

పశ్చిమ యూరప్ రాజ్యాల ఐక్యతను ఓర్వలేక, సోవియెట్ ప్రభుత్వ అధికార పత్రిక 'ఇజ్వెస్టియా' యూరప్‌ఖండ శాంతిని కూలద్రోయడానికీ, అమెరికా ధనికవాద ప్రాబల్య విస్తరణకు దోహదం చేయడానికీ బ్రస్సెల్స్‌లో పెద్ద కుట్ర జరుగుతున్నదని విమర్శ చేస్తున్నది. ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై నిలిస్తే ఇక తమ ఆట సాగదని రష్యాభయం.

ఈ విషయాన్ని గమనించే రష్యాపత్రిక పైవిధంగా ఆక్రోశాన్ని వెళ్ళగక్కుతున్నది. ఏది ఏమైనప్పటికీ ప్రపంచ ప్రజాస్వామ్య శక్తులను సంఘటితపరచడమే సోవియెట్‌రష్యా ఆధిపత్య విస్తరణకు తగిన విరుగుడు.

* * *

యూరప్‌ఖండరాజ్యాల ఫెడరల్ సమాఖ్య స్థాపన ఆవశ్యకతను తెలియజేస్తూ వివిధపార్టీలకు చెందిన బ్రిటిష్ కామన్సు సభ్యులు మొత్తం 73 మంది పార్లమెంటులో ఈ వారం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో కార్మికపక్షంవారు, కన్సర్వేటివ్ పక్షంవారు కూడా వున్నారు. కమ్యూనిస్టుపార్టీ సభ్యులు మాత్రం చేరలేదు.

ఈ తీర్మానాన్ని అనుబంధరపడమే సంభవించి, యూరప్‌రాజ్యాల ఫెడరల్ సమాఖ్య ఏర్పడినట్లయితే, అందులో చేరే ప్రతిదేశమూ తన జాతీయ స్వాతంత్ర్యాధిపత్యాన్ని కొంతవరకు త్యాగంచేయవలసివచ్చేటమాస్తవం. కమ్యూనిజము వ్యాప్తిని జయప్రదంగా ప్రతిఘటించాలంటే, ఈమాత్రం త్యాగం అవసరమే. ఇదొకటే ఉత్తమమైన పద్ధతి.

పాకిస్థాన్‌లో నా పర్యటన

పాకిస్థాన్ సుస్థిరతనుగూర్చి, ఇండియా వైఖరినిగూర్చి పలువురి అభిప్రాయాలు

ఇయాన్ స్టీవెన్స్

బుధవారంనాడు పాకిస్థాన్‌లో లాహోర్‌లోను, గురువారంనాడు భారతయూనియన్‌లో ఢిల్లీలోను, జనసంకీర్ణమైన పాత పట్టణాలలో నిర్భాగ్యులైన కాందిశీకుల మధ్య నేను విచ్చలవిడిగా తిరిగాను. ఒకచోట అందరూ ముస్లింలే; మరొకచోట అందరూ హిందువులు, సిక్కులే, ఏ కొద్దిగానైనా హిందుస్థానీ మాట్లాడగల ఏ ఆంగ్లేయుడైనాసరే, ఈరోజుల్లో, ఈ రెండుదేశాల లోను అభాగ్యులమధ్య ఎంతో స్వాగతసత్కారాలు పొందుతూ నిర్భయంగా తిరగవచ్చు. వ్యాదరోత్తేజితము విచారకరమునైన ఈ అధికృత, అధికస్వేచ్ఛ, ఆంగ్లేయులకు, ద్విజాతి సిద్ధాంతమునుండి లభించిన విషాదకర పరిణామములలో నొకటి.

నిర్భాగ్యులగు ముస్లింలు

లాహోర్‌లోని షాహల్‌మీపేట ఒక మత కలహమువలన గాక భూకంపమువలననో, విమాన దాడివలననో నష్టపడినట్లు కనపడుచున్నది. ఆరాళ్ల గుట్టలమధ్యనే అక్కడక్కడ చిన్నచిన్న పెంకుటిళ్లు కట్టుకున్నారు. ఇటువంటి ఇండ్లలో ఒకదానిలో, ఢిల్లీనుండి కాందిశీకుడుగా వచ్చిన ఒక ముస్లింతో నేను మాట్లాడితిని. ఢిల్లీలో అతడు వెండియాకులపై నగిషీపని చేస్తుండేవాడట. అక్కడనుంచి బొంబాయిమీదుగా కరాచీ వెళ్ళి, లాహోర్ చేరినాడట. నేను అతని స్వస్థలంనుండి అప్పుడే వచ్చివుండటం వలన నన్నతి డెంతో ఆప్యాయంగా చూశాడు. "ఇక్కడంతా మాకు క్రొత్తగా వుందండీ, సంతోషంగా లేదు. పైగా ఇప్పుడు, మా యీ చిన్నయిండ్లన్నీ పడగొట్టి, రెండంతస్తుల భవనాలు కడుతారట......ఇక మేము ఢిల్లీ చూడలేముకదా. మేము చాల భయభ్రాంతులమైతిమి. కాని మాకు రక్షణ లేకపోయెను" అని అతడన్నాడు. అతడు ఢిల్లీనుంచి ప్రయాణం కాకముందు నష్టపడిన బంధువులు, ఆస్తి వివరాలను నాకు తెలియజేశాడు; ప్రయాణంలో అతడు పడిన కష్టాలు, ఇప్పుడు లాహోర్‌లో అతడనుభవిస్తున్న కష్టాలుకూడా ఏకరువుపెట్టాడు.

తరువాత కొంతసేపటికి లాహోర్ క్రొత్త పట్నంలో, ఒక చెక్కుమీద సంతకం చేయటానికి కలంకోసం నా జేబు చూసుకున్నాను; కాని నా జేబులో కలం లేకపోవటంవలన అక్కడ వున్న గుమాస్తా కలం అడిగి పుచ్చుకొని సంతకం చేసి "ఈ కలం నా వ్రాతకు చాల బాగా కుదిరిపోయింది. ఇది కాజేద్దా మనిపిస్తోందే!" అని నవ్వుతూ అన్నాను నేను, "ఓ తప్పకుండా. వుంచుకోండి సార్. నాకు వున్నదంతా పోయింది. ఇంతకంటె నే చెడే దేమీ లేదు. అయినా, ఈ రోజుల్లో కలాలు నాకు కొంచెం బాధాకరములోగానే వున్నవి" అన్నాడతడు. ఆ మాట లంటూ అతను తన చేతులు విప్పి చూపించాడు. రెండు చేతులలోను, నల్లగా బొగ్గులా కాలిపోయి, తోలు వూడిపోతూ, పిల్లి పంజా అంతంత గుర్తులు కనిపించినవి. అతడి ఇంటిని తగలబెట్టినప్పుడు అతనికి మిగిలిందల్లా ఈ గుర్తులేనట!

మంచి సంధానకర్తను

ఆ రోజు షాహల్మీలో గడిచిపోయింది. మరునాడు, గురువారంనాడు ఢిల్లీలో చాంద్‌నీ చౌక్‌లో ఫైజ్ బజార్‌లో అటు యిటు తిరిగాను. లాహోర్‌లోను ఇక్కడాకూడా నేను చూపే కొద్ది సానుభూతికి వారు నన్ను ఎంతో అప్యాయంగా ఆదరించారు. అయినప్పటికీ, నిన్న నాతో అంత చనువుగా మాట్లాడిన ఆ స్నేహితులే ఇవ్వాళ ఇక్కడకు వచ్చి వీళ్ళ మధ్యనా అంత స్వేచ్ఛగా, భయం లేకుండా తిరగగలిగేవాండ్లా? వీళ్ళు అక్కడ తిరగగలరా? దేశానికి స్వాతంత్ర్యం లభించకపూర్వం ఏ సంకోచం లేకుండా వీళ్లు కలసిమెలసి వుండలా?

నేను, ఇక విదేశీయుడనుకాబట్టి, అప్పటికప్పుడే పరిచయం చేసుకుని వీరిద్దరిమధ్య సంధానకర్తగా వ్యవహరించగలగటం దురూహ్యము, అసంబద్ధముకూడాను. కాని ఇది ప్రకృతిసిద్ధమనే ఇరుపక్షాలవారు భావించారు. ఒకరినిగురించి ఇంకొకరు నాద్వారా సమాచారం తెలుసుకోవటానికి కుతూహలపడినారు. ఢిల్లీలోని నా అనుభావాలలో కొన్ని తెలియజేస్తాను.

హిందూకుమ్మరవాడు

కొయ్యలోను, ఇనుముతోను క్రొత్తగా నిర్మింపబడుతున్న రోడ్డుప్రక్క కాలిబాటపై ఒకచోట ఒకహిందూకుమ్మరవాడుకు కనిపించాడు. అతడు మృదుభాషి, ఆ బాటపైన గోధుమలమ్ముతూకూర్చున్నాడాతడు. అతనివంక నన్ను ఆకర్షించినది అతనిస్ఫురద్రూపముగాని పంచభావపూరితమైన ముఖచంద్రబింబముగాని కాదు. అతని కన్నులలో ఒకటి ఎర్రగా, శూన్యంగా వున్న గుంట. అతడిచేతులలో ఒకటి తెల్లటి కట్లతో నిండిపోయి, చేయి అని పిలువ అనర్హమైన పదార్థము. అతడు పశ్చిమపంజాబులో ఒకపుస్తకశాలలో భాగస్వామి. కల్లోలములలో అవాచ్యములైన బాధలనుభవించి ఇప్పుడీవిధంగా జీవితయాత్ర విధిలేక గడుపుతున్నాడు. ఆరోడ్డు కాలిబాట తప్ప అతనికి 'నా' అన్న నివాసస్థలమేదీ లేదు. అతడు తన కష్టాలన్నీ, విద్వేషరహితంగా, హృదయంలో అణగివున్న తత్వనిధిని వాడుకుంటూ మాట్లాడుతున్నట్లు నాకు ఎరుకపరచాడు.

ఇద్దరు సిక్కులు

బ్లాక్‌టవర్ ప్రక్కన, అక్కడే, రోడ్డుకాలిబాటపై నుంచుని మాట్లాడుతూ, ఇద్దరు సిక్కులు తమ గుడ్డలవ్యాపారం చురుకుగా సాగించటానికి నేను తోడ్పడ్డాను. ఇల్లాంటి కాందిశీకులే ఇల్లాంటి వ్యాపారానికి మూగివున్నారుగాని వారికి వ్యాపారం ఏమీ నడుస్తున్నట్లు నాకుకనపడలేదు. ఒక ఆంగ్లేయుడు, ఈ నిర్భాగ్యులిద్దరితోనూ మాట్లాడుతుండడం, దారినిపోయేవారిని ఆకర్షించింది. వారి గుడ్డలను గురించి వాకబులు ఎక్కువైనవి. అవి అమ్మడుపోవటంలో నేనుకూడా కొంత సాయపడ్డాను. బేరంలో తీరిక దొరికినప్పుడు తమ పూర్వచరిత్రను వాళ్ళు చెప్పారు. నిరిటివరకూ వాళ్ళు బాగా సంపాదిస్తున్న మెకానిక్కులట. ఇప్పుడు వాళ్ళ కొట్టు ఈ రోడ్డుమీద వేసుకున్న ఈ గుడారమే. వారికున్న ఆస్తిఅంతా ఆగుడ్డలే. సిక్కు నిర్మొహమాటంతో వారు నన్నుగురించి వివరాలన్నీ తెలుసుకున్నారు. ఇప్పుడు తాము చూడటానికే నోచుకోని తమ పూర్వస్వస్థలంనుంచి నేను ఆ రోజుననే వచ్చానని విని వారు చాలా ఆశ్చర్యపడ్డారు. "ఇక్కడ పరిస్థితులు బాగానే వున్నవి. మాకు జీవనోపాయం వుంది. త్వరలోనే మేము మా కాళ్లమీద నిలబడగలం. సిక్కులు సోమరులుకారు. వారు అడుక్కోరు" అని ఉత్సాహంగా వారన్నారు.

బారాముల్లానుంచి

వజీర్‌స్థాన్ ఆ రోజుననే వెళ్ళాను. నా స్థితి చాల తమాషాగా వుంది. భారతదేశంనుంచి వచ్చిన ఏ ఇతర వ్యక్తిఅయినాసరే ఇటువంటి స్థితిలో వుండేవాడుకాడు. వాస్తవానికి, స్వాతంత్ర్య దినోత్సవం తరువాత, భారతదేశంలో మిగిలివున్న బ్రిటిష్‌వారు చాల గొప్ప సౌకర్యాలు పొందుతున్నారు.

గులకరాళ్ళుతప్ప మరేమీ కనిపించని ఆ కొండమీది కెక్కుతూ, నా వెనకాలనే సాయుధసైనికు డొకడు నాకుకాపలాకాస్తూ వస్తున్నాడని నేను గ్రహించాను. అక్టోబరులో బారాముల దండయాత్రలో అతడు పాల్గొన్నాడట! కాని నాకేమీ పరితాపం కలగలా. చౌరంగీలో (ఢిల్లీ) సైకిల్ మీద తిరిగేటప్పుడే అప్పుడప్పుడు నాకు కొంత పరితాపం కలుగుతూండేది. విమానాలలోను, కార్లలోను, భవనాలలోను కూర్చుని విసిగివుండటం వలన, స్వేచ్ఛగా కొంచెం సేపు కొండలమీద విహరించాలని మనసుపుట్టి, ఇక్కడకు రాగానే, కొంచెం దూరం షికారు వెళ్ళివస్తానని చెప్పాను. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. నాకు తోడుగా కొంతమంది 'కసాదార్లు'—అప్పుడప్పుడు సైనికులుగా పనిచేసేవాళ్లు—నుకూడా పంపిస్తామన్నారు. వీళ్లు స్కౌట్లు కాదు. మేము బయలుదేరాము. నా ప్రక్కనే వున్న అతనికి హిందూస్తానీ తెలుసును.

అతని వజీరీ కత్తి చివరి ఒక నీలపురాయి మెరుస్తున్నది. బహుశః నగ అయివుండాలి. "అది ఎక్కడ సంపాదించావు?" అన్నాను. సంభాషణలోకి దిగుదామనే కుతూహలంతో, "పట్నంలో" అన్నాడాతడు. సంగతేమిటో పూర్వాపరాలు బాగా తెలుసుకోవలసిందే. నేను కూర్చున్నాను. చలిగాలి బాగా వీస్తోంది. నా జాకెట్ (పైకోటు) ముడి పైకిలాగాను. 'ఓ,ఓ' అన్నాడాతడు ఆశ్చర్యంతో. గుండీలు పెట్టుకో నక్కరలేని విధం ఇంకొకటి వుందని అతడికి తెలియనే తెలియదు. అయితే, అతడు అమాయకుడుగాని, మూర్ఖుడుగాని కాదు. తరువాత కొంతసేపటికే, తన చేతివ్రేలితో కాశ్మీర్‌లోయపశ్చిమ భాగపుకొన పటము ఇసుకలో వ్రాసి నాకు చూపించాడు. ఈపనే ఏ పెద్ద సైనికోద్యోగియో చేయగల్గితే చాల మెప్పు పొందేవాడు. అతడు నాతో చాల ముఖ్యమైన విషయాలు చెప్పాడు. బారాముల్లా దండయాత్రలో తన దళంలోని మహసూద్‌లు చేసిన అత్యాచారాలు—వాటికి తాను విచారిస్తున్నట్లుగాక, సైనికవిజయం దృష్ట్యా అవి తప్పని—అతనికి చాల వినుకుపుట్టించాయట. "అరే, ఇటువంటి విషయాలన్నీ నాతో చెపుతున్నావు, భలే తమాషాగాడివేనే. నేను ఇండియన్ యూనియన్‌నుంచి వచ్చానని నీకు తెలియదూ? నేను నీకు శత్రువు నౌతానుగదా!" అన్నాను నేను. అతడు స్ఫుటంగా, వెంటనే జవాబిచ్చాడు. కావచ్చును. ఈరోజు మీరు నా రక్షణలో వున్నారు. ఎప్పుడో మీరు శత్రువులౌతారన్న విషయం ఆలోచించ నక్కరలేదు." కొంచెం సేపాగి, "మీరు శత్రువని నే ననుకోను. మీరు ఆంగ్లేయులు. హిందువులు, సిక్కులు మా విరోధులు" అన్నాడాతడు.

కసాదార్లు

కసాదార్లు ప్రభుత్వసైనికులు కాదు. వారు అప్పుడప్పుడు, డబ్బుపుచ్చుకుని, నాలాంటివాళ్ళకు తోడుగా మాత్రం వస్తుంటారు. మిగతా సమయంలో వాళ్ళేమి చేస్తారో, ఎక్కడకు వెళతారో తెలియదు. వాళ్ళు ప్రభుత్వం అదుపులో వుండరు. ప్రభుత్వం వాళ్ళను అదుపులో పెట్టలేదు. పరిహద్దురాష్ట్రంలోని కొండలనుండి బయలుదేరి వస్తున్న వీరిని—వీరిపట్ల పాకిస్థాన్ ప్రజలకు చాల సానుభూతి వున్నది—పాకిస్థాన్ ప్రభుత్వం అరికట్టదలచుకుంటే, పరిహద్దురాష్ట్ర పరిహద్దులలో పాకిస్థాన్ ప్రభుత్వమే ఒక యుద్ధంలో చిక్కుకోక తప్పదు. వీరితో సంఘర్షణలోనికి దిగటం పాకిస్థాన్‌కు ఇష్టంలేదు. ఈదాడి పవిత్రకార్యమని కొండతెగలు భావిస్తున్నారు. కొండప్రజ లందరు సమూహాలుగా వెళ్ళి దాడి జరపవద్దని పాకిస్థాన్ అధికారులు వారిని నిరుత్సాహపరుస్తుండటం నేను చూచాను. అందుకు నావద్ద ప్రబలసాక్ష్యమున్నది. కొందరు కొండతెగలవారు వస్తుండగా త్రోవలో వాళ్ళను నిరాయుధులను చేయటం కూడా నాకు తెలుసును. అయినాగాని, ఈ కొండతెగలవారు 'అజాద్ కాశ్మీర్' ప్రభుత్వానికి చాలమంది చెపుతున్నంత సహాయకారులుగా లేరు. వీరు సంపాదించిపెట్టిన విజయాలు చాల తక్కువ.

మరొక దృక్పథం

ఈ సంఘటన ఆ విషయాన్ని రుజువు చేస్తున్నది—కాని బ్రిటిషు వారు, స్వాతంత్ర్యోత్సవం తరువాత ఏదో గౌరవం పొందుతున్నారనేవాదనను ఈ సంఘటన నిర్మూలిస్తున్నది.

కోహాట్‌పాస్ వద్ద, ఇంకొక రకపు కొండజాతి ప్రజల మధ్య తిరుగాడుతూండగా, నా కారు చెడిపోయింది. దానిని బాగు చేయుటంలో డ్రైవర్‌కు సహాయం అక్కరలేక పోవటం వలన, నేను ప్రక్కనే వున్న గ్రామంలోనికి వెళ్ళాను. "ఈ ప్రాంతాలలో మీ బ్రిటిషు వాళ్ళు చాలామంది వున్నారు" అన్నాడు ఒక గృహస్థు. మంచంమధ్య తాపీగా కూర్చున్న అతనిని చూస్తే, సైనికుడేమో ననిపించింది. ఇతరులంత నమ్రత, ఆప్యాయము ఇతనివద్ద లేవు. "కొన్ని నెలల క్రిందటకంటె చాల తక్కువమంది వున్నారు" అన్నాను నేను. కొంచెం సంకోచిస్తున్నట్లు, ఆలోచించాడు కళ్లు చిన్నవిచేసి నావంక తీక్ష్ణముగా చూస్తూ "ఇక్కడ మాకు వలసినంత తిండీ, బట్టా దొరకటంలేదు" అని అతడు ఆరోపణ చేశాడు. "అది బ్రిటన్ తప్పేమీ కాదే. మీకు సర్వస్వతంత్రమైన ముస్లింప్రభుత్వంవుంది. మీరు ఫిర్యాదు చేస్తున్న ఆ బ్రిటిష్ ఉద్యోగులు ముస్లిం ప్రభుత్వగులాములు, సేవకులు" అని అంటూ, క్రొత్తప్రభుత్వముయొక్క ఇబ్బందులు, అంతర్జాతీయంగా ఆహారపుకొరత మొదలగునవి అతడికి చెప్పాను. ఈవిధంగానే సంభాషణ గడిచిందిగాని అతనుమాత్రం నా మాటలు విశ్వసించలేదు. చిట్టచివరకు "మీరు చెపుతున్నట్లు, మాకు మాస్వతంత్రప్రభుత్వమే వుంటే, అందులోను ఒక ముస్లింప్రభుత్వమే వుంటే, కాశ్మీర్‌లో సిక్కులు, డోగ్రాలపై మేంచేస్తున్న యుద్ధంలో మాకు మంచి ఆయుధాలు, విమానాలు, సుశిక్షితులైన ఉద్యోగులు ఎందుకు యివ్వరు? మామీద మౌంట్‌బాటన్ గారి విమానాలు కాల్పులు జరుపుతుంటే తిరిగి కాల్పులు జరపటానికి విమానాలు మాకు ఎందుకు లేకపోవాలి? బర్మాలో అతడు మాకు సర్వసేనాధిపతి. కాని ఇక్కడ మమ్మల్నే కాల్పిస్తున్నాడు" అన్నాడతడు.

కొంచెంసేపుండి "నే చెబుతున్నా కదా ఇక్కడ బ్రిటిష్‌వాళ్ళు చాలమంది వున్నారు. ఇక్కడ తక్కువేమోగాని, మా పరిహద్దుల అవతల యింకా చాల ఎక్కువమంది వున్నారు. వాళ్లందరిలోను, నువ్వు కొంచెం మంచివాడివేమో" అని అతడే అన్నాడు. నన్నుగురించి అతడన్నమాట అతడికే వుత్సాహం కలిగించి వుండవచ్చు. వెంటనే నాకు టీ కూడా యిచ్చాడు.

పాకిస్థాన్ నిలుస్తుందా?

నేను పాకిస్థాన్‌లో పర్యటించినంత కాలములో నా మనస్సులో వున్న ముఖ్యమైన ప్రశ్న, పాకిస్థాన్ స్వతంత్రరాజ్యంగా నిలవగలుగుతుందా? అన్నదే. చిన్నతనంలో సంభవించే ఈ కష్టాలను అధిగమించగలంత జాతీయతాభావము, దూరదృష్టి పాకిస్థాన్ ప్రజలలో తగినంతగా వున్నవా?

పాకిస్థాన్‌లో, తూర్పుబెంగాల్ ఒక విచిత్ర

(18వ పేజీ చూడుడు)

నౌకానిర్మాణంలో మన ప్రాచీన ఔన్నత్యాన్ని తిరిగి అందుకోవాలి

సింధియా కంపెనీ కృషిప్రశంస

శ్రీ కపిల గోపాలరావు,

భారతదేశానికి (పాకిస్తాన్ కూడా కలుపుకొని) మొత్తం 4500 మైళ్ళ నిడివిగల కోస్తావున్నది. ఈ సముద్రతీరమంతా విస్తారమైన సహజసంపదతో అలరారే ప్రాంతం. భారతదేశం అతి ప్రాచీనకాలం నుంచీ నౌకావ్యాపారంలో అత్యున్నత స్థితిని అందుకున్న దేశం. సాలుకు 70 లక్షల టన్నులవరకూ కోస్తావ్యాపారం సాగుతున్నది. మన దురదృష్టవశాత్తూ ఈ వ్యాపారంలో నాల్గోవంతు మాత్రమే భారతదేశ నౌకాసంస్థల అధీనంలోవున్నది. ఈ నాడు మనవీ అని చెప్పుకోడానికి మొత్తం మూడులక్షల టన్నుల ప్రమాణంగల నౌకలు మాత్రమే. ఈ మూడులక్షల టన్నుల ప్రమాణంగలవైనా విదేశీయ నౌకానిర్మాణశాలలలో తయారైనవే. భారతదేశ కోస్తా వ్యాపారమంతా మనచేతులలోనే వుండాలంటే, 20 లక్షల టన్నుల ప్రమాణంవరకైనా నౌకలు వుండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. అప్పుడు విదేశాలతో ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని కూడా భారతీయ నౌకలతోనే సాగించడానికి వీలవుతుంది.


కోస్తావ్యాపారం చేస్తున్న మొత్తం అరడజను భారతీయ నౌకాసంస్థలలో ఒకటి మాత్రమే నౌకానిర్మాణ కార్యక్రమాన్ని కూడా తలపెట్టి పనిచేస్తున్నది. మిగతా కంపెనీలన్నీ పాతనౌకలతోనే తమ కార్యకలాపాన్ని సాగిస్తున్నవి. ఏ జాతి అయినా నౌకావ్యాపారంలో అభివృద్ధి సాధించ దలుచుకొంటే, అట్టి వ్యాపారానికి అవసరమైన నౌకా ప్రమాణంలో సగభాగాన్నైనా విధిగా కలిగివుండాలి. యోగ్యమైన నౌకలుతగినన్ని లేకుండా ఖండాంతరాలతో వ్యాపారంచేయ దలుచుకొంటే అది సాగేపనికాదు. బలీయమై, మంచి కట్టుదిట్టంతో చిరకాలంనుంచీ పనిచేస్తున్న అనేక ఇతర నౌకావ్యాపారసంస్థల పోటీకి మనం తట్టుకోవాలి. ఈ విషయంలో వారందరూ సిద్ధహస్తులు. సరుకు ఓడలు, ప్రయాణీకుల ఓడలు వారికి అపారంగా వున్నవారు. నౌకా ప్రపంచంలో ప్రప్రథమంగా పాటించవలసిన ప్రధాన మాత్రం టంచన్‌గా అనుకొన్న వేళకు ఇచ్చి పుచ్చుకోవడం. కాలక్రమ పట్టిక ప్రకారం నౌకలు రేవులకు వస్తూ పోతూండేటట్లు చేయడం. సరుకును అతి జాగ్రతగా ఎత్తుకొని దించుకోవడం, ఏర్ కండిషనింగు, రిఫ్రిజరేషన్ మొదలైన సౌకర్యాలను కలుగజేయడం, 12 మొదలు 18 నాట్లవరకూ వేగంతో ఓడలను నడిపించడం మొదలైనవన్నీ చాలా ముఖ్యమైన విషయాలు. భారతీయ ఓడలన్నీ ఈ అంశాలను అతి జాగ్రతగా పాటించాలి.

నౌకానిర్మాణంలో, వ్యాపారంలో భారతదేశం ఒకప్పుడు అఖండమైన ఖ్యాతిని ఆర్జించుకొన్నది. నౌకానిర్మాణం భారతదేశ అతి ప్రాచీనమైన, గొప్ప పరిశ్రమలలో ఒకటి. అన్యదేశాలు కళ్ళుతెరకపూర్వమే భారతదేశంలో నౌకానిర్మాణ పరిశ్రమ మహోన్నతస్థాయిని అందుకొన్నది. సముద్రయానానికీ, నదీజల విహారానికీ పనికివచ్చే నౌకలను ఏవిధంగా నిర్మించవలసిందీ తెలియజేసే ఒక ఉద్గ్రంథాన్ని మనప్రాచీనులు సంస్కృత భాషలో రచించారు. ఆ గ్రంథంలో చెప్పినట్లు శాస్త్రయుక్తంగా నిర్మించిన పెద్ద నౌకలు ఒకటి 276 అడుగుల పొడవూ 36 అడుగుల వెడల్పూ, 27 అడుగుల ఎత్తూ కలిగివుండేవి. 17 వ శతాబ్దానికి పూర్వం ప్రపంచంలోవున్న నౌకలన్నిటిలోనూ భారతదేశనౌకలే చాలాపెద్దవి. మనదేశంలో తయారైన నౌకలు పనిచేసినంతకాలం మరేవీ పనిచేసేవికావు. వీటికి ఇంత మనుగడ ఎక్కడనుంచి వచ్చిందని వివిధదేశాలవారూ ఆశ్చర్య విభ్రమాలు చెందేవారు. ఇంగ్లండులో 'ఓకెన్ వాలా' అనే ఓడను నిర్మించినవారు సైతం మనదేశపు నౌకల పుట్టుని, మనుగడనుచూసి ఆశ్చర్య చకితులైనారు.

నౌకానిర్మాణ పరిశ్రమలో భారతీయులు సిద్ధహస్తులనే విషయాన్ని బ్రిటిష్‌వారు ఏనాడో గమనించారు. దాదాపు శతాబ్దం క్రిందటవరకూ కూడా బ్రిటిష్‌వారికి కావలసిన కొయ్యఓడలను బొంబై నగరంతయారుచేసి సప్లాయిచేస్తుండేది. 19 వ శతాబ్దంలో స్లూప్స్, ఫ్రిగేట్లు మొదలైన ఉక్కు ఓడలను కూడా బ్రిటిష్‌వారికి భారతదేశమే నిర్మించి ఇస్తుండేది. భారతదేశంపై బ్రిటిష్‌వారికి రాజకీయాధిపత్యం ఏర్పాటై వృద్ధిచెందడంతో, బ్రిటిష్ నౌకా నిర్మాణ వ్యాపారస్థుల లాభాలు కట్టిపెట్టడానికి భారతదేశ నౌకా నిర్మాణ వ్యాపారాన్ని అణగదొక్కివేశారు. అంతటితో బ్రిటిష్ నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధిచెందింది. భారత పరిశ్రమ అణగారిపోయింది. నౌకా నిర్మాణ పరిశ్రమ ఎప్పుడు నాశనమైందో, అప్పుడే సముద్ర జలాలపై భారత నౌకలు కూడా అదృశ్యమైపోయినవి. ఈ పరిశ్రమలపై బ్రతుకుతున్న వేలకొద్ది భారతీయులు నిరుద్యోగులైనారు. ఈవిధంగా భారత నౌకా వ్యాపార జీవితానికి ఒక పెద్ద ఆఘాతం సంభవించింది.

మన ప్రస్తుత జాతీయవసరాలకు అనుగుణంగా భారత నౌకా నిర్మాణ పరిశ్రమ తిరిగి సక్రమంగా యథాస్థాయిని పొందవలెనంటే, ప్రభుత్వాదరణ వుంటేనేగాని సాధ్యపడదు. పారిశ్రామికంగా అపారమైన అభ్యున్నతిని సాధించిన బ్రిటన్, అమెరికా దేశాలలో నౌకా నిర్మాణ పరిశ్రమకు ఆయా ప్రభుత్వాలు ఏదోవిధంగా సహాయపడి ఆదరిస్తున్నవి. భారత నౌకా నిర్మాణ పరిశ్రమకుకూడా అత్యవసరంగా అట్టి సహాయం వుండితీరాలి.

భారతదేశంలో ప్రధానమైన నౌకా నిర్మాణ సంస్థలు ఐదేవిదు వున్నది. 1944, 1945, 1946 సంవత్సరాలలో ఇవి 10270, 8508, 18544 టన్నుల ప్రమాణంగల చిన్న లాంచీలను మాత్రమే నిర్మించగలిగినవి. ఇవీ కోస్తావ్యాపారానికి ఉపయోగపడే లాంచీలు కావు.



జల ఉష నమూనా

సముద్రయానానికి ఉపయోగపడే నౌకలను నిర్మించడానికి ఒక్క సింధియా స్టీం నేవిగేషన్ కంపెనీమాత్రమే ఉద్యమించి, ఒక నౌకా నిర్మాణశాలను స్థాపించింది. భారతదేశంలో ఆధునిక నౌకా నిర్మాణ చరిత్రను చెప్పవలెనంటే సింధియా నౌకా నిర్మాణశాల చరిత్రనే చెప్పవలసి వుంటుంది.

భారతదేశంలో నౌకా నిర్మాణశాలలు లేవనేలోటు ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైన మొదటి సంవత్సరంలోనే కనబడింది. శత్రు సబ్మెరైనులు అనేక ఓడలను సముద్రగర్భానికి ముంచివేయడంవల్ల, దేశ ఎగుమతి దిగుమతివ్యాపారాన్ని సక్రమంగా సాగించడానికీ, కోస్తా, రక్షణ ఏర్పాట్లను బలీయంగా చేసుకోడానికీ, విదేశానికి ఆదేశంలోనే నౌకా నిర్మాణ సౌకర్యాలు వుండడం అవసరమనే విషయాన్ని ప్రతి దేశంవారూ గమనించారు. భారతదేశానికి కావలసిన వ్యాపారనౌకలను భారతీయ నౌకానిర్మాణశాలలలోనే నిర్మించి పరిశ్రమను వృద్ధి చేయుట అవసరమనే ఉన్నతాశయంతో సింధియా స్టీం నేవిగేషన్ కంపెనీవారు పని ప్రారంభించారు.

ఎన్నెన్నో అవరోధాలను ఎదుర్కొని, ఎంతో శ్రమపడి ఈకంపెనీ 1941, జూన్ 21 వ తేదీన విశాఖపట్నంలో నౌకా నిర్మాణశాలకు శంకుస్థాపనచేసి, ఈ నూతన పరిశ్రమకు ఉపక్రమించగలిగింది.


ఆధునిక నౌకా నిర్మాణశాలకు ముఖ్యాంగాలుగా ఇవి వుండితీరాలి (1) తగినస్థలం (2) కావలసినంత లోతుగల నీటిసౌకర్యం (3) ముడిపదార్థాల సామీప్యం (4) అందుబాటులో కార్మిక బలగం సప్లయి (5) డ్రైడాక్ సౌకర్యాలు (6) రైలుమార్గం, రహదార్ల సౌకర్యాలు (7) త్రాగడానికి పనికి వచ్చే మంచినీరు.

విశాఖపట్నంలో ఈ సౌకర్యాలన్నీ సమకూడినవి. భారతదేశంలో ఈ విధంగా నౌకానిర్మాణశాలను ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. 10 వేల టన్నుల ప్రమాణంగల నౌకలను అక్కడ నిర్మించడానికి అవకాశం వున్నది.

తయారయే నౌకలన్నిటినీ ఇండియా ప్రభుత్వానికే ఇవ్వడానికి సమ్మతించినట్లయితే, కొంతమంది సాంకేతిక నిపుణులను పంపి సహాయపడడానికి బ్రిటిష ప్రభుత్వ నౌకాశాఖ ఇదివరకు ఒప్పుకున్నది. పని ఇదివరకే ప్రారంభించి వప్పటికీ ఈ కంపెనీ ఎన్నో చిక్కులను ఎదుర్కొనవలసి వచ్చింది. 1942 ఏప్రిల్‌లో విశాఖపట్నంపై జపాన్ విమానాల దాడి జరిగినప్పుడు ప్రభుత్వాదేశం ప్రకారం పనినే ఆపివేయవలసి వచ్చింది. తిరిగి 1948 లో గాని పని ప్రారంభం కాలేదు. కంపెనీకి మూలధనం క్రింద ఇప్పటివరకూ 4 కోట్ల రూపాయలు వెచ్చించారు. నౌకా నిర్మాణశాలను పూర్తిగా ఏర్పరచడానికి ఇంకా 6 కోట్ల రూపాయలు అవసరమని అంచనా. నాణ్యమైన ఉక్కు, కలప, ప్రొపెల్లింగ్ యంత్రాలు వుంటేగాని పని సాగదు. ప్రస్తుత ధరల ప్రకారం ఒక్కొక నౌకను నిర్మించడానికి 50 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. ఇదే ప్రమాణంగల నౌకను బ్రిటనులో నిర్మించడానికి 86 లక్షలవుతుంది. (1946 ధరల ప్రకారం.)

ఈ కంపెనీ తమకు కావలసిన విద్యుచ్ఛక్తిని ప్రభుత్వంవద్ద కొంటున్నది. ప్రత్యేక సబ్ స్టేషన్ను నిర్మించి, కావలసిన విద్యుచ్ఛక్తిని సప్లయి చేసుకుంటున్నది. సింధియా నౌకా నిర్మాణశాలలో 3000 మంది కార్మికులు పని చేస్తుంటారు: వీరుగాక కంట్రాక్టర్ల వద్ద మరొక 8 వేల మంది వుంటారు. వీరికి ప్రత్యేక నివాస సౌకర్యాలు వున్నవి

సాంకేతిక నిపుణులలో 7 గురు యూరోపియన్లు వున్నారు. వీరు బ్రిటిష్ నౌకా నిర్మాణశాలలలో పని చేసిన అనుభవజ్ఞులు. సరుకు ఓడలను, ప్రయాణీకుల ఓడలను కూడా ఇక్కడ నిర్మించవచ్చు.



నౌకా నిర్మాణశాలలో అత్యంత ప్రధానమైన భాగము, దీనిని లాఫ్ట్‌ఫ్లోర్ అంటారు, నౌకలతాలూకు వివిధ భాగాలకు ఇక్కడ కొయ్య నమూనాలు తయారు చేస్తారు.

భారత రాజకీయాలు :

సామాజికాభ్యున్నతి ముసుగులో ముస్లింలీగ్

పదేండ్లలో నిరక్షరాస్యతా నిర్మూలనానికి

మద్రాసులో జరిగిన ముస్లింలీగ్ కౌన్సిల్ సమావేశములో ముస్లి లీగ్‌ను పునరుద్ధరించి నడుపుటకే భారత ముస్లింలీగర్లు నిర్ణయించినారు. కాని ఈ నిర్ణయము భారత ముస్లిముల దనిగాని, ముస్లింలీగ్ లోవున్న ముస్లిములలో అధిక సంఖ్యాకుల దనిగాని చెప్పవీలులేదు. భారత ముస్లింలీగ్ కౌన్సిల్ లోగల 150 మంది సభ్యులలో ఈసభకు కేవలం 30 మంది మాత్రమే హాజరైరి. ముఖ్యమైన రాష్ట్రములగు యు. పి., పశ్చిమబెంగాలు, తూర్పు పంజాబుల నుండి ఒక్క ప్రతినిధికూడ ఈ సమావేశమునకు రాలేదు. పైగా ఆయా రాష్ట్రములలో ముస్లిం లీగ్ సంస్థను త్వరితగతిని వారు రద్దు చేసుకొనుచున్నారు. ఇక ఈ సమావేశమునకు హాజరైనది కేవలము దక్షిణ భారత ముస్లిములు మాత్రమే. మదరాసు, బొంబాయి, మైసూరులలోని లీగర్లు మాత్రమే ఈ సభలో అధికముగా నుండిరి. ఈ సభకు హాజరుగాని ముస్లిం లీగర్లు తమ ప్రాంతములలోని లీగ్‌ను రద్దు చేసుకొనుచున్నారు. కాబట్టి వారు లీగ్‌ను కొనసాగించుటకు ఇష్టపడరని తేలిపోవుచున్నది. అట్టి పరిస్థితులలో భారతదేశంలోని ముస్లింలీగ్ కౌన్సిల్ సభ్యులలో 150 మందికి 27 గురు మాత్రమే లీగ్‌ను ఏ రూపములోనైనను కొనసాగించుటకు ఇష్టపడుచున్నట్లును, తక్కిన 123 రును లీగ్‌ను రద్దుచేసి వేయవలెననియే పట్టు బట్టుచున్నట్లును తెల్లముగుచున్నది. అదియుగాక దేశవిభజనవలన సంభవించిన విషాదకర పరిణామములను కన్నారచూచి, తాము పూర్వమనుసరించిన విధానమునకు మనసార పశ్చాత్తాపపడిన ఉత్తరహిందూదేశములోని ముస్లింలు లీగ్ రద్దుకావలెననియే కోరుచున్నారు. ద్విజాతి సిద్ధాంతపు విషపరిణామములను అనుభవించని దాక్షిణాత్యముస్లింలు మాత్రము లీగ్‌ను పట్టుకుని ప్రాకులాడవలెనని అభిలషించుచున్నారు. దేశ విభజనకు పూర్వము ముస్లిం లీగ్‌ను తీవ్రముగా బలపరిచినది ముస్లింలు అల్పసంఖ్యాకులుగానున్న రాష్ట్రములలోని ముస్లింలే. తాము కష్టపడి పోషించిన లీగ్ విషసర్పమై తమకే ఎట్లు హానికరముగ పరిణమించినదో వారు సమయము మించిపోయిన తర్వాత గ్రహించి, పశ్చాత్తప్తులైనారు. కాని అట్టి అనుభవము తమకు జరగనందువలననే, బహుశః దక్షిణాదిముస్లింలు లీగ్‌కు యింకను అంటిపెట్టుకొని యుండవచ్చును. గతానుభవమువల్లనైన తమ విధానమును చక్కబరచుకొనలేక పోవుచున్న ఈ ముస్లింలీగర్లను ఏమనవలయును ?

దక్షిణమున నున్న హైదరాబాద్ సంస్థానము ముస్లింరాజుచే పరిపాలింపబడుచున్నది అచ్చటి ముస్లింలు చాల సుసంఘటితులైవుండి, స్వతంత్ర ముస్లింరాజ్యమును స్థాపించవలెనని పట్టుదలతో పనిచేయుచున్నారు. అట్టి పరిస్థితులు హైదరా



అలీబేగ్

బాద్ సంస్థానములో ముస్లిమేతరులపై జరుగుచున్న అత్యాచారములు దక్షిణరాష్ట్రములలోని హిందువుల నుద్వేగపరచి, అకృత్యములకు ప్రోత్సహించు ననుటలో అసంబద్ధమేదియులేదు. వారు అకృత్యములకు గడంగకుండ అదుపులో పెట్టుటకు, రాష్ట్రప్రభుత్వము లన్నియు నిశ్చయించియున్నవి. కాని ముస్లిములు తాము పూర్వవిధానమునే అనుసరించుచు, దేశవిచ్ఛిన్న విధానమునే అవలంబించుచున్నచో, వారి పొరుగుననున్న హిందువుల ఉద్వేగమును రెచ్చగొట్టుట, ప్రభుత్వము చేయుచున్న కృషికి విఘ్నము కలిగించుటతప్ప మరేమి జరుగును ?

ముస్లింలీగ్ ఇకముందు రాజకీయపక్షముగా వ్యవహరించ నక్కరలేదని కౌన్సిల్ సమావేశమునకు హాజరైన సభ్యులు భావించుచున్నారట. శాసనసభలలోని ముస్లింలీగ్ సభ్యులు మరే ఇతర రాజకీయ పక్షములోనైన జేరి పనిచేయవచ్చునట. సంకుచిత ఆశయములుగల ముస్లిం లీగ్ సభ్యులు, విశాల, జాతీయ దృక్పథముగల ఇతర రాజకీయ పక్షములలో సభ్యులుగా నుండుట ఎట్లు సాధ్యపడునో దురూహ్యము. భారతదేశములో ఇతర మత రాజకీయసంస్థలన్నియు ఆ కార్యక్రమము మానివేసినవికాబట్టి పైకి తామును అట్లే కనుపించి, నిగూఢముగా తమ కార్యమును నెరవేర్పవలెనని ముస్లింలీగ్ సభ్యులు ఆశించుచున్నారా ? ఎట్లయినను ముస్లింలీగ్ కౌన్సిల్ చేసిన ఈ నిర్ణయము అనాలోచితము, స్వార్థపూరితము, భారత ముస్లింలకే ప్రమాదహేతువనియు నిస్సందేహముగా చెప్పవచ్చును. ఇట్టి ముస్లింలీగ్‌ను విడనాడి విశాల జాతీయ దృక్పథముగల ఇతర రాజకీయ పక్షములలో జేరి ఈ దేశ గౌరవమును, తద్వారా తమ శ్రేయస్సును అభివృద్ధి పరచుకొనుటకు తగినట్లుగా భారత ముస్లింలు వ్యవహరించవలెను.

పాకిస్థాన్ పరిపాలన :

సరిహద్దు గాంధి సూచనలు

సరిహద్దు గాంధి ఖాన్ అబ్దుల్ గఫూర్



అబ్దుల్ గఫూర్ ఖాన్


ఖాన్, ఆయన సోదరుడు డా. ఖాన్‌సాహెబ్ గారలు ఆది నుండియు కాంగ్రెస్ పక్షపాతులై దేశవిభజనను ప్రతిఘటించినారు. కాని కాంగ్రెస్ దేశవిభజనకు ఏనాడు సమ్మతించినదో ఆనాడు వారును తమ అభిప్రాయమును మర్చుకుని, పాకిస్థాన్‌లో పఠానులందరు ఒక ప్రత్యేక రాష్ట్రముగా—ఒక పఠానిస్థాన్‌గా ఏర్పరుచబడి, పాకిస్థాన్‌లో అంతఃభాగముగు ఒక రాష్ట్రముగా ఉండవలెనని కోరుచున్నారు. వీరి ఈ కోర్కెకు లీగ్ నాయకులు విపరీతార్థములు కల్పించి, ఖాన్ సోదరులు పాకిస్థాన్ వ్యతిరేకులనీ, పాకిస్థాన్‌ను కూలదోయుటకు ప్రయత్నించుచున్నారనీ ప్రచారము చేయసాగిరి.

దేశవిభజనతిరువాత ఖాన్ సోదరులనుగురించి గాని, సరిహద్దురాష్ట్రమునుండి వార్తలు వచ్చుటయే చాలవరకు తగ్గిపోయినది. ఖాన్‌సోదరుల యెడ లీగ్ వ్యతిరేకప్రచారము నానాటికి వృద్ధియగుచు, ఖాన్ సోదరులను ప్రజల దృష్టిలో న్యూనత పరచుచున్నది. వాస్తవమునకు, కాంగ్రెస్ ఏనాడు దేశవిభజనకు అంగీకరించినదో, ఖాన్ సోదరులు ఆనాడే అంగీకరించిరి. కాని లీగ్ వారి ఆమోదముతో సంతృప్తిజెందక వారి పలుకుబడిని నాశనము చేయుటకే ఈ దుష్ప్రచారము మొదలిడినది. లీగ్ ప్రచారములోని అసత్యమును ప్రపంచమునకు వెల్లడించుట, పాకిస్థాన్ పరిపాలనలో జరుగుచున్న అక్రమముల నెత్తిచూపించి, సక్రమపరిపాలనను స్థాపించుట తమ ప్రస్తుత కర్తవ్యము లని ఖాన్ సోదరులు గుర్తించినారు. అందువలననే, సరిహద్దుగాంధి పాకిస్థాన్ రాజ్యాంగపరిషత్తు సమావేశములకు హాజరై, తమపై జరుగుచున్న దుష్ప్రచారమును ఖండించుచు, పాకిస్థాన్ పాలనలోని లోపములను విమర్శించుచు, ప్రజాస్వామ్యసంస్థల స్థాపనద్వారా పాకిస్థాన్ పరిపాలన చక్కబరచవలెనని సూచించుచున్నాడు. అదృష్టవశాత్తు, బెంగాల్ మాజీ ప్రధాని సుహ్రవర్దీ కూడ ఈ విషయములో సరిహద్దు



సుహ్రావర్ది

గాంధికి తోడ్పడుచున్నాడు. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పద్ధతులపై పరిపాలన జరిపించవలెనను ఆశయముతో, పనిచేయు ఒక రాజకీయపక్షమును స్థాపించవలెనని సరిహద్దుగాంధి ప్రయత్నించుచున్నట్లుకూడా వార్తలు వచ్చుచున్నవి. ఇన్నాళ్ళనుండి లీగ్ ప్రచారమునకు మభ్యపడిపోయిన ముస్లిములలో ప్రజాస్వామ్య ప్రచారము ఇప్పుడైనను జరుగుట అత్య




జిన్నా

వసరమని లీగ్ నాయకులలోనే కొందరు గుర్తించుచున్నారు. ఇట్టివారందరూ సరిహద్దు గాంధీ ప్రయత్నములను బలపరచినచో పాకిస్థాన్ ప్రజానీకము శ్రేయోభివృద్ధికి పాటుబడినవారగుదురు. ప్రజాస్వామ్య భారతదేశముతో, ప్రజాస్వామ్య పాకిస్థాన్ సన్నిహిత మైత్రితో వ్యవహరించగలదు.

పాకిస్థాన్ ప్రస్తుతపాలకులు ప్రజాస్వామ్యమునకు చాల దూరముగ నున్నారనుటకు తూర్పు బెంగాల్‌లో రాజభాష విషయమై జరుగుచున్న సంఘర్షణయే ప్రబలనిదర్శనము. తూర్పు బెంగాల్ ముస్లింలకు, దక్షిణదేశములోని ముస్లింలకు వలెనే, ఉర్దూ భాష సరిగా రాదు. బెంగాలీభాషనే వారు తమ మాతృభాషగా తలంచుచున్నారు. కాని పాకిస్థాన్ స్థాపనానంతరము వారిపై ఉర్దూభాషను రుద్దవలెనని లీగ్ నాయకులు అభిప్రాయపడుచున్నారు. ఫజ్‌లుల్‌హక్ వంటి ప్రఖ్యాతనాయకునే ఒక బహిరంగసభలో లాఠీచార్జి చేసినారన్నచో, తూర్పుబెంగాల్‌లో ఎట్టి నిరంకుశప్రభుత్వము నడచుచున్నదో ఊహించుకొనవచ్చును. ఇట్టి నిరంకుశ పరిపాలనను ప్రజాస్వామ్య పద్ధతులకు మార్చుటకు సరిహద్దుగాంధీ పూనుకొనుట ముదావహము.

నిరక్షరాస్యతానిర్మూలనకు పథకం

భారత అధినివేశ శాసనసభలో మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధిని గూర్చి ఒక ముఖ్య ప్రకటన చేశారు. పది సంవత్సరములలో దేశములోని ప్రజలందరికి చదువను, వ్రాయను నేర్పు



ఆజాద్



దుర్గాబాయి

సమాటుపరచి సాగించటానికి ప్రయత్నాలు

మౌలానా ఆజాద్ కంకణధారణ



సి. ఆర్. రెడ్డి

టకు ప్రభుత్వ మొక పథకమును తయారుచేసినది. వయోజనులలో నిరక్షరాస్యులందరికి చదువు నేర్పుటకు కావలసినంతమంది ఉపాధ్యాయులిప్పుడు మన దేశములో లేరు కాబట్టి, చదువుకున్న ప్రతివారూ ఇతరులకు చదువు నేర్పుటకు కొంతకాలము విధిగా నిర్బంధముగా పని చేయవలసి యుండునని మౌలానా ఆజాద్ చెప్పినాడు. చదువు నేర్చుకొనుటకు నోచని తమ దురదృష్టవంతులగు సోదరులకు విద్యాబోధ గరుపుటకు, విద్యార్థులందరు కొంత వరకు ప్రయాసపడి పని చేయక తప్పదు. ఇందుకు ఎంతమంది విద్యార్థులు ఎంత త్వరగా ముందుకు వచ్చిన అంత మంచిది. ఈ నిరక్షరాస్యతా నిర్మూలన ప్రణాళిక అమలుజరుపుటకు సంవత్సరమునకు 24 కోట్ల రూపాయలు ఖర్చగునని మౌలానా ఆజాద్ అంచనా వేసినారు. ఈ మొత్తములో ఎక్కువ భాగమును రాష్ట్ర ప్రభుత్వములే భరించవలయును. కాని రాష్ట్రములు విద్యాభివృద్ధికి ఖర్చు చేస్తున్న మొత్తములు చాల తక్కువ. అవి ఇప్పటి విద్యాసంస్థల పోషణకే చాలుటలేదు. మన రాష్ట్రములో కొన్ని విద్యాసంస్థలను మూసివేయవలసి వచ్చునని కూడ మన విద్యాశాఖమంత్రిగారు ఈమధ్యనే తెలిపియుండిరి. కాబట్టి విద్యావ్యాప్తికి కేంద్రప్రభుత్వము రాష్ట్రప్రభుత్వములకు ప్రత్యేక ఆర్థికసహాయ మొసంగిన గాని, మౌలానా ఆజాద్ తయారు చేసిన పథకం ప్రకారం విద్యావ్యాప్తి జరగునవకాశములేదు. వయోజనులలో విద్యావ్యాప్తికి విద్యావంతులందరు సహకరించుట ఎంత అవుసరమో, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయముకూడ అంత అవుసరమే నని గుర్తించవలెను.

విద్యాసంస్థలలో విద్యార్థులను చేర్చుకొనుటలో చూపిస్తున్న కులవివక్షతను ఖండించుచూ కేంద్రశాసనసభలో శ్రీమతి దుర్గాబాయి చేసిన విమర్శనను మౌలానా ఆజాద్ హర్షించి, అట్టి వివక్షత జరుగకుండునట్లు చూచెదమని వాగ్దానము చేసినారు. వెనకబడియున్న తరగతుల విద్యార్థులకు ప్రభుత్వ మన్ని విధముల సహాయము చేసి తీరవలసినదే; కాని కేవలకులభేదమువలన, ప్రయోజకులగు విద్యార్థులకు విద్యావకాశములు లేకుండ చేయుటమాత్రము హర్షింపదగదు. అన్ని రంగములలోను సర్వతోముఖాభివృద్ధి జరుగవలసియున్న ఈ రోజులలో, ప్రయోజకులకు వారికి అవకాశము లేకుండజేయుట దేశశ్రేయోభివృద్ధికే భంగకరము. వెనుకబడివున్న తరగతులకు



మీర్ లెక్ అలీ

సహాయము చేయుటకు ప్రభుత్వము వారికి ఆర్థికసహాయము విరివిగా చేయవచ్చును. అంతేగాక, నూతన పాఠశాలలు, ముఖ్యముగా ఉన్నత, సాంకేతిక విద్యల బోధించు పాఠశాలలు దేశమంతటా విరివిగా స్థాపించి ఎక్కువమంది సాంకేతిక విద్యల నభ్యసించుటకు అవకాశము లివ్వవలెను. ఈ విషయములో కేంద్రరాష్ట్ర ప్రభుత్వములు జరుపుచున్న నూత్నప్రయత్నములు చాల తక్కువనియే చెప్పవలసివచ్చుచున్నది.



పండిట్ కుంజ్రూ



స్వామి రామానందతీర్థ

హైదరాబాద్ సంస్థానంలో విషమ పరిస్థితులు

హైదరాబాద్ సంస్థానం భారతప్రభుత్వంతో శాశ్వత ఒడంబడిక చేసికొనుటకు చేసిన ప్రయత్నములు విఫలమైనప్పటినుండి సంస్థానములోని పరిస్థితులు నానాటికి విషమిస్తున్నవి. సంస్థానంలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వస్థాపన విషయమై భారతప్రభుత్వం ప్రస్తావించటం నిజామునకు, ఇత్తేహాద్ ముస్లిమ్ సంస్థకు ఇష్టంలేదు. తమ సంస్థానం స్వపరిపాలనకన్న, సుపరిపాలనమే ఎక్కువని భావిస్తున్నదనీ, స్వపరిపాలనవిషయం ప్రస్తావించటానికి భారతప్రభుత్వానికి హక్కు లేదనీ, సంస్థానంలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వ స్థాపనను కోరుచున్నది బ్రాహ్మణులుమాత్రమే నని ఈమధ్యనే ఇత్తేహాద్ అధ్యక్షుడు కాశీంరజ్వీ విమర్శించినాడు. సంస్థానములోని బ్రాహ్మణేతరులు, లింగాయతులు, వెనుకబడివున్న తరగతులు ప్రస్తుత ప్రభుత్వమునే బలపరుచుచున్నారని కూడ రజ్వీ గర్జించెను. స్వార్థపరులగు కొందరు నాయకులు బాధ్యతారహితముగా, నామమాత్రపు మంత్రి పదవులకు అంటిపెట్టుకుని వుండుటవలననే రజ్వీ ఇట్లు చెప్పగలిగెను. తమ పొరపాటును, కొంతకాలం క్రిందటనే స్వతంత్ర అభ్యుదయ పక్షం వారు గుర్తించి, శాసనసభలో తమ సభ్యత్వమునకు రాజీనామా ఇచ్చిరి. లింగాయత్‌లు కూడ ఇప్పటికి తమ తప్పును తెలుసుకొనగల్గిరి. మంత్రి పదవులకు, శాసనసభకు అంటిపెట్టుకుని వుండటం వలన వారు తమ సంస్థానమునకు ద్రోహమొనరించుచున్న సంగతి వారు గ్రహించి మరొక పక్షం రోజులలోగా సంస్థానంలో శాంతియుత వాతావరణం ఏర్పడక పోతే తాము తమ సభ్యత్వములకు రాజీనామా నిచ్చెదమని నిజాంకు తెలియజేసినారు. సంస్థాన గ్రామాలపై ఇత్తేహాద్ సభ్యులు ప్రతిదినము దాడులు



సి. హెచ్. భాభా

జరుపుచుండుటచే ప్రజలు భయభ్రాంతులైవున్నారు. ప్రతి జిల్లానుండి విషాదకర వార్తలు ప్రతిరోజూ వస్తున్నవి. ఇట్టి పరిస్థితులలో, వివేకవంతుడైన పౌరుడెవ్వడైనను తన బాధ్యతను గుర్తించకుండా వుండలేడు. సంస్థానంలోని వకీళ్ళందరు తమ వృత్తికి స్వస్తి చెప్తున్నారు. గ్రామోద్యోగులు తమ పదవులకు రాజీనామా లిస్తున్నారు. ఈసంస్థాన పరిపాలనా యంత్రం దినదినము దుర్బలమై పోతున్నది. ఈ విధంగా పరిపాలనాయంత్రం భగ్నమై, అరాచకం ఏర్పడకముందే నిజాం తన సంస్థానంలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వమును ఏర్పరచిన మంచిది.

రక్షణశాఖ అభివృద్ధి

రక్షణశాఖ ఖర్చుల విషయమై అధినివేశ శాసనసభలో ప్రస్తావిస్తూ, రక్షణశాఖమంత్రి సర్దార్ బలదేవ్‌సింగ్ గారు రక్షణశాఖ తలపెట్టిన నూతన కార్యక్రమమును వివరించిరి. దేశములోని విద్యార్థులకు సైనికశిక్షణ యిచ్చుటకు, ప్రాంతీయ సైనికదళములను నెలకొల్పుటకు, రక్షణశాఖ నిర్ణయించినదని ఈయన తెలియజేసినాడు. విద్యార్థుల సైనికశిక్షణ విషయములో కుంజ్రూకమిటీ చేసిన సూచనలను ప్రభుత్వము ఆమోదించినది. ఈ సూచనల ప్రకారం దేశములో విద్యార్థులకు సైనికశిక్షణ యిచ్చుటకు మూడు ప్రత్యేకదళములు ఏర్పరుచబడును. మెట్రిక్యులేషన్ ప్యాసయి, పై తరగతులలో చదువుచున్న విద్యార్థుల దళము ఒకటి, మెట్రిక్యులేషన్‌లో పై తరగతులలో నున్న విద్యార్థులకు మరొకదళము, బాలికలకు మరొకదళము, మొత్తం మూడుదళములు ఏర్పరుచబడును. వీనిలో ప్రథమదళమునుండి భారతసైన్యమునకు కావలసిన ఉన్నతోద్యోగులను ఏరుకొనుటకు అవకాశముండునని భావించబడుచున్నది. తక్కిన రెండుదళములు భావిపౌరులలో ఒకవిధమైన నూత్నఉత్సాహము, కార్యదీక్ష కలిగించుటకు ఉపయోగపడును. ఈదళములకగుఖర్చు ఆదిలో 3 కోట్ల 65 లక్షలరూపాయలు; తరువాత ప్రతి సంవత్సరము 2 కోట్ల 54 లక్షలరూపాయలు అగునని అంచనా వేయబడినది. విద్యార్థులందరు ఉత్సాహముతో ఈ దళములలో జేరి, భావి పౌరులుగా, దేశములో క్రమశిక్షణాయుత ప్రవర్తన వ్యాప్తిజెందుటకు తోడ్పడవలెను.


రక్షణశాఖ వ్యయము 1938-వ సం. వ్యయముతో పోల్చిచూచిన దాదాపు మూడురెట్లు పెరిగినది. కాని సైన్యముమాత్రము తగినంత పెరగలేదు. పైగా దేశరక్షణ బాధ్యత ఇప్పుడు మనపైననే వుండుటవలన, దేశములో సుశిక్షిత సైన్యము తగినంత ఉండుట అత్యావశ్యకము. దేశరక్షణకొరకు అవుసరమైనప్పుడు సమాయత్తపరుచ వీలగు ప్రాంతీయ సైన్యమును తయారు చేయుటకు ప్రభుత్వము వెంటనే పూనుకొనవలెను. రానున్న సంవత్సరమునుండి రక్షణశాఖ ఆదాయవ్యయ పట్టికను ప్రత్యేకముగా తయారు చేసి, ప్రతిపాదించుటకు రక్షణ మంత్రి అంగీకరించిరి. ఇందువలన రక్షణ వ్యవహారములు విశదముగా చర్చించుటకు శాసనసభ్యులకు, ప్రజలకు అవకాశము లభించును.

రక్షణశాఖ వ్యయమునుగూర్చి ప్రస్తావించుచు పండిట్ హృదయనాథకుంజ్రూ కాశ్మీర్ యుద్ధములో భారతసేనల మందగమనమును విమర్శించిరి. కాశ్మీర్ యుద్ధములో మొదటి రెండు, మూడు వారములలో సాధ్యపడిన పురోగమనము తరువాత సాధ్యపడక పోవుట చాలమందికి అసంతృప్తి నిచ్చినది. శీతాకాలము ప్రవేశించి కొండ ప్రాంతములో యుద్ధము జేయవలసి వచ్చుటచే ఆరంభములో కొంత సబబు ఏర్పడియుండవచ్చును. కాని ఆ రంగములో శత్రువులను నిశ్శేషముగా తరిమివేసి యుండినచో, భద్రతామండలికి ఫిర్యాదు, మొదలగు అనవసర తతంగము జరుప నవసరము లేకుండా పోయెడిది. కాశ్మీర్ యుద్ధము వీలైనంత త్వరలో జయప్రదముగా ముగియునట్లు చూచుట రక్షణ శాఖా మంత్రి కర్తవ్యమై వున్నది.



సర్దార్ బలదేవ్‌సింగ్

సాహిత్య మీమాంస :



విషాదాంత కావ్యములు

శ్రీ చోడవరపు బాబూరావు

కావ్యము విషాదాంతమో, మోదాంతమో నిర్ణయించుటలో, విషాదాంత కావ్యముల గూర్చి రెండు ముఖ్యమగు వాదము లున్నవి. కావ్యము విషాదముగ అంతమొందినచో నది విషాదాంతమని యొక వాదము. కావ్యము యొక్క అంత మెట్లున్నను, కథాగమనమున పాఠకుని మనస్సులో జనించిన భావములబట్టియే ఖేదాంత, మోదాంత నిర్ణయము జరుగవలయు నని రెండవ వాదము. మొట్టమొదటి వాదులు చాల తక్కువమందియున్నను, రెండవపక్షపు వాదులకు గూడ విషాదాంతకావ్యమునుగూర్చి సరియగు నభిప్రాయ మున్నట్లు కన్పించదు; వారు సరియగు నభిప్రాయమునకు దగ్గరగమాత్ర మున్నారు.

ఏకవియైనను ఒకానొక కావ్యమును రచించు నప్పుడు, ఏ యుద్దేశమును లేక, పాఠకులకు తానేదో తెలియజేయవలె ననెడు యపేక్ష లేక వ్రాయుట అసంభవము. తన యభిప్రాయమును, తనకు న్యాయముగ తోచిన యభిప్రాయమును పాఠకులకు కావ్యరూపమున తెలియపరచవలయు నన్న, అందుకు అనుకూలించు పాత్రల కొన్నిటిని సృష్టించి, తద్వ్యతిరిక్తులకు ప్రతి నాయికా నాయకుల సృష్టించి, చివరకు తన యభిప్రాయమున కనుకూలించు పాత్రలకే జయము గల్గునట్లు చిత్రించుట సాధారణముగ జరుగుచుండును. కాని తన యభిప్రాయమును నెగ్గించుకొనవలెనని అసంగతము, అసంభవమునగు సంఘటనలమాత్రము ప్రవేశ పెట్టకూడదు. కాబట్టి, ప్రతికావ్యమునను, మానవ జీవితమునందువలెనే యొకానొక సంఘర్షణ యుండును. ఉదాహరణకు మృచ్ఛకటిక నాటకమును దీసికొనుడు. అందు ఆరంభమునుండి అంతమువరకును నాయకునకు గల్గు కష్టముల తోడనే నిండియున్నది. నాయకుడు సత్య సంధుడు, ధార్మికవర్తకుడు. ధర్మమును జయింప జేయుటే కవియుద్దేశము. తత్కారణముననే ఉత్తరక్షణమున తల నఱుకబడి, తెగి పడవలసిన చారుదత్తుడు వసంతసేన ఆగమముతోడ బ్రదికినాడు. కష్టములు తొలగిపోయినవి; ధర్మము జయించినది. వధ్యస్థానములో ఉరిదీయు క్షణమునకే, కత్తి నెత్తి వేయబోవు క్షణముననే మరి యొక వ్యక్తి వచ్చి రక్షింపగలుగుట సామాన్యముగ నసంభవము. అథవా, సంభవమైనను నది యాదృచ్ఛికమే. కాని కావ్యమునందు ధర్మమునకు జయము గలిగింపవలసియుండుటచే నిట్టి సంఘటన యావశ్యకమైనది.

ప్రతికావ్యమునకును నేదియో యొక సంఘర్షణ మావశ్యకమనుట విశదము. ఆ సంఘర్షణ స్వరూపమునుబట్టియే పఠితల భావములును మారుచుండును. ఆ సంఘర్షణలో విషాదమును, మోదమునుగూడ యుండును. అనగా పఠితల మనస్సులుగూడ నాయా విషాద, మోదభావముల బొందుచుండును. అట్లయినప్పుడు ఖేదమోదాంత నిర్ణయ మెట్లు జరుగును? అది ఆయా భావముల పరిమాణములనుబట్టి నిర్ణయింపవచ్చు నని చెప్పవలెను. అనగా నాయా భావములలో నెయ్యది బలవత్తరమైయున్న నట్టివిధమగు కావ్యమని— విషాద మధికముగ నున్న విషాదాంతమనియు, సంతోషభావ మెక్కుడున్న, మోదాంతమనియు, చెప్పనగును. కాని వివిధ భావముల ప్రాబల్య మెంచుటకు తగు పరిమాణ మేది? పాఠకుల మనస్సులే నిర్ణయించు నని యందుమా, అది ఆయా వివిధభావముల మధ్య సంఘర్షణలో నూగులాడుచుండును. ఒకవేళ ఎట్టకేలకు కొంచెము విషాదమే బలవత్తరముగ నున్నదని తెలిసిన, వెంటనే దానిని విషాదాంత మనవలసినదేనా? మృచ్ఛకటికము విషాదాంతమేనా?

పైదానిని బట్టి, కథాసంవిధానమందలి భావములనుబట్టి మాత్రమే సమస్యను పరిష్కరించుట సమంజసము గాదని తేలుచున్నది. ఇక విషాదాంత, మోదాంత నిర్ణయమునకు సరియగు మార్గమును కనుగొనవలయును.

ఏదేని ఆఖ్యాయికనుగాని, నాటకమునుగాని పఠించుచున్నప్పుడు పాఠకుని మనస్సునందు వివిధములగు భావము లుత్పన్నము లగును. ఒక కావ్యమునందు విషాదము చిత్రితమై పాఠకుల మనస్సులను బాగుగ చలింపజేసిన దనుకొనుడు. చివరకు నాయకుడు యత్నకార్య సాఫల్యము నొందినట్లుగాని, మరేవిధముననగాని మోదాంతమయినచో, పాఠకుడొకవిధమగు విశ్రాంతి నొందినట్లు, relief కలిగినట్లు, మహాభారము హృదయముమీదినుండి దిగిపోయినట్లు భావించి మనస్సు తేలిక కాగా, ఒక్క నిట్టూర్పు బుచ్చును. ఇది మన స్తత్వము బాగుగ తెలిసిన వారికి సులభగ్రాహ్యము. అట్లు పాఠకుడు relief పొందినట్లు భావించెనా, విషాదాంత మగుటకు కావలసిన పరికరములు లేనట్లే; విషాదాంత నాటకోదాత్తతకు భంగము వాటిల్లినట్లే. ఒకానొక ప్రత్యక్ష నిదర్శనము వలన నిది తేటతెల్ల మగును.

ఒకరు, శరచ్చంద్రరచిత 'చరిత్రహీనులు' చదువుచు, ఆఖ్యాయిక సగమునకుపైగా అయినపిదప. 'అబ్బ! గ్రంథకర్త చాలా బాధ కల్గించుచున్నాడండీ! మనస్సును ఊపివైచుచున్నది. చివరకు సంతోషముగనే అంతమగునా, లేకవిషాదాంతమగునా? ఫలానారు చివరకే మగుదురు? వారి వివాహము జరుగునా?...' ఇత్యాదిప్రశ్నలడిగెను. 'ముందుగనే ఆ విషయము చెప్పిన అందలి సారస్యము పోవును. కావున చెప్పరాదు' అని జవాబివ్వగా 'అట్లుకాదు. ఒకవేళ ఖేదాంతమయినచో మనస్సును ఇప్పటినుండియు కుదుట పరచుకొన ప్రయత్నింతును' అని అతడనెను.

దీని భావ మేమి? ఆఖ్యాయికా కథాగమన సమయమున నెట్టి బలవత్తరభావములు గల్గుచున్నను, అంతము మోదమే యైనచో, ఏతత్పూర్వవిషాదభావము లన్నియు నింకిపోయి, పఠిత కొంచెము హృదయభారము తగ్గినట్లు భావించును. పై యుదాహరణప్రకారము, 'చరిత్రహీనులు' చదివినవారికి, కథాగమనమున విషాద భావము లుత్పన్నములైనవి; అవి సామాన్యము గాక మిక్కిలి బలవత్తరములై యున్నవి; హృదయము నూచివైచు శక్తి గలిగియున్నవి; అట్టి భావములు గల్గినవెంటనే యాపఠిత, ఆఖ్యాయిక ఖేదముతోడ అంతమైనచో హృదయమును నిలుపలేనంత, హృదయ మొక్కసారి బ్రద్దలైపోవునంతటి మనోవేదన నొందినాడు. కనుక, ఒకవేళ ఖేదాంతమగునని తెలిసికొన్నచో, మనస్సును కొంతకాలము ముందరనుండియు, చిక్కబట్టుకొని, హృదయమును పదిలపరచుకొని, ఆఖ్యాయిక అంతమునకు సంసిద్ధత నొందచూచుచున్నాడు. మోదాంతమగు నెడల నిట్టి బాధ పడుట కావశ్యకములేదు. దీనినిబట్టి కావ్యమును ఖేదమోదాంతముల నిర్ణయము జరుపుటకు అంతమునకే ప్రాముఖ్యత యుండవలయునని తేలుచున్నది.

విషాదాంత నాటకము మనస్సునందు హత్తుకొనుటకు కారణము నొక విమర్శకు డిట్లు చెప్పుచున్నాడు. 'విషాదాంతనాటకముల దర్శనమున గలుగు భావము సామాన్యముగ నిర్భరమై గంభీరముగ నుండుటచే ప్రేక్షకుల మనస్సుల చలింపజేయును. మోదాంత నాటకముల వలనగలుగు భావములు "తేలిక" యగుటచే—(తేలికయనెడు మాట ముఖ్యము)—'ప్రేక్షకుల హృదయము లముద్రితములై వానిలో నంత గాఢమైన చలనము గలిగింపజాలదు.'

పై విమర్శన మెట్లు తప్పుదారిని ద్రొక్కినదో మనము విమర్శించి చూతము. విషాదాంత నాటకమునకుగాని, (ఆఖ్యాయికకుగాని), గల మరే కావ్యమునకు ప్రాముఖ్యమేమి? ఆ కావ్యమును తిరిగి యెన్నిమారులు చదివినను, తలచినను, ప్రతిసారియు మనస్సును తఱచి, హృదయము నూపివైచి, బాధించి వేధించవలెను. 'చివరకు సంతోషకరముగ నంతమైనను, కథాగమనమున విషాదభావములు బలవత్తరములై మనస్సును మిక్కిలి కలవరపరచిన,నయ్యది విషాదాంతమే'—అని వాదించు వారి నాటకము నొకదానిని తీసుకొనుడు. అది మొట్టమొదటిసారి చదువునప్పుడు మాత్రమే మనస్సును చలింపజేయును. చివరకు మోదాంతమని తెలియగనే మనస్సు తేలికగును. మరల మొదలుపెట్టి చదివినప్పుడు మొట్టమొదటిసారి చదివినప్పుడువలె మనస్సు చలింపదు, బాధ నొందదు! అట్లగుటతోడనే విషాదాంత కావ్యోదాత్తతకు భంగము వాటిల్లినట్లే! కాని భావములు మనస్సును కలచునవిగా నుండియు, అంతముగూడ విషాదకరముగ నున్న నాటకము నెన్నిమారలు చదివినను అది మనస్సునందు అన్నిభావములను, మొదటిసారి పఠించినప్పుడు చలింపజేసినంత బలవత్తరముగను చలింపజేయుచున్నది. [కావ్యమునకు శాశ్వతత్వమున్నచో నది చదివినపుడెల్ల మనస్సులం దాయా భావములు గలుగజేయు ననుట నిజమే. అది కథయందలి విశ్వజనీనత (Universality)నుబట్టి యుండును. అది, ఖేదమోదాంత నాటకముల రెంటికిని సమమే. కావున మన చర్చకు అది యెట్టి భంగమును గల్గింపజాలదు.] అట్లు చలింపజేసినప్పుడే విషాదాంత నాటకము యొక్క యుద్దేశమును, కవియొక్క యుద్దేశమును సఫలము లగును. అట్టి కావ్యమే నిజముగ విషాదాంతకావ్య మనిపించుకొనును.

ఇంతవరకు చదివినపిదప, ఈ విషయము నొక్కవిధముగా అపార్థము జేసికొనుట కవకాశము గల్గుచున్నది. కావ్యముయొక్క ఖేద మోదాంతత్వములు అంతమును బట్టియే నిర్ణయించవలెనని ఇక్కడ చెప్పబడుచున్నట్లు భావించుటయే ఆ యపార్థము. కావున నీ విషయము నింక కొంత విపులీకరించవలెను.

కావ్యనిర్ణయము ఎల్లప్పుడును అంతమును బట్టియే నిర్ణయించవలయుననుట సరికాదు. కావ్యాంతమున కథానాయకుని యత్నములు సఫలములైనట్లను, అతడు కృతకృత్యుడైనట్లును చిత్రించిన నది మోదాంతమగును. విశ్వనాథ సత్యనారాయణగారి "మా బాబు" అను ఆఖ్యాయికను చూడుడు. అందెవ్వరి మరణమును సంభవింపలేదు. పైన చెప్పినవిధముగా అపార్థము జేసికొనిన వారు 'మాబాబు'ను మోదాంతముగ పరిగణింతురేమో! కాని అది కేవలము తద్వ్యతిరేకము. 'మాబాబు'ను విషాదాంతముగనే పరిగణించవలెను. 'చివరకు ఎవ్వరును చనిపోలేదు. అందరును సుఖముగా జీవించుచుండిరి' అన్నంతమాత్రమున దానిని మోదాంత మనరాదు. మొదటినుండి చివరవరకును హృదయమును కదలించివైచు విషాద భావములు గలిగినంతమాత్రమున దానిని విషాదాంత మనరాదు. 'మాబాబు' విషాదాంతమే. కాని పైకారణమువలన గాదు. మొదటి నుండియు విషాదభావములు గలిగించుచు చివరకు నాయకుని యుద్దేశములుగూడ విఫలములైన, నదియే విషాదాంతము. 'మాబాబు'లో మొదటి నుండి హృదయమును కరిగించు విషాదఘట్టము లున్నవి. అంతియేగాక చివరకు, తాను వివాహము చేసికొనవలెనని తలచిన స్త్రీ యితరుని భార్యయైనది. చివరకు మోడువలె నాయకు డొక్కడును మిగిలినాడు. అతని మనస్సుకూడ మోడువారిపోయినది. అందువలననే యది విషాదాంతము. ఈ విషయమున ఒకానొక పాశ్చాత్య విమర్శకుని విమర్శను పరిశీలింపుడు:—

"A Tragedy is the failure—at least, the worldly failure—of those from whom much might have been expected, who ought to have 'attained', but somehow have not; the non-fulfilment or ruin of high possibilities of Character and natural endowment."

[మనము ఎవరినుండి ఎక్కువగా ఆశించుచున్నామో, ఎవరు తప్పక తన యత్నముల సఫలముజేసికొన తగియున్నాడో, అట్టి నాయకుడు సఫలకృత్యుడు కావలసియున్నను, కారణాంతరములవలన "సంపూర్ణ సాఫల్యము" నొందక, వైఫల్యమును—చివరకు ఐహిక వైఫల్యమునైనను, పొందియున్నాడో, అట్టి నాయకుని గలిగిన కావ్యము విషాదాంత కావ్యమనబడును.]

ఇందు "సంపూర్ణ సాఫల్యము" అను విషయమును కొంచెము వివరించవలసి యున్నది. Hamlet దృష్టాంతముగ తీసికొన్నచో, నందు మొదటినుండి చివరి వరకును విషాదభావము (Tragic Element) గలదు. అంతమందు Hamlet తన విధ్యుక్తధర్మము నెట్టకేలకు నెరవేర్చెను. కాని ఈనాటకమును మన నిర్వచనము ప్రకారము మోదాంతమనుటకు వీలులేదు. Hamlet నెరవేర్చవలసిన కార్య మట్టిది గాదు. తన పినతండ్రిని చంపుటే అతనికి యుక్తమగును. కాని చివరకు పరిస్థితుల ప్రాబల్యము వలన అనేకమంది మృతినొందవలసి వచ్చెను. అనగా నాయకుడు సంపూర్ణ సాఫల్యము నొందలేదు. కావున ఇది విషాదాంతమే యగును.

కావ్యాంతమునకే ప్రాముఖ్యము నివ్వవలయుననుటలో భావ మేమనగా, మొదటి నుండి చివరవరకును విషాద భావములు గలిగినను, చివరకు నాయకుని యత్నములు సఫలములైనట్లు చూపిన నది మోదాంత నాటకమే యగును. కాని యింతమాత్రమున మొదటి తెగవారికి (అంతమును బట్టియే నిర్ణయము జరుగవలయు ననువారికి) ఎంతమాత్రమును తావీయజాలదు. అంతమున నాయకుని యత్నములు సఫలములైనటుల చిత్రించి కథాగమనమున మాత్రము విషాద భావముల గల్పించి మనస్సునెంత యూచివైచినను అది విషాదాంతము కాజాలదు.

అనగా ఖేదమోదాంతముల రెంటికిని అంతమే ముఖ్యముగ పరిగణించి నిర్ణయించవలెను. మోదాంతమునకు (నాయకుని యత్నములు సాఫల్యము లైనటుల వర్ణితములైన కావ్యములకు) కథాగమనమున నెట్టి భావము లుదయించినను అంతమునుబట్టి నిర్ణయించవచ్చును. విషాదాంతమునకు మాత్రము కథాగమనమున బలవత్తరములగు విషాదభావములును, అంతమున నాయకుని యత్నవైఫల్యమును—రెండును వర్ణితములు గావలెను. అనగా ఖేదాంతమునకు రెంటిలో నేది లేకపోయినను విషాదాంతము యొక్క యుదాత్తత సంభవింపదు.

ఇప్పుడు తెలియున దేమనగా, విషాదాంతములో కథాగమన మెంత విషాదభావాన్వితమైనను, అంతము మోదముగ నున్నయెడల, అంతమున నాయకుడు సాఫల్యము నొందినయెడల నది మోదాంతమే. అంతము ఖేదమయముగ నుండి కథాగమనకాలమందలి భావములు విషాదకరముగ లేకపోయినచో నయ్యది విషాదాంత కావ్యము గాజాలదు; కాని దానికి దగ్గరలో మాత్ర ముండును. విషాదాంతమునకు తోడ్పడవలసిన భావములు అందు లోపించిన వని చెప్పవలెను.

కథానిక:

కొండవాడు

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

అబ్బో! యివాళా, నిన్నానా. ఆ రేళ్ళ క్రితపు ముచ్చట అది. అయినా తలుచుకున్నప్పుడల్లా ఒళ్లు ఝల్లుమంటూ ఉంటుంది.

హఠాత్తుగా మమ్మల్ని "సిబీ" వెళ్లమన్నారు. మేళలూ, స్కర్ట్సూ పుచ్చుకుని కార్యక్రమం-మున్నాయిదాగా వేసుకున్నాం ఓగంటలో. తిరుకేంద్రంనుంచి చెన్నపట్నం, అక్కణ్ణుంచి గ్రాండ్‌ట్రంక్‌లో ఢిల్లీ, తరవాత రోహ్రీ, ఆపైన "సిబీ"ని. "సిబీ"నుంచి క్వెట్టా అంది పుచ్చుకున్నట్టు ఉంటుంది. అక్కడే వచ్చిపడింది వ్యాసఘట్టం.

ఇంకా లోపలికి జొచ్చుకుపోవాలి. ఆఫ్ఘనిస్థానంలో మా స్థావరాలు పదిలపరుచుకోవాలి. మహాక్లిష్టపరిస్థితి. ఏమంటారా? అక్కడ అంతా కొండవాళ్లు, తురకవాళ్ళూను. ఒట్టి పశుప్రాయులు. శంకా సమాధానా లంటూ ఉండవు వాళ్ళకి. చెయ్యిచేసుకోవడమేగాని, నోరు చేసుకోవడం ఎన్నడూ ఎగరరు. అదైనా ఎక్కడో పొంచుండి అర్ధరాత్రో అపరరాత్రో మీద విరుచుకుపడతారు. ఒంటిగా ఆ ప్రదేశాల్లో తిరుగాడినవాడు తిరిగి నిరపాయంగా శిబిరానికి చేరుకున్నాడంటే యముణ్ణి జయించాడన్నమాటే! అందులోనూ మా జట్టులో ఒక శిక్కు గూడా ఉన్నాడు, అతీనుజాకీలాగ మూగెడు బవిరిగడ్డాం దిగదువ్వుకుని "అన్యమతస్థులని పరిమార్చడమే మోక్షప్రదమని నమ్ముతారు వాళ్ళు, జాగ్రత్తసుమండీ!" అన్న హెచ్చరికతో బయలుదేరేం. ఆ మాటలు నా చెవుల్లో గింగురమంటూనే ఉన్నాయి. సూట్లూ బూట్లూ వేసుకోవడంవల్ల మేం కొంత కమ్ముకుపోగలం అని ధైర్యం చెప్పుకున్నా, యీ గడ్డాపాయన దగ్గిర వొచ్చేది గొప్పచిక్కు!

2

ఓనాడు ప్రొద్దున్నే లేచి వాళ్ళ చహారా కనిపెడదామని బయలుదేరేను. మేకలమందని తోలుకుపోతున్నాడు ఓ కుర్రవాడు. చిత్రం ఏమిటా? వాడి చేతిలో చేపాటి కర్రకి బదులు తుపాకి ఉంది. తొడుక్కున్నది ఒక చెయ్యిలేని చొక్కా, వాడి తండ్రిదో పినతండ్రిదో కాకినిక్కరూను. పదహారు పద్దెనిమిది ఏళ్ళకన్న ఎక్కువ ఉండవు. కాని మనిషి ఆజానుబాహు. ఆరు అడుగులపైన ఉంటాడు. దండలు కమ్మెచ్చులాగ ఉన్నాయి. బల్లపరుపుగా విశాలమయినఛాతీ, బొత్తాయిలులేని ఆ చొక్కా తనకి చాలదని చెప్పక చెబుతోంది. నిక్కరు జేబులు ఎత్తుగా ఉన్నాయి.

ఇరవై గజాల దూరంలో ఉన్న నన్ను ఎలాగ పసికట్టేడో వేటకుక్కలాగ. గభుక్కున తిరిగి తుపాకీ యెత్తేడు. ఇంతట్లోకే నా దుస్తులసరంజాంచూసి కాబోలు, ఎత్తిన తుపాకీ దింపేసేడు. సలాంచేసి తన దారిని పోబోయేడు. "ఏయ్" అని పిలిచేను.

వాడు తిరిగి నుంచున్నాడు.

"తుపాకీ ఎక్కడిదీ" అని హుందాగా ప్రశ్నించేను.

"నాదే"

ఆజవాబులో ఎంతమాత్రం కళవళం లేదు.

"ఎందుకు పట్టుకెళుతున్నావు?"

"ఎందుకేమిటి? నిత్యంచూస్తూను."

మాట వెళుసుగా ఉందన్నమాటేగాని హృదయంలో ఏమీ కల్మషంలేదు. కాగా, నేను అక్కడ అధికారవర్గంలో వాణ్ణే నన్న భ్రమలో ఉన్నాడు. అసలుసంగతి ఎందుకు చెప్పాలి? చెబితే ఏం కొంప మునుగుతుందో!

"సరే, వెళ్లు"

నిర్భయంగా ఎప్పటిలాగా నడక సాగించేడు వాడు. జేబులో రివాల్వరు భద్రంగా ఉన్న సంగతి నిశ్చయపరుచుకొని మరీ వెంటపడ్డాను, నేను.

అంతా కాలిబాటే; రోడ్డు కాదు. రాళ్ళూ రప్పలూ చిందరవందరగా ఉన్నాయి బాటమ్మట. త్వరగా కాళ్ళుపీకడం ఆరంభించేయి. నాగరికతా నాజూకు పెరిగిపోయి ఒట్టి "జపాను సరుకు" అయిపోయేం, రండికీ మొండికీ ఓర్చి పని చెయ్యాలంటే మనవశమా?

వాడి ధర్మమా అని మరో పది గజాలలో మందని ప్రక్కకి గుట్టకేసి మళ్ళించి ఓబండరాతిమీద చతికిలబడ్డాడు. బతికేం భగవంతుడా అనుకుని నేనూ ఉన్నచోటే కూలబడ్డాను.

తుపాకీ ఓసారి చేతుల్లోకి తీసుకున్నాడు. పసిపాపని రెండుచేతులంతోటి ఎగరేసినట్టు అతి ఆప్యాయంగా ఆ ఆయుధాన్ని వాడు అరిచేతుల్లో ఉంచుకున్నాడు. అల్లల్లాడించేడు. నిశ్శబ్దంగా పెదిమెలు ప్రక్కకి పరిగెత్తేటట్టు దరహాసం చేసి, దాన్ని తుష్టహృదయంతో ప్రక్కని నిలుచోబెట్టేడు.

ఇంతట్లోకే ఒక చిన్నమేకపిల్ల అరిచింది. ఛటుక్కున తలయెత్తిచూసేడు. నేనూ అప్రయత్నంగా దృష్టి ఆ వంకకే సారించేను. పోతుమేక ఒకటిదానిని కుమ్మతోంది. ఒక్కదాటులో వెళ్లేడు. పోతుమేకడొక్కలో ఒక్కతాపుతన్ని, పిల్లని ముచ్చటగా రెండుచేతులతోను పొదివి పట్టుకుని ముట్టెని ఆఘ్రాణించేడు. దాన్ని అలా చేతుల్లో యిముడ్చుకునే ఉల్లాసంగా వెర్రిగెంతులు వేసేడు. తరవాత భద్రంగా నేలకి దింపి, దాని వీపుతట్టేడు. అది గెంతులువేస్తూ "మేమే" అని అరుస్తూ తల్లిదగ్గిరికి పోయి పొదుగులో మూతిపెట్టింది. వీడు దాని వైపే రెప్ప వెయ్యకుండా చూసేడు. హృదయం తెరుచుకునేటట్టుగా నవ్వి, పాలుత్రాగుతూన్న దాని దగ్గరే నిలుచున్నాడు, వీపు నిమురుతూను.

కొండవెధవదికూడా ఎంత జాలిగుండె!

పదినిమిషాలు గడిచేయి. వాడు తిరిగివచ్చి బండరాతిమీద కూచున్నాడు. నిక్కరుజేబులోకి చెయ్యిపెట్టి ఓ "పేకట్టు" పైకి తీసేడు. అది ఏమి టోనని బైనాక్యులర్సు పెట్టి చూతునూ? రొట్టెలు. మూడేమూడు రొట్టెలయినా ఒక్కొక్కటీ ఆంధ్రపత్రిక అంత ఉన్నాయి. వాటిని నెయ్యి నూనె ఏ వల్లకాడూ లేదు. నిప్పులమీద కాల్చిన ఒట్టి పొడిరొట్టెలు. రెండు ఉల్లిపాయలు నంచుకుంటూ మూడు రొట్టెలూ తిన్నాడు. మంచినీళ్ళ ప్రసక్తే లేదు వాడికి; మనలాంటి వాళ్ళం అయితే అడుగు అడుగునా మెడబడిపోయి, గొంతుక దిగక, మూడుచెంబుల నీళ్ళు ఖాళీచేసేవాళ్ళం! అరి పిడుగా, అనుకున్నాను. చప్పట్లు కొట్టినట్టు చేతులు దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు. రెండో జేబులోంచి గుళ్ళు తీసి తుపాకి యెత్తి బారుగా అమర్చేడు.

నాకు కంగారు పుట్టింది. ఏంచేస్తాడు చెప్మా? ఏ అమాయిక జీవికి నూరేళ్ళూ నిండేయో? వీడినే రివాల్వరుతో కాల్చేస్తే? ఆ శబ్దానికి చుట్టుపట్ల వాళ్ళు ముట్టడించి నన్ను హతమార్చేస్తారు కాబోలు. కాకపోయినా ఒక్కడినీ బయలుదేరడం ఏమిటి, నా మొహం. ఇలాగ ఏదో తర్జనభర్జన చేస్తూనే ఉన్నాను—

వాడు ఓ మెట్లంగిరాయి పుచ్చుకున్నాడు కుడిచేత. తుపాకీ ఎడమచేతిలో వుంది. రాయి అంతరిక్షానికి రివ్వున విసిరేడు. రెప్పపాటు కాలంలో ఎడంచేతులో తుపాకి కుడిభుజం క్రిందికి వచ్చింది. గుండెకి ఆనుకుంది. 'బారెలు' క్రిందికి ఎడమచెయ్యి ప్రసరించింది. ఎడం కన్ను ముయ్యడం, కుడిది తెరవడం, కుడిచేతి చూపుడు వ్రేలితో "ట్రిగ్గరు" లాగడం క్షణకాలంలో సంభవించేయి. చెప్పడమే ఆలస్యం అవుతోంది అనుకోండి! ఎగిరినరాయి ఆకాశంలోనే ఛిన్నాభిన్నం అయిపోయి తునకలుగా క్రిందపడింది.



లండనులోని అంతర్జాతీయ భాషా సమితిసభలో బ్రిటిష్‌వలసలశాఖ కార్యదర్శి క్రీచ్‌జోన్స్ ఉపన్యసిస్తున్న దృశ్యం.

ఏమి గురి! ఎంతత్వరితం!! రెప్పవెయ్యకుండా ఆశ్చర్యంతో బైనాక్యులర్సు దించకుండా అరగంటసేపు చూసేను. మన వేపు పశువులగుంటలు గోళీకాయలు ఆడుకుంటారు. వీళ్ళకి యిదీ పని! శహబాసు! ఇటువంటి నేర్పరులని మోసంచేతో, క్రౌర్యం చూపించో నాశనం చెయ్యడమా? ఏమి హృదయరహితమయిన పనీ! ఇందులో ఎందుకు చెయ్యిచేసుకున్నానా అనిపించింది. వీళ్ళకే సరియయిన సంస్కృతి కల్పించి, క్రమమయిన శిక్షణ యిచ్చినట్లయితే దేశమాతకి ఎంత చక్కటి అంగరక్ష ఏర్పడుతుందో గదా అని విస్తుపోయేను. ఆలోచిస్తూన్న కొద్దీ కడుపు దేవుకుపోయింది. ఇంక నిలవలేక యింటిముఖం పట్టేను. ఆకలి, దాహం, చికాకున్నూ. నీరసించిపోతూన్నట్టు అనిపించింది.

ఎంత నడిచినా అంతు కనిపించదేం?

ఎవరో ప్రక్కనించే వెళుతూన్నట్టయింది.

"క్వెట్టారహదారి యిక్కడికి ఎంతదూరం ఉంటుంది?" అని అడిగేను.

"మీరు క్వెట్టారోడ్డు వదిలి అయిదుమైళ్ళు అఫ్ఘనిస్థానంలోకి వచ్చేరు."

"చచ్చేన్రా భగవంతుడా!"

"మీకు వచ్చి భయంలేదు. మా ఆతిథ్యం స్వీకరించి, కాస్త విశ్రమించి సాయంత్రం మీ యింటికి వెళుదురుగాని"

భయం లేదని అతను అనడంతో నిజంగానే భయంవేసింది. తేరి పారిచూతునూ! తురకవాడు.

"అక్కర్లేదు. మీ ఆహ్వానానికి చాలా సంతోషం. నాదారిని నేను పోతాను" అన్నాను. బావిలోనుంచి వచ్చినట్టు వచ్చేయి ఆమాటలు పొడి ఆర్చుకుపోయిన నాగొంతుకలోంచి.

"మీరు అలా అనడానికి వీలులేదు. అర్థించినవారికి అతిథిసత్కారాలు చెయ్యడం మా మతం. సంశయించకండి. రండి, పోదాం!

ఆ మాటలలో ఏమీ వక్రత లేదు.

ఇంటికి తీసుకుపోయేడు. సులకమంచం ఆసనం. రెండు పొడిరొట్టెలూ నాలుగు ముల్లంగి దుంపలూ, పింగాణీగ్లాసునిండా మేకపాలూ పట్టుకొచ్చేడు. నాటుఫేక్టరీలో తయారయిన మోటుతుపాకులు రెండు గోడని తగిలిచ్చి ఉన్నాయి. వాటివేపు చూస్తూ, నెమ్మదిగా ఆతిథ్యం స్వీకరించేను. ఆతరవాత హుక్కా గొట్టాం ముందుంచేడు.

ఏమిటో యీ వింతవైఖరి!

3

ఆ సాయంత్రం పటాలం ఒకటి కొండచరియలను ఆనుకుని పోతోంది. ఇంతలో "ఢాం" మ్మని తుపాకీ పేలినశబ్దం.

పటాలంలో ఒకడు బలిఅయి పడిపోయేడు.

దళనాయకుడికి పట్టరాని కోపం వచ్చింది. కొండకి యిరుప్రక్కలా గురిచూసి కాల్చమన్నాడు.

పావుగంటసేపు పటాలం మెషీనుగన్ను పేల్చింది. ఫలితంమాత్రం శూన్యం. చరియలో ఉంది పటాలం. పైనకొండమీద ఏ బండ చాటున దాగున్నాడో ఆ కాల్చినవాడు. ఏ తుప్పచాటున పొంచిఉన్నాడో!

మళ్ళీ ముందుకు సాగబోయింది పటాలం.

"ఢాం. ఢాం. ఢాం" ముందున్న ముగ్గురూ పిట్టల్లాగ పడిపోయేరు. పటాలం నాయకుడు రుద్రుడయిపోయినాడు. కోపం, అవమానం అతన్ని చికాకుపరిచేయి. మళ్లీ "ఫైరుఆర్డరు"! అట్నుంచిగూడా తుపాకీ ప్రేల్చిన చప్పుడు! మరొక పదిమంది పటాలంలో ఆహుతి అయి పడిపోయేరు. కొండలోయ యుద్ధభూమి అయి ఊరకుంది.


అంతలో కొండమీద తుప్పచాటున ఏదో కదిలినట్టయింది. ఆ చోటు గురిచూసి కాల్చేడు నాయకుడు. "ఢాం!"

ఈసారి గురితప్పలేదు. ఆ దెబ్బకి కొండమీదనుంచి దొర్లుకుంటూ వచ్చి పటాలంకాళ్ళదగ్గిర పడ్డాడు ఒకడు. పడ్డాడో లేదో స్ప్రింగు బొమ్మలాగ లేచి మరో ముగ్గుర్ని కాల్చేసేడు.

నాయకుడి 'బేయొనెట్టు' డొక్కలో దూసుకునే దాకా వాడు ప్రాణాలు కోల్పోలేదు. అసువులుబాసినా ఆయుధంమాత్రం రెడీగా హస్తభాగాన్ని అలంకరించేఉంది. ఎవడో కాదు వాడు. వాడే, ఆపశువులకాపరి కుర్రాడు.

ఒంటిమనిషి సర్వాయత్తమయిన ఒక పటాలాన్ని ఎదిరించి సుమారు రెండుగంటలసేపు నిరోధించేడు. పాతికమందినయినా బలిగొంటేనేగాని ప్రాణాలు త్యజించేడు కాదు. ఏమినైపుణ్యం, ఎంతధైర్యం, ఎంతటిసాహసం!!


పటాలం నాయకుడే మెచ్చుకున్నాడు. మిలిటరీ ఆనర్సుతో ఆకొండవాడి అంత్యక్రియలు ముగిసేయి.



22-6-46 న కీలును నౌకకు అమర్చేముందు శ్రీమతి వంకవాలా కొబ్బరికాయను కొట్టెను




సింధియా నౌకానిర్మాణశాల
మేనేజరు శ్రీ వంకవాలా




'జల ఉష'
జరిపిన


జల ఉష నౌక



జల ఉష నౌకముందు ఇద్దరు ఫోర్మన్లు—శ్రీ రోడ్జర్సు, శ్రీ సర్వీసు
పనులను చక్కబెట్టుచున్న దృశ్యం




ట్రిగ్గర్ నౌకను మెల్లగా జలప్రవేశం చేయించటానికి తోడ్పడే యంత్రం



భారత ప్రధానామాత్యుడు శ్రీ జవహర్లాల్ నెహ్రూ జ



నౌకానిర్మాణ క్రియంలో యినుప రేకును కావలసిన సైజుకు వంచే యంత్రం



శ్రీ కె. వై. కృష్ణమూర్తి



శ్రీ పోతుకూచి గంగాధరం
సింధియాలో కార్మిక ఉద్యోగి.



సింధియా నౌ



...ౌక జలప్రవేశం
...ిట్ నెహ్రూ




సింధియా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్
శ్రీ వాల్చంద్ హీరాచంద్




లాఫ్ట్‌ఫ్లోర్: నౌకకు సంబంధించిన భాగాలకొయ్య నమూనాలు తయారుచేసేచోటు

నిర్మాణ చిత్రాలు




...వేశోత్సవం జరిపిన నూతన నౌక 'జలఉష' పూర్తిరూపం.




ఫోర్మన్‌సర్వీసు జల ఉషను జలప్రవేశం చేయించాల్సిన విధాన్ని నౌకానిర్మాణాశ్రయం మేనేజరుకు వివరిస్తున్న దృశ్యం



నిర్మాణానికి సంబంధించిన ప్లానులు తయారుచేసే ఆఫీసు



...బెల్
చీఫ్ మానేజరు.



శ్రీ ఆర్. సి. జలున్ధవాలా



శ్రీ ఎ. యస్. నారాయణ్
సింధియా డిప్యూటీ మానేజరు.



నౌకా నిర్మాణాశ్రయంలో డిజైన్లనుతయారుచేసేఆఫీసు

పిల్లల నవల:



34

ఆ సంధువాచేపదగ్గర సెలవు తీసుకొని పినాకం తిమింగిలంకడుపులో దారి వెదకుకొంటున్నాడు. కొండగుహ లాంటి ఆ చీకటికోనలో పడుతూ లేస్తూ, మినుకు మినుకు మని దూరంగా కనుపించే వెలుతురువైపు వెడుతున్నాడు. ముందుకు వెళ్లే కొద్దీ ఆ వెలుతురు ఎక్కువ అవుతోంది. నడచి నడచి చివరికి ఎలాగైతే నేం ఆ దీపందగ్గరకి చేరుకున్నాడు. చేరుకొనేటప్పటికి ఏంకనిపించింది? చెప్పుకోండి చూద్దాం! మీరు. చెప్పుకోలేరు వెయ్యిసారులు ప్రయత్నించినా చెప్పలేరు. ఆదీపం ఒక కొవ్వొత్తిదీపం. ఒక చిన్న టేబిల్; దానిమీద పరచినగడ్డ; ఆ గుడ్డమీద ఆకుపచ్చసీసా, ఆసీసాలోపల కొవ్వొత్తిదీపం. ఈ టేబిల్ ముందు వేసుకొని వెనుకవైపు ఒక ముసలివాడు కూచుని ఉన్నాడు. వాడు బ్రతికున్న చేపల్నే తినివేస్తున్నాడు. అలాగ తింటూ ఉంటే అవి ఒక్కోసారి నోటిలోంచి తప్పించుకొని జారిపోయేవి.

పినాకయ్యకి ఇదంతా చూస్తూవుంటే చాల ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. ఒళ్లుతెలియని స్థితిలో యెన్నో చెయ్యాలనుకున్నాడు. నవ్వాలని, ఏడవాలని, ఒక వెయ్యి సంగతులు చెప్పాలని ఎన్నో అనుకున్నాడు. చివరికి, తడబడుతూ ఏవో వచ్చీరాని మాటలు గొణిగివేశాడు. సంతోషంతో ఎగిరి గంతువేసి ఒక్క ఎగురు ఎగిరి చేతులు చాపి ఆ ముసలివాడిమెడను చుట్టవేసుకున్నాడు. ఆఖరికి యీ మాటలు వచ్చాయి:

నాన్నా! నాన్నా! కనిపించావూ? ఎన్నాళ్లకో ఇంక నిన్నువిడిచి ఎక్కడికీ వెళ్లను. ఎప్పుడూవెళ్లను. నాన్నా, ఇంక వెళ్లను"

"ఏమిటి? నేనుచూస్తూన్నది నిజమేనా?" అని ఆముసలివాడు తన కన్నులు తుడుచుకొని చూశాడు. "అయితేనువ్వు మా పినాకయ్యవే నన్నమాట! ఎంత అదృష్టం!"

"అవును నాన్నా! నేను నిజంగా పినాకయ్యనే. ఇప్పటికైనా నేనుచేసిన తప్పులన్నీ మరచిపోయి నన్ను క్షమిస్తావుకాదూ?"

ముసిలివాడి కళ్లవెంబడి నీళ్లు కారుతున్నాయి.

"నాన్నా! నువ్వెంత మంచివాడివి. నీకొడుకుగా పుట్టిన నేనెంత చెడ్డవాడినో! అయితే లే. నేను పడ్డ కష్టాలన్నీ నువ్వు వింటే నన్ను ఏమనవులే. నాన్నా! నువ్వానాడు నీకోటు అమ్మి నాకు బాలశిక్ష కొనిపెట్టావా! అది అమ్మి ఆటచూశాను. ఆవేళ ఆయాట వేసే అగ్గిరాముడు నన్ను పొయ్యిలో పెట్టాలని చూశాడు. చివరికి అతనే నాకు అయిదు బంగారు మొహరీలు నీ కిమ్మని యిచ్చాడు. ఇంతలో నక్క, పిల్లి అనే దొంగలు దాపరించి నన్ను ఒక సత్రంలోకి తీసుకెళ్లి చెడతిని అర్ధరాత్రి వదలివేసి పోయారు. తర్వాత దొంగలు వచ్చి నన్ను తరిమారు. నేను పారిపోయాను. చివరికి నన్ను పట్టుకొని ఒక మఱ్ఱిచెట్టుకు వ్రేలాడదీశారు. అపుడు నీలితల అమ్మాయి గుఱ్ఱపుబండి పంపించి నన్ను పిలిపించింది. వైద్యులచేత పరీక్ష చేయించింది. వాళ్లు, నేను చావకపోతే బ్రతికివున్నట్లు, బ్రతికివుంటే చావనట్టు నిర్ధారణచేశారు. నేను అబద్ధాలు చెప్పాను. నాముక్కు పొడుగయింది. తర్వాత మళ్లా నక్క, పిల్లితో కలిసి వింతల దిబ్బకి వెళ్లాను. అక్కడ నేను నాలుగు మోరీలు పాతిపెట్టి వేలకొద్దీ మోరీలు మొలుస్తాయనుకుంటే ఒక్కటీలేదు. ఇది కోర్టులో చెప్పుకుంటే జడ్జీగారు నన్ను జెయిలులో పెట్టారు. తరువాత వస్తూవుంటే ద్రాక్షతోట చూచి పళ్లు కోయబోతే బోనులో చిక్కుపడ్డాను. ఆతోటరైతు నన్ను కుక్కలాగ కాపలా వుంచితే, బావురు పిల్లుల్ని పట్టుకున్నాను. చివరికి నన్ను రైతు వదలివేస్తే ఆ నీలి అమ్మాయి యింటికి వెళ్లాను. ఆయమ్మాయి చచ్చిపోయిందని గండభేరుండపక్షి చెప్పింది. అప్పుడు నీమాట కూడా చెప్పింది. నాకోసం పడవ చేసి సముద్రంలో వెదకడానికి బయలుదేరుతున్నావని. అప్పుడు దాని వీపుమీద ఎక్కి చూడబోతే నువ్వు పడవలో వున్నావు. నిన్ను గుర్తుపట్టి పిలిచాను. నీకు వినిపించిందో లేదో?"

"నేనూ గుర్తుపట్టాను." అని కళ్లనీళ్లు తుడుచుకుంటూ అచ్చయ్య చెప్పుతున్నాడు. "నేను వెంటనే ఒడ్డుకి వచ్చేసేవాడిని. కాని ఏంచెయ్యను. సముద్రపు కెరటాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక పెద్ద కెరటం వచ్చి నాపడవ బోల్తా కొట్టించింది. నేనెలాగో యీదుకొంటూ ఉంటే, ఘోరమైన యీ తిమింగిలం చూచి నన్ను తన పెద్ద నోటితో పీల్చి ఒక చిన్న గోలీకాయ మింగినట్లు మింగివేసింది"

"ఎంత కాలంనుంచి యిక్కడ వుండిపోయావు నాన్నా!" అని పినాకయ్య ప్రశ్న వేశాడు.

"అప్పటికీ ఇప్పటికా రెండు సంవత్సరాలు అయిందేమో! అచ్చా! ఆ రెండేళ్లూ రెండువందల యేళ్ల క్రింద గడిచాయి."

"ఇంత కాలం ఎలాగ బ్రతికావు? నీకీ కొవ్వొత్తి యెక్కడ దొరికింది? ఇది వెలిగించడానికి అగ్గిపెట్టె ఎక్కడిది? ఇవన్నీ ఎవరిచ్చారు!" అని గబగబా అడిగాడు పినాకయ్య.

"ఆగు. అవన్నా కొబుతాను. ఆ కెరటాల తాకుడుకు నా చిన్ని నావ పోయినట్టే మరో పెద్ద సరకుల ఓడ కూడా తుఫాను వల్ల ముక్కలయిపోయింది. అందులో కళాసులూ, జనం బ్రతికిపోయారు. కాని ఓడమాత్రం సముద్రం అడుగుకు పోయింది. ఆవేళ యీ తిమింగిలానికి ఆకలి ఎక్కువగా ఉంది. నన్ను మ్రింగిన వెంటనే యీ ఓడనుకూడా మ్రింగి వేసింది."

"అదెలాగ?"

"ఒక్క గుటకతో మ్రింగి వేసింది. అన్నింటికీ ఓడకొయ్య మాత్రం మనం చేప ముల్లు ఊసి వేసినట్లు దాని పళ్లల్లో చిక్కు పడితే పారవేసింది. నాయదృష్టంవల్ల ఆ ఓడలో డబ్బాల నిండా పళ్లు, బిస్కట్లు, వెన్న జున్ను, కాఫీ, పంచదార, కొవ్వొత్తులూ, మైనపు అగ్గిపెట్టెలూ ఇవన్నీ వున్నాయి వీటితోటి యీ రెండుసంవత్సరాలూ ఎలాగో గడిపివేశాను. ఓడలో సరకుఅంతా అయిపోయింది" కొవ్వొత్తుల్లో కూడా ఇదే ఆఖరిది."

"ఇది అయిపోతే?"

"ఇది అయిపోతే మన మిద్దరం కూడా చీకటిలో తడుముకోవలసిందే!"

"అయితే యింక వీలు లేదు. మనం వెంటనే తప్పించుకొని పోయే వుపాయం చూడాలి"

"తప్పించుకోవడమా! ఎలాగ?"

"ఈ తిమింగిలం నోటిలోనించి బయటికి పోయి, సముద్రంలో పడి యీదుకొని బయట పడాలి"

"కబుర్లకేం? బాగా చెప్ప వచ్చు. కాని నాకు సముద్రంలో ఈదడం రాదే"

"నేను ఈదుతాను. చాలు. నిన్ను నావీపుమీద ఎక్కించుకొని ఈదుకుంటూ ఒడ్డు చేరుస్తాను" అన్నాడు పినాకం

పిల్లల కథలు ●

చిలుక సందేశము

ఒక హిందూదేశపు చిలుక బొఖారాలో ఒక వర్తకునిఇంట పంజరములో బంధించబడియుండెను.

ఆ వర్తకుడు ఒకసారి హిందూదేశమునకు ప్రయాణ మగుచూ తనవారికి ఏమేమి కావలయునో కనుగొనెను. చిలుకపంజరంవద్దకు వచ్చిహాస్యముగా,

"చిలుకా, నీ కేం తెమ్మంటావు?" అనెను.

అంత చిలుక "నా కేం వద్దు. నా స్నేహితురాండ్రతో ఒక మాట అను. 'మీరంతా ఇట్లా ఎగురుతున్నారు. మీ స్నేహితురాలైన ఒక చిలుక నా పంజరములో బంధించబడివుంది' అని చెప్పు" మనెను.

"సరే" అని తన ప్రయాణమును సాగించెను.

హిందూదేశములో కొంతకాలము వ్యాపారము సాగించి తిరిగివస్తుంటే ఒక అరణ్యములో కొన్ని చిలుకలు కనపడెను. అతనికి తన చిలుకసందేశము జ్ఞప్తికి వచ్చెను.

"ఓ చిలుకల్లారా!—మీ కో మాట. నావద్ద ఒక చిలుక వుంది. నా ఇంట్లో బొఖారాలో పంజరంలో వుంచాను. ఆ చిలుక మీకు ఈసందేశము చెప్పమన్నది" అని చిలుక చెప్పమన్న విధముగా చెప్పెను.

అన్ని చిలుకలు వర్తకునివంక చూసెను కాని ఒక ముసలి చిలుక 'దభీ'మని చెట్టుమీదనుండి క్రింద పడి పోయెను.

"అయ్యో! ఏమిటి ఇది? ఈ చిలుక నా చిలుకకు బంధు వేమో?" అని, తన దేశమునకు తిరిగివచ్చెను. అతని బంధువులు అతను తెచ్చిన బహుమతులకు సంతసించిరి అంత చిలుక,

"నా కేం తెచ్చావు?" అని అడిగెను.

"అయ్యో! నే నేమీ తేలేదు. నీవు చెప్పినట్లు మాత్రం చిలుకలతో చెప్పాను" అనెను.


"అ వ్వేమీ అనలేదా?" అని చిలుక అడిగెను

"ఆ—నేను ఈ సంగతి చెప్పగానే ఒక ముసలిచిలుక క్రిందపడి చచ్చిపోయింది" అని వర్తకుడు జవాబు చెప్పెను. మరియు "ఆ చిలుక నీకు బంధువా? స్నేహమా? అని అడిగెను. ఈ మాటలు విని చిలుక వణకుచుండెను. వణికి వణికి పంజరములో అడుగుబాగమున పడిపోయెను.

"అయ్యో! ప్రియతమా, ఈ విచారకరమైన వార్త విని నీవూ ఆ ముసలి చిలుక వలె మరణించావా?" అనుకొనెను. అతడు పంజరముయొక్క తలుపు తెరచి చిలుకను బయటకు తీసి మేడమీదనుండి వీథిలోనికి విసరివేసెను. చిలుక తన రెక్కలు విప్పి ఎగిరిపోయెను.

చూశారా, చిలుక తెలివి! తెలివితేటలు వుంటే మనం ఏ పనైనా సాధించవచ్చును.

[సంపాదన: ఎమ్. ఎస్. ఎమ్.]



కవులు-ధనాపేక్ష

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

కవితామల్లికిన్ ధనము ప్రధానమా? అని మొగలుతుర్తి సంస్థానంవారిమీద చెప్పిన పద్యాలలో వొకానొక వాక్యం దొర్లింది. యీ వాక్యం పుట్టి యిప్పటికి సుమారు యేభై వత్సరాలు దాటవచ్చాయి. యిప్పటికి దీన్ని ఋజువు చేయడానికి అవసరం కలిగింది. కవిత్వానికి ధనం ప్రధానం అవునందామా? యిలా అనడానికీ కొన్ని వుపపత్తులు కనపడతాయి. కాదందామా? అందుకూ కొన్ని వుపపత్తులు కనపడతాయి. యితరుల జోలి మా కెందుకు? తి॥వెం॥ కవులు యేలా ప్రవర్తించా రంటే, దానికి జవాబు చెప్పే పూచీ ఆ జంటలో వొకడయిన వెం॥ శా॥ ది కాదు. అసలు ధనార్జనోపాయాలు జనరల్‌గా యెన్ని వున్నాయి? అంటే, యెన్నైనా వున్నాయి, వుండడానికేం. శర్విలకుడు దొంగతనాన్ని చాలా ప్రశంసించాడు. బ్రాహ్మడికి అసలు యజ్ఞోపవీతం దొంగతనానికి ప్రధానమైన కన్నం కొలతకే కాదు, యింకా దేనికో దేనికో వుపయోగిస్తుం దంటూ వ్యాఖ్యానించాడు. యుక్తులకేం, యేవో ప్రతీదానికీ చెప్పవచ్చు. వొకడు సముద్రమంతా కల్లయితేనా అన్నాడని విన్కిడి. కవి అనే పేరు వేదంలో కూడా వుంది—"శుచిః కవిః" అన్నాడు వేదపురుషుడు. ఆయీ శుచి బాహ్యంమాత్రమే అయి అంతస్సుని కల్మలంగా వుండే పక్షంలో "దివాఘూర్తై ర్జగ ద్వంచ్యతే" అవుతుంది. కనక మనం అంతశ్శుద్ధినే పుచ్చుకోవాలి. "తద్దినానికి పారణం రశీదు" కనక అంతశ్శుద్ధికి రశీదు సత్యతత్పరత్వం. అసత్యానికీ కపటానికీ చాలా దగ్గిఱ బాంధవ్యం. యెవడు అసత్యానికి జంకడో వాడు కపట ప్రవర్తనకు జంకడు.

(1) కపటీ (2) అనృతవాదీ: పైకి వేఱువేఱుగా స్థూలదృష్టికి గోచరించినా (జీవేశ్వరుల వలె, 'ద్వా సుపర్ణా సయుజా' శ్రుతి చూ.) పరమార్థానికి వొక్కటే (అద్వైతం పరమార్థతః చూ.) ఆయీ జీవేశ్వరస్థానాపన్నులు తీరా ప్రాణోత్క్రమణం దాపయిన కాలంలో చాలా (యేకొంచెమేనా జ్ఞానులయితేనే) పశ్చాత్తపిస్తారు. కాని ప్రయోజనకారి కాదు. మొట్టమొదటినుంచీ జాగ్రత్తగా కాలం వెళ్ళబుచ్చాలి. కొందఱు—"యింకెత్తర యెత్తరా" అనే కాలంలో అనగా పశ్చాత్తపించదగ్గ కాలంలో కూడా పశ్చాత్తపించరు సరిగదా, పైపెచ్చు అప్పుడుకూడా కపటప్రవర్తన మానరు. నా జీవితకాలంలో గీరతరచనాకాలంలో దీనికి కొంత దృష్టాంతం కనపడింది—కొంచెం వుటంకిస్తాను:

(1) "కట్టుచునున్నవారు గృహకాండము నారకముందు..."

(2) కవ్వా, (కొంగ) చారులు డాగనేర్తురె! అటఁ గాపట్యముల్ నిల్చునే! జిహ్వాచ్ఛేదము సిద్ధమౌ బెటిగి భాషింపం బ్రయత్నింపుమా?"

ఆయీ పద్యాలు పురశ్చరణంలో వుంటాయి; లేదా లోకాభిరామాయణంలోనేనా వుంటాయి. అగాధమైన వొకానొక అభూతకల్పన (వెం॥ శా॥ తండ్రికి అన్నం పెట్టక యిలు వెడలగొట్టినాడు అనేది) శిష్యులిద్దఱిలో వొకడు కల్పించిన సందర్భంలోవి. అయితే దేనికదే చెప్పాలి. అనాలోచితంగా మాత్సర్యాన్ని పురస్కరించుకొని అట్టి చెడ్డకల్పన చేస్తే చేశాడుగాక, నేను పైని వుదాహరించిన పద్యాలతో తీక్ష్ణంగా ప్రశ్నించినప్పుడు మాత్రం, కిక్కురుమనక వూరుకోవడానికే నా మనస్సు సంతోషించింది. యెన్నడున్నూ కుమార్గాన్ని పడని వ్యక్తులు ప్రపంచకంలో లేకపోరు. కాని ఆ వ్యక్తులు చాలా మృగ్యులు. నూటికి డెబ్భైమంది వెంటనే ఆ మార్గాన్ని వదులుకొని మంచి త్రోవలోకి వస్తూ వుంటారు. మొదటివారంత కాకపోయినా, యీ రెండో తెగవారుకూడా నా మతంలో—అభినందనీయులే. వొకడు జూదం ఆడేవాడు కొన్నాళ్లకి మానేశాడు. అభినందనీయుడే. కొంతకాలం చేయనే చేశాము; యిప్పుడు "వృద్ధా నారీ పతివ్రతా" అయితే యేం ప్రయోజనం, అనుకోవడం పెద్ద పొరబాటు. వొకదొంగ అవసానకాలంలో కొడుక్కి 'యేపనేనా చేశువుగాని—దొంగతనం మాత్రం చేయవద్దని బుద్ధిచెప్పడం (యీదొంగ మావూరివాడే) నేను స్వయంగా విన్నాను. శాస్త్రం సత్యమే అయితే యీదొంగ లోగడ చేసిన పాపంలో చాలా భాగానికి 'రిమిషన్' భగవంతుడు యిచ్చితీరాలి. యేదో వ్రాస్తూ దేనిలోకో పోతూవున్నట్టుంది లేఖిని. సారం—ప్రాణప్రయాణసుముహూర్తం దగ్గిఱబడిన కొద్దీ లోగడ చేసిన మాదిరి చెడ్డపనులు (కపటం వగైరా) తగ్గించుకోవడం కొంతేనా శ్రేయస్కరం. అంతేనే కాని—

"తండ్రితరమునఁ బెన్మిటితరమునందు
పిసమంతేని పున్నెమ్ము చేసి యెఱుఁగ
వార్ధకమ్మున నింకేల వట్టితొడుకు
కృష్ణ దక్కింపకున్న నాకేమి చిక్కు"

అనుకోకూడదు. అన్ని వయస్సులలోనూ వార్ధక్యమే (గడుపు నేరికోస్తేనే) పరిశుద్ధమైన వయస్సు. ఒక కవి—

"ఎల్లసుఖమ్ములు చేకొనఁ
జెల్లుట యౌవనమునంద చేకుఱు"

అంటూ వ్రాశాడు. నేను వ్రాసే విషయం వేఱు. ఆ కవి మనస్సులో పెట్టుకొన్నది వేఱు. కనక వీట్లకు పరస్పర బాధ్యబాధకభావం లేదు. కాలిజోడు ముసలిదైనకొద్దీ మెత్తగా వుంటుంది. నీరుకావిబట్ట చిరుగట్టే రోజుల్లో యెక్కువ వన్నెకు వస్తుంది. యేమాత్రం వివేకమున్నా వార్ధక్యంవంటి వయస్సు మఱొకటి కాదు. ఆయీ వార్ధక్యంలోనే లేనిపోని బాజరబందీ (వ్యవసాయం వేదాయం ఒకటేమిటి) నెత్తిని పెట్టుకుంటే ఆ వార్ధక్యం యెందుకూ కొఱగాదు. నాకు భగవంతుడు జన్మజన్మలకీ బాజరబందీ లేని వార్ధక్యాన్నే యివ్వాలని కోరుకుంటాను. యీ జన్మంలో ఆయీ కోర్కి చాలా భాగం సఫలమయినట్టే. సుమారు యిరవైయేళ్లనుంచి నేను సంసారగోష్ఠి వదులుకున్నాను. కాలక్షేపంకాక యేవో వ్యాసాలు వ్రాస్తూ వుంటాను.

కవిత్వానికి ధనార్జన ప్రధానం కాదని వ్రాస్తూ దేనిలోకో లేఖిని దూకింది. యితరులమాటెందుకుగాని కవులకు కూడా సంసారమంటూ వుంటుందిగదా? దాని పోషణకు "ధనం కావాలా? వద్దా?" అని ప్రశ్నించుకొని నాల్గు మాటలు వ్రాసి దీన్ని ముగిస్తాను. వెనకటి కవుల సంగతి వేఱు. వారికి యిప్పుడున్నన్ని అర్జనోపాయాలు లేవనే చెప్పవలసివస్తుంది. అచ్చుపడుపాయం, పోస్టుపడుపాయం, యెన్నో నేటి కవులకు అర్జనోపాయాలు యేర్పడ్డాయి. మా ముత్తాత పెద్ద కవి. కొన్ని ప్రబంధాలు వ్రాశాడు. ఒక్క కానిడబ్బు కూడా ఆర్జించి యెఱుగడు. నా రోజులు వేఱు. చాలా ఆర్జించాను. యిది నా ప్రయోజకత్వం కాదు. కాలంలో వుంది యీ కిటుకంతా. యేదో పుస్తకం రచించి అచ్చువేసి అమ్ముకుంటే బోలెడు ధనం ఋజుమార్గంగానే సంపాదన అవుతుంది. కాని పదిమందికి రుచించే కవనం కాకపోతే అచ్చుకు పెట్టిన పెట్టుబడికి యిల్లూ వాకిలీ అమ్ముడవతాయి. నాటకాలు వ్రాసి ఆర్జించే కవులు కొందరున్నారు. సినీమాకి పనికివచ్చే కవనం రచించి (వేలకు వేలే) ఆర్జించే కవులు కొందఱున్నారు. అందుచేత పూర్వకాలంకంటె యీ కాలం కవులకు చాలా అనుకూలించిం దంటాను నేను. ధనార్జనోపాయాలలో వర్తకం అగ్రస్థానానికి వస్తుంది, (॥"వాణిజ్యే వర్తతే లక్ష్మీః") కాని దానికి యేకొంచెమో అసత్యమో, కపటమో, లేదా యీ వుభయమో ఆసరా వుండితీరాలి. అంతేకాదు; కొంత ధనం పెట్టుబడికి వుండాలి. అందుకే కుట్టికవి—"వాణిజ్యం ధనమూలకం" అన్నాడు. కవులకు అది పుస్తకాపేక్ష కనక వాణిజ్యం (పుస్తకాల అమ్మకం తప్ప) సంఘటించదు. పుస్తక విక్రయణం యితర వర్తకాలవంటిది గాదు. పాములలో బురదపాము కెంత గౌరవమో వర్తకాలలో దీనికి అంతే. క్రియలో మాట, యీ కాలంలో కవులకి (అందరికీ కాదు) పాపం రాని విధంగా జీవించే సదుపాయాలు చాలా వున్నాయి. అయినప్పుడు పాపాలకల్లా ప్రథమపాపం "నాఽనృతాత్పరం పాతకం" గదా! అనృతం, లేదా కపటం మంచిచెడ్డలు తెలిసిన కవి యీ కపటానికి, లేదా అనృతానికి దిగవచ్చునా? లోకం గేలిచేస్తే చేస్తుంది. నన్ను నేనే మెచ్చుకుంటాను. అనృతమాడిగాని కపటంద్వారాగాని నేను వొక పైసా కూడా ఆర్జించలేదు. యిప్పుడు 78 నడుస్తూ వుంది. యీ శేషకాలం కాస్తా అనృతదోష కళంకాన్ని ఆపాదించకుండా జరగనివ్వదా? యిలువేల్పు కామేశ్వరి; జన్మానికల్లా శివరాత్రిగా నేను అసత్యమాడింది. శ్రీనాథుని వీథినాటకపు కేసులో మాత్రమే—అది పాండిత్యప్రకర్షకు గుఱుతు గాని అందులో స్వార్థము లేశమూ లేదు, ఆమహాకవి కవిత్వానికి ముప్పమూడుతూ వుంటే చక్కని అర్థం చెప్పి సమర్థించడం సుకృతమే అని సరిపెట్టుకున్నప్పటికీ అది నా హృదయంలో అప్పుడప్పుడు మెఱుగుతూనే వుంటుంది. వాదోపవాదాలలో యే మూడు నాలుగుపదాలకో మార్గాంతరం త్రొక్కి సమర్థిస్తూ వచ్చాను కాని, వెంటనే దాని తత్త్వాన్ని ప్రతివాదికి వెల్లడి చేస్తూ వచ్చాను. ఇంతకన్న నాకు కొంచెం జ్ఞానం వచ్చిందిమొదలు యెన్నడుగాని అసత్యమాడిన జ్ఞాపకం లేదు.

"అభినవ రామలింగ బిరుదాంకితత్వం" ప్రకటించే గాథలు యేకొంచెమో ఆయీ దోషాన్ని ఆపాదించేవి లేక పోవు. అవి యేవీ స్వార్థనిర్వహణార్థం జరిగినవి కావు. కనక నాకు నన్నయ్య కవనముండేకాక ఆయనగారి బిరుదం—"నిత్యసత్యవచను" అను దానియందుకూడా పరమాదరమే అని చేతులెత్తి నిర్భయంగా చెప్పుకోవడానికి యెక్కువ అధికారం వుందేమో నాశిష్యవర్గం తెలుసుకొనుగాక.

అచ్చయ్య పెదవి విరుస్తూ తల పంకిస్తూ "ఇవన్నీ కొనసాగని యెత్తులు! వట్టి ఊహలు! సరిగ ఒక్కగజం యెత్తు లేని బొమ్మవి నువ్వేమిటి, నన్నెమిటి, వీపుమీద ఎక్కించుకొని యీది ఒడ్డు చేర్చడమేమిటి!"

"పోనీ, ఒకసారి ఎక్కి చూడు; నీకే తెలుస్తుంది". ఇంక మారు మాట చెప్పకుండా పినాకరావు టేబిల్‌మీద కొవ్వొత్తి తీశాడు. తీసి దానితో దారి చూపిస్తూ వాళ్ల నాన్నని భయం "లేదు, నా వెనువెంటనే రా నాన్నా" అని పిలిచాడు. వాళ్లిద్దరూ కలిసి కొంతసేపు నడిచారు. ముందు దాని శరీరం తర్వాత దాని కడుపు దాటి బయట పడ్డారు. ఇంక గొంతుక ప్రారంభం అవుతుందనగా బయటికి పోవడానికి ఏంచెయ్యాలి, అని ఆలోచించుకొని అన్ని వైపులా జాగ్రత్తగా చూచుకున్నారు. ఈ తిమింగిలం చాల ముసలిదై పోయింది. పైగా దానికి శ్వాసరోగం: రగ్గు, వగర్పు. అందుచేత నోరు తెఱచి పడుకుంది. ఎప్పుడైతే పినాకరావు దాని గొంతుక దగ్గరికి వచ్చాడో అక్కడనుంచి చూస్తే దూరంగా నీలి ఆకాశం, తెల్లని చుక్కలు, పాలవంటి వెన్నెల అందంగా కనిపిస్తున్నాయి.

"నాన్నా! రా! ఇదే మంచి సమయం. ఇపుడే మనం తప్పించుకొని పోవాలి. ఇది కుంభకర్ణుడిలాగ నిద్ర పోతూవుంది. సముద్రం కెరటాలు లేకుండా ప్రశాంతంగా ఉంది. బయట పట్టపగలులాంటి వెన్నెల, నాకూడా రా నాన్నా, మనం ఇంకో క్షణంలో బ్రతికి బయటపడతాం" అన్నాడు పినాకరావు. వాళ్ళిద్దరూ కలిసి ఆ గొంతుకద్వారంలోకి వచ్చి, కాలి బొటనవ్రేళ్ళతో దాని నాలుక మీద నడుస్తున్నారు. చివరికి వస్తారనగా, పినాకయ్య తండ్రిని చూచి "నాన్నా! నా భుజంమీద ఎక్కు. నీ చేతులు రెండూ గట్టిగా నా మెడకి చుట్టబెట్టి, పట్టుకో తర్వాత నేనంతా చూచుకొంటానులే" అన్నాడు.

ఎప్పుడైతే అచ్చయ్య అలాగ ఎక్కి కాళ్లూ చేతులూ పినాకయ్య వీపుమీద పెనవేసుకొన్నాడో, వీలు చూచుకొని పినాకరావు ఒక్క ఉరకను సముద్రంలో పడ్డాడు. పడి యింక యీదడం మొదలుపెట్టాడు. సముద్రం ప్రశాంతంగా ఉంది. చందమామ తన వెన్నెలంతా క్రుమ్మరిస్తున్నాడు. ఆ తిమింగిలం గాఢనిద్రలో ఉంది. వెయ్యి ఫిరంగులు వేసినాగాని అది లేచే స్థితిలో లేదు. ఇన్ని వీల్లు చూచుకొని పినాకరావు తండ్రిని వీపుమీద ఎక్కించుకొని సముద్రంలో ఈదుకొనిపోతూ ఉన్నాడు.

గాంధీజీ వద్ద నా శిష్యరికం

వార్ధా పరిసర గ్రామాలలో, గ్రామసేవాసక్తయగు మహిళామణి అనుభవాలు

శ్రీమతి బసవరాజు రాజ్యలక్ష్మమ్మ

పురుషోత్తముడైన బాపూజీ వర్ధాలో యేనాడైతే అడుగు పెట్టారో అప్పటి నుండీ కూడా వర్ధా ఒక పుణ్యక్షేత్రంగా మారి పోయింది.

బాపూజీపాదధూళిచేత వార్ధా ఆ చుట్టు ప్రక్కల వున్న గ్రామా లన్నీకూడా పవిత్ర భూములై పోయినవి. ఒక్క వర్ధా అన్నమాట యేమిటి! బాపూజీ ఎక్కడ అడుగు పెడితే అక్కడే పుణ్యక్షేత్రాలు విలసిల్లినవి.

బాపూజీపరిచయం జీవితంలో ఒక్కసారి కలిగితే ఆయన మనను మరచిపోరు మనం ఆయన అడుగు జాడల్లో నడవకుండ వుండనూ లేము! బాపూజీలో ఒకవిధమైన ఆకర్షణ శక్తి వున్నది. నాజీవితంలో బాపూజీదగ్గర వర్ధాలో గడిపిన రోజులు, ఆయన వుపదేశభాగ్యము అన్నీకూడా బాపూజీ పోయిన తర్వాతకూడా కళ్లకి కట్టిన ట్టున్నవి. నేను వర్ధామహిళాశ్రమానికి వెళ్లిన రెండవరోజే పురుషోత్తముడైన బాపూజీని చూచుటకు సేవా గ్రామం వెళ్లాను. మా ప్రిన్సిపాల్ గారైన కృష్ణా తాయి కుల్ హట్కారు గారునన్ను బాపూజీకి ఎరుకపరుస్తూ నేను శిక్షణపొందుటకు. బెజవాడ నుండివచ్చి నట్టుగా చెప్పారు. బాపూజీ చిరునవ్వుతో నా పేరు అడిగి తెలుసుకుని నీవు యిక్కడికి రావడం నాకు చాలా సంతోషం. నీసంగతి విశ్వదాత వుత్తరంవల్ల నాకు ముందుగానే తెలిసింది. నీవు గతానికి విచారపడకుండా ధైర్యముగావుండి పనిచెయ్యమని ఆశీర్వదించారు. బాపూజీ నన్ను గ్రామాల్లో పని యెక్కువగా చెయ్యమని చెప్పారు.

బాపూజీ అజ్ఞానసారంగా మహిళాశ్రమ సోదర మణులతోపాటుగా వారానికి అయిదు రోజులు గ్రామాల్లో పరిశుభ్రత కై పనిచేయుచుండే దాన్ని. బాపూజీ నన్ను పరీక్ష చెయ్యటానికి కాబోలును, వెళ్లిన మరునాటినుండీకూడా ఆశ్రమములో (ట్టీసఫాయి) పాకీదొడ్ల పనికూడా యిప్పించారు.

మొదటిసారి ఫూల్ వాడీ అనే దగ్గర గ్రామంలో శుభ్రము చేయుటకు అడుగు పెట్టగానే అసహ్యము భయముకూడా నన్నావరించినవి. పేరుకుమటుకు ఫూల్ వాడీయేగాని సార్థక నామముగల పూరుమాత్రంగాదు. పూలవాసనకు బదులు ఎక్కడచూచినా దుర్గంధము, మురికికాలవలు, మనుష్యులయొక్క అశుభ్రత నానాఅరోచకముగానూ వున్నదేమ! అనుకున్నాను.

ఈ దుర్గంధాన్నంతా భరించి, ఎల్లా బాగు చేస్తామురా భగవంతుడా? అనుకున్నాను. నాతోటి సోదరీమణులు చాలా రోజులనుంచీ ఆశ్రమములో వుండుటవల్ల వారికి అలవాటే గనుక వెళ్ళగానే అసహ్యంపడకుండా చేతులతో ఆ మురుగు అంతా తీసి బాగుచేసే వారు. కోటీశ్వరుడైన సేట్ జమునాలాల్ బజాజ్ గారు, వారి కుటుంబ స్త్రీలుకూడా మాతోపాటు గ్రామాలు బాగుచేసేవారు.

ఒకరోజు బాపూజీదగ్గరకు వెళ్లాను. బాపూజీ నన్ను కుశలప్రశ్న లడిగినతర్వాత నేను బాపూజీతో అన్నాను. బాపూజీ ఫూల్ వాడీలో శుభ్రముచేయుటం చాలా కష్టంగా వున్నది. ఆ దుర్గంధం భరించలేకుండా వున్నాను అన్నాను.

బాపూజీ చిరునవ్వుతో "ఆ దుర్గంధాన్ని అంతా పోగొట్టి బాగుజెయ్యటమే నీ విధి; అల్లా అంటే ఎల్లాగు మూడురోజులు నీవు ఫూల్ వాడీలోనే వుండి బాగుచెయ్యి"అన్నారు. కర్ణాటక్ నుంచీ తమిళనాడునుంచీ నలుగురు కొత్త సోదరీమణులు వచ్చారు. వారికీ నా అవస్థే! అందువల్ల వారినికూడా ఫూల్ వాడీలోనే వుండి నాతోపాటు పనిచెయ్యమన్నారు.

మేము ఫూల్ వాడీలో మూడురోజులున్నాం మొదటిరోజు గడపటమే కష్టమైంది. మాకు ఆ రోజుఅంతా నిద్ర లేక, దుర్గంధం సహించలేక, దోమలబాధ పడలేక నరకం అనుభవించాము. తెల్లవారుజామున ప్రార్థన తర్వాత కాలవలన్నీ, చుట్టుప్రక్కలంతా శుభ్రము చేస్తేగాని నిలవలేమనుకుని చీపిరీ, తట్టా, పారా, పట్టుకుని శుభ్రముచెయ్యటం మొదలుపెట్టి సాయంకాలానికల్లా చాలా బాగా శుభ్రంచేశాము. లోపనూ అదీ వేసి మురికికాలవలతోసహా చాలా బాగా శుభ్రము చేశాము.

మేమున్న మూడు రోజులలో, వూరు చిన్నదే కాబట్టి, చాలాభాగం శుభ్రపడ్డది! కాని మరునాటికి యథాప్రకారం చేసేవాళ్ళు గ్రామస్థులు. ఎంతచెప్పినా వినేవాళ్ళు కాదు.

బాపూజీతో వెళ్లి చెప్పినాము: "బాపూజీ, మేమున్న మూడు రోజుల్లో చాలావరకు ఆ దుర్గంధాన్నంతా పోగొట్టి లోపనూ వేసి మురికికాలవలతో సహా శుభ్రముచేశాము. మమ్మల్ని యింకో వారంరోజులు అక్కడే వుంచితే పూర్తిగా బాగుపడేవరకుండి చేస్తా" మని చెప్పాము. బాపూజీ చాలా సంతోషించారు.

మొదట నేను బాపూజీతో చెయ్యటం కష్టంగా వున్నదని చెప్పినందుకు చాలా విచారపడ్డాను. అల్లా యెందుకు చెప్పేనా అనికూడా అనుకున్నాను.

మనం చెయ్యలేని పని యేమీ వుండదు ప్రపంచంలో, కొంచెం ఓర్పు అనేది వుంటే అనుకున్నాను.

ఆ తర్వాత గ్రామాల్లో శుభ్రము చేయుటకు గాని, ఆశ్రమములోపల పాకీదొడ్లు బాగుచేయుటకుగాని అసహ్యించుకోకుండా మనస్ఫూర్తిగానే చేసేదానిని. నాలో పూర్తిగా మార్పు గలిగినందుకు బాపూజీఆశ్రమ సోదరీమణులు కూడా సంతోషించారు.

బాపూజీ వుపదేశభాగ్యంవల్ల నేను గ్రామాల్లో పనిచేసేటప్పుడు (వర్ధాలో వున్నప్పుడు) యెన్నో అనుభవాలను పొందగలిగాను.

మొదట గ్రామస్థులు శుభ్రముగా వుండు పద్ధతి చెపితే మామీద చాలా కోపం వచ్చేది వాళ్ళకు. మమ్మల్ని తిట్టేవారనికూడా చెప్పవచ్చును. కాని కొన్నిరోజులైనతర్వాత గ్రామస్థులంతా కూడా మమ్మలను ఎంతో ఆదరించేవారు. మాతో కలిసిమెలసి పనికికూడా సహాయం చేసేవారు. వారి గృహకృత్యాల్లో వున్న కష్టసుఖాలన్నీకూడా సొంత అక్కచెల్లెళ్ళతో చెప్పుకున్నట్టుగా మాతో చెప్పుకునేవారు. మేము కూడా వారికి తగిన సహాయం చేస్తూ వుండేవాళ్ళము.

బాపూజీదగ్గర శిక్షణ పొందుతూ గ్రామాల్లో నిరాడంబరజీవులు నిష్కల్మషహృదయులైన ఆ గ్రామస్థులతో కలసిమెలసి పనిచేస్తుంటే విషయాలు నేర్చుకోగలిగాను. బాపూజీ ఆశ్రమవాసులను ఎంతో దయతోనూ, ప్రేమతోను ఆదరించేవారు.

బాపూజీ విషాదవార్త వినగానే నా పెద్ద అండకాస్తా కూలిపోయినట్లు భావించాను. నా తండ్రి పోయినట్టు విలపించాను. కొన్నాళ్ళయినా బాపూజీదగ్గర వుండి ఆయన వుపదేశభాగ్యం పొందుతూ సేవ జెయ్యటం పవిత్రమైన రోజు లనుకుంటున్నాను. ఎన్నటికీ మరచిపోని పుణ్యమూర్తి బాపూజీ తన దివ్యచిత్రాన్ని నామనస్సులో చిత్రించే పోయినారు.

పుణ్యదంపతులు కస్తూర్బా? బాపూజీలు ఒకచోటికే చేరుకున్నారు. బాపూజీ ఆ లోకంలోనుంచీకూడా మన యోగక్షేమాలు విచారిస్తూనే వుంటారు. ధన్యజీవి బాపూజీని ఎన్నటికీ మరచిపోలేము.

చెట్టిగారికి చేదోడు:

అదనపుసుంకాలకు అవకాశాలు - బ్రహ్మచారి భావోద్వేగం

శ్రీ జి. యన్. సూరి

మార్చినెల బడ్జెట్ల నెల. ప్రతిశాసనసభలోను ఆర్థికశాఖామంత్రులు ఆదాయవ్యయాలను సరిపెట్టటానికి భగీరథ ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. మన అందరి వ్యవహారాలలోవలెనే ప్రభుత్వపుబడ్జెట్లలోగూడ జమాఖర్చులకు లంగరందదు. అయితే మనకు లేని అధికారాలు ఉన్నందువల్ల పాత పన్నులను హెచ్చించి కొత్త పన్నులను కల్పించి ఆదాయవ్యయాలను అందుబాటులోకి తేగలుగుతారు.

ఈసంవత్సరం సంకురుకుయదృష్టి సిగరెట్లు, నిప్పుపెట్టెలమీద, కాఫీ, తేయాకులమీద ప్రసరించింది. అందుచేత దేశంలో నిరతాగ్నిహోత్రులు, కాఫీదేవతోపాసకులు అస్త్రసన్యాసంచేస్తున్నామని తాత్కాలికప్రతిజ్ఞలు చేయవలసివచ్చిందేకాని బడ్జెట్ లోమాత్రం లోటు రాకుండా తప్పలేదు. మన పార్లమెంటుప్రతినిధులు షణ్ముఖంచెట్టిగారి అగచాట్లను చూసి జాలిపడి కొత్తగా పన్నువేయతగిన కొన్ని విషయాలను సూచించారు. శిశువులమీద పన్ను వేయాలన్నారు బీగంరసూలుగారు; బ్రహ్మచార్లకుకూడ వడ్డించాలన్నారు మరియొక గృహస్థు.

బ్రహ్మచార్లపన్ను అనేసరికి శాఖామంత్రిగారు భుజాలు తడుముకున్నారు. సహచరిణినొప్పించటానికి ఇష్టం లేకపోవటంవల్ల ఈ తడవకు బ్రహ్మచార్లు బయటపడ్డారు. మద్రాసు మంత్రులలోగూడ కొందరికి ప్రాణాలు కుదటపడ్డవి. అసలు బ్రహ్మచార్లను చూస్తే అబ్రహ్మచార్లకు అసూయ. చీకూ చింతా లేకుండా నిత్యకల్యాణం పచ్చతోరణం అన్నట్టు ఉండే అవివాహితులు సంసారసాగరంలో 'మునగానాంతేలానాం' అంటూ ఉండే వివాహితుల కండ్లకు కంటకంగా కనిపిస్తారు. నయానో భయానో, నచ్చచెప్పో రెచ్చగొట్టో వాళ్లకు ఆ హోదా తొలగిస్తేనేగాని గృహస్థులకు సంతృప్తి కలగదు.

పసిపిల్లలవిషయం మరీ వింతగా తయారయింది. కళ్లను గురించి ఇతరులు పడే ఆవేదన కనిపెంచేవాళ్లకు ఉండనే ఉండదు. ఇన్నాళ్లూ గంపెడు పిల్లలున్నారంటే ఘనంగా ఉండేది. పదిలక్షలున్నవాడికంటె పదిమంది పిల్లలున్నవాడికే ఎక్కువ గౌరవం ఉండేది. అసలు సంపదకు సంతానానికి పొత్తు కుదురుతుందని తోచదు. బహుశా ప్రతివ్యక్తిని భూలోకానికి రవాణాచేసేముందు భగవంతుడు "నీకు సంపదలు కావాలా? సంతానం కావాలా?" అని అడిగి పంపివేసేట్లున్నాడు. రెండూ కావాలన్న వాళ్లకు ప్యారుపోర్టు మంజూరుచేయడని ఊహించవచ్చు.

ఇప్పుడీ దృక్పథం చాలావరకు మారిపోయింది. కంటెలు, కడియాలమాదిరిగానే పిల్లలుకూడ మోటు అయినట్లున్నారు. సంసార్లకుకూడ పిల్లలగొడవ తగలాటకంగా తయారయింది. వయసు మళ్లితేనేగాని సంతానవాంఛ అంకురించేట్లు కనబడదు. బ్రహ్మచార్లను చూసి వివాహితులు అసూయపడుతున్నట్లే పన్నెల విసనకఱ్ఱలాగా ఉండే విడిపడుచులను చూస్తే పిల్లలపల్లులకు కన్నెఱ్ఱగా ఉంటున్నట్లు తోస్తుంది.

ఈమధ్య ఇంగ్లండులో ఒక ముఖ్యమైన తీర్పు వచ్చింది. సంతాననిరోధకసాధనాల నుపయోగిస్తేనేగాని సంసారానికి వీలులేదన్నదట ఒక గృహిణి. దీపంఉండగానే ఇల్లు చక్కపెట్టుకోదలచిన ఆ మెగుడు అందుకు ఒప్పుకోక విడాకులకోసం దావా వేశాడు. ప్రీవీకౌన్సిలు ప్రభువులు ఇలాంటి పరిస్థితులలో వివాహం రద్దు చేయవలసిందేనని నిర్ధారణ చేసి తీర్పు చెప్పారు. సులభంగా ఈమార్గాన విడాకులు తెచ్చుకోవచ్చునని అక్కడ స్త్రీలలో చాలమంది సంతోషిస్తున్నారట అప్పుడే మతగురువులు ఈ తీర్పువల్ల సంఘానికి పోయేకాలం వస్తుందని హెచ్చరికలు చేస్తున్నారు. ఇంకా విడాకులబిల్లు చట్టమై అమలులోకి రాలేదు కాబట్టి ఇలాంటి అవకాశం ఇప్పట్లో మనకు సిద్ధించేట్లు కనబడదు.

అయినా శిశువులమీద సుంకం వేస్తేఅనేక సాధకబాధకాలు తయారవుతాయి. అసలే సంతానం కలుగకుండా జాగ్రత్తపడడం, నవనాగరికులకుతప్ప సామాన్యజనానికి ఇంకా బాగా తెలియదు. కొంతమందికి ఇది ఇష్టంకూడా కాదు. ఇష్టమయినా, బిడ్డల పోషణకు ఎక్కువ ఖర్చు అవుతుందో, లేక ఈ పరుకు సరంజామాకు ఎక్కువ ఖర్చు అవుతుందో సులభంగా తేల్చి చెప్పటం కష్టం. అటువంటప్పుడు ఉన్నవాళ్లు పొట్టలు నింపటానికే, టికాణా కనబడని రోజుల్లో శిశువులసుంకంకూడ అవతరిస్తే అనేకులు బ్రహ్మచార్లుగా ఉండిపోవలసివస్తుంది. అట్లా ఉండిపోయినా పన్ను తప్పేట్లు లేదు మొత్తానికిదిమగవాళ్లకు పెద్ద సమస్య.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

చైనాకు అమెరికా ధనసహాయం

చైనాలో ప్రభుత్వానికీ, కమ్యూనిస్టులకూ యుద్ధం ప్రచండంగా జరుగుచున్నది. మంచూరియాలో ఇనుము, ఉక్కు పరిశ్రమ కేంద్రమైన అన్షన్ కమ్యూనిస్టుల వశమైపోయినది. మంచూరియాలో అయిదింట నాలుగు వంతులు భూభాగం కమ్యూనిస్టుల వశమైపోయినది. అంతేగాక కమ్యూనిస్టులు ఇతర ప్రాంతములలోకూడ విజృంభించుచున్నారు. క్యుమింటాంగ్ ప్రభుత్వమునకు ఎటుచూచినను అపజయములే కనిపించుచున్నవి.

చైనాకు వెంటనే ధనసహాయం చేయకపోతే, క్యుమింటాంగ్ ప్రభుత్వం పతనమైపోకుండేమోనని అమెరికన్ ప్రభుత్వం భయపడుతున్నది. ఇదివరకటినుండి చేసిన సహాయంగాక అదనంగా మరొక 57 కోట్ల డాలర్లు చైనాకు సహాయం చేయవలసిందని అమెరికన్ శాసనసభలను అధ్యక్షుడు ట్రూమన్ ఈమధ్యనే కోరినాడు.

ట్రూమన్ అధ్యక్షపదవి స్వీకరించినప్పటినుండి చైనాపట్ల అమెరికన్ వైఖరి నిర్దుష్టముగానే యున్నది. కమ్యూనిజం వ్యాప్తికి అవరోధము కల్గించుటకు అవుసరమైనంత సహాయమును చైనాకు చేయుచుండుటయే ట్రూమన్ ప్రభుత్వవిధానము. కాని ట్రూమన్ పరిపాలన వచ్చినప్పటినుండి కూడ క్యుమింటాంగ్ ప్రభుత్వము కమ్యూనిస్టులతో సంఘర్షణలో అపజయమునే పొందుచు ట్రూమన్ విధానము సఫలము కానిచ్చుటలేదు; తద్వారా తాను లాభము పొందగలుగుటలేదు.

అమెరికాలో హెన్రీవాలెస్, అతని అనుచరులును తప్ప ఇతరులెవ్వరు చైనాకు ధనసహాయము చేయరాదని వాదించుటలేదు. పైగా చియాంగ్ కై షేక్ ప్రభుత్వమును నిలబెట్టుటకు కావలసినంత ధనసహాయమును చేయవలసిందేనని పలువురు ప్రముఖులు అభిప్రాయపడుచున్నారు. చియాంగ్ కై షేక్ ప్రభుత్వముపట్ల కొందరికి మాత్రము విముఖత కలుగుచున్నది. ఇట్టి విముఖతనే ట్రూమన్ అధ్యక్షుడు నిగూఢముగా వెల్లడించినాడు. దేశీయశాఖ కార్యదర్శి జార్జి మార్షల్ చియాంగ్ కై షేక్ ప్రభుత్వపరిపాలనా విధానముపట్ల తన తీవ్ర అసమ్మతిని బాహాటముగానే వెల్లడించినాడు. కమ్యూనిస్టుల బారినుండి చైనాను కాపాడుటకు అమెరికా చేస్తున్న ధనసహాయమును క్యుమింటాంగ్ ప్రభుత్వము కొందరు ప్రముఖుల స్వలాభము కొరకు వినియోగించుచున్నదని చాలమంది బాధ్యతాయుతులైన అమెరికన్ పౌరులు ఆరోపణ చేసినారు. ట్రూమన్ అధ్యక్షుని ప్రత్యేకరాయబారిగా చైనాలో పర్యటించిన జనరల్ వెడ్‌మేయర్ కూడా చైనా ప్రభుత్వం తన పరిపాలనా విధానమును చక్కబరచుకొనవలెననియే సలహా ఇచ్చినాడు.

యుద్ధకాలంలో, ఇతర రవాణా సౌకర్యములన్నీ బందయిపోయినప్పుడు బర్మారోడ్డు మీదుగాను, హిమాలయ పర్వతముర మీదుగాను 150 కోట్ల డాలర్ల విలువగల సరకు, అరువు-కౌలు చట్టం క్రింద చైనాకు పంపి, అమెరికా ఆదుకున్నది. దీనికి ప్రత్యామ్నాయముగా చైనా అమెరికాకు ధరలు విపరీతంగా పెరిగిపోయిన తన వస్తువులను అమ్మి, అతి అసంమంజసముగా నిర్ణయింపబడిన మారకపు రేటు ప్రకారము ఆ సొమ్మును డాలర్లలోకి మార్చి, ఏదో విధముగా ఆ మొత్తమును సరిపెట్టినది. అరువు-కౌలు సహాయంగాక మరొక 50 కోట్ల డాలర్లు వడ్డీలేని ఋణముగా యుద్ధకాలంలో చైనాకు అప్పుయివ్వబడినది. ఇందులో దాదాపు సగము మొత్తముతో అమెరికాలో బంగారము కొని, విపరీత ధరలకు దానిని చైనా ప్రజలకు అమ్మించి, కొద్దిమంది వ్యక్తులు లాభము పొందునట్లు చైనా ప్రభుత్వము తంత్రము చేసినది.

చైనాలో మిగిలిపోయిన అమెరికన్ సైనిక సామగ్రి—దాదాపు 90 కోట్ల డాలర్లు విలువ వుండవచ్చు—తక్కువ ధరకు అమెరికానుండి కొని ఎక్కువ ధరలకు మరల దానిని అమ్ముకొనుటకు చైనా ప్రభుత్వం కొందరు వ్యక్తులకు అవకాశమిచ్చినవి. లోకోద్ధరణ సంఘ యాజమాన్యమున జరిగిన ధనసహాయముకూడ కొంతవరకు ఇదేవిధముగ దుష్ప్రయోగమొనర్పబడినదని చాలమంది అభిప్రాయము. ఇట్టి ప్రభుత్వమునకు ఆర్థిక సహాయము చేయుట చాలమందికి అయిష్టమే అయినను, చైనా కమ్యూనిస్టుల పాలబడిపోకుండా కాపాడుటకు క్యుమింటాంగ్‌ను రక్షించుటకన్న గత్యంతరము లేదు.

క్యుమింటాంగ్ ప్రభుత్వములో అవినీతి ఇదేవిధముగ వ్యాపించినచో, అమెరికా ఏనాటికైనను ధనసహాయము మానివేయును. అప్పుడు చియాంగ్ కై షేక్ కమ్యూనిస్టులకు లొంగిపోక తప్పదు. కాబట్టి తన ప్రభుత్వయంత్రమును చక్కబరచుకుని, దేశములో ప్రజాస్వామ్య సంస్థలను ఏర్పరచి, తద్వారా కమ్యూనిజమును అరికట్టుటకు, ప్రజాస్వామ్యవాదులను బలపరచుటకు చియాంగ్ కై షేక్ పూనుకొనవలెను.

బర్మాలో భారతీయుల భూములు

బర్మాలో భారతీయులకు జరుగుచున్న అన్యాయములను వివరిస్తూ, వారికి తగు రక్షణ లభించునట్లు అత్యవుసరచర్య గైకొనవలసినదని భారతప్రభుత్వమును కోరుతూ ఈ మధ్యనే మద్రాసు శాసనసభలో ఒక తీర్మానము చేయబడినది.

బర్మాలో భారతీయులు గత 50 ఏండ్లనుండి దృఢముగా పాతుకొనిపోయివున్నారు. వీరికి అక్కడ చాల ఎక్కువ ఆస్తులు, వ్యాపారము వున్నవి. ఐరావతీనది డెల్టాలో 25 లక్షల ఎకరముల భూమి భారతీయులదే. ఈభూమి వరి పంటకు చాల నాణ్యమైనది. ఇదిగాక రంగూన్ మౌల్మెన్ పట్టణములలో వర్తకములో బ్రిటిష్ వారి తరువాత భారతీయులదే పైచేయి. గ్రామములలోని బర్మారైతులుకు అప్పులిచ్చు షాహుకారులందరూ దక్షిణాత్యులగు నాటుకోటు చెటియార్లే! బీదలకు అప్పుపెట్టు షాహుకార్ల వద్దనుండు దుర్గుణము లన్నియు వీరిలో కూడ మూర్తీభవించివుండి, బర్మాప్రజలకు వీరన్న ఏహ్యభావము కల్గించినవి. అందువలననే బర్మా స్వాతంత్ర్యము పొందగనే తమదేశములో భారతీయ ధనాఢ్యులకు గల ప్రాబల్యమును నాశనముచేసి, తమ దేశప్రజలకు సౌకర్యము కల్గించవలెనని భావించుట సమంజసమే కదా.

బర్మాలో బాధ్యతాయుత ప్రజా ప్రభుత్వమేర్పడిన తరువాత, ఋణదాతల బారినుండియు, విదేశ వ్యాపారస్థుల బారినుండియు తమ దేశమును తప్పించుటకు అనేక చట్టములు తయారు చేసినారు. బర్మాకు వలసవచ్చు భారతీయులపై అనేక నిర్బంధనలు పెట్టబడినవి. భారత వ్యాపారస్థులు, తమ వ్యాపారమును జరుపుటకు పంపు గుమాస్తాలు, ఏజెంట్లు మొదలగు వారిపై కూడ నిబంధనలు పెట్టబడినవి. దీని వలన భారతీయులకు—యుద్ధకాలము వరకు బర్మాలో వుండి, ఇప్పుడు తిరిగి బర్మా వెళ్ళదలచిన వారికీ, క్రొత్తగా బర్మా వెళ్ళదలచుచున్న వారికీ—చాల యిబ్బందులు కలుగుచున్నవి. వీనినిగురించి భారతప్రభుత్వము బర్మాప్రభుత్వమును మందలించియే వున్నది. ఇప్పుడు భూమి తరములను గురించి తయారు చేయబడిన నూతనశాసనము భారతీయులకు మరింత విభ్రాంతిని కల్గించినది. 50 ఎకరములకు మించి భూవసతిగల భూస్వాములు, 50 ఎకరములకు మించిన తమ భూములన్నింటిని, ప్రభుత్వం నిర్దేశించినవారికి కౌలుకు యిచ్చి తీరవలెను. ఈ భూములపై కౌలు మొత్తముకూడ ప్రభుత్వమే నిర్ణయించినది. రైతు ప్రభుత్వమునకు చెల్లించు భూమి పన్నుకు రెట్టింపు మొత్తము మాత్రమే భూస్వామికి కౌలు రేటుగా యివ్వబడును. తక్కిన మొత్తము భూమిని దున్నువానికే లభించును. బర్మారైతులు బీదవారు. వారిలో 50 ఎకరములకు మించి భూవసతిగలవారు చాల అరుదు. కాని భారతీయులలో 50 ఎకరములకు తక్కువ భూవసతిగలవారు అరుదు. అందువలన, ఈ శాసనం ద్వారా భారతీయుల భూములన్నీ బర్మా ప్రజలకు కౌలుగా యిచ్చివేయవలసివచ్చి, శాశ్వతముగా వారి హక్కు, భుక్తములలోనే వుండును. భారతీయభూస్వాములకు లభించు కౌలు మొత్తము నామమాత్రపు ఆదాయముగానే వుండిపోయి, వారి భూముల విలువ బాగా పడిపోయి, పెట్టుబడికే నష్టము వచ్చును. ఇందువలననే తమకు అన్యాయము జరుగుచున్నదని బర్మాలోని భారతీయులు ఆందోళన జరుపుచున్నారు.

బర్మా రైతులకు సౌకర్యములు కలిగించుటకు, తమ దేశములో విదేశస్థుల ప్రాబల్యము తగ్గించుటకు బర్మా ప్రభుత్వమునకు పూర్తి హక్కున్నది; అది బర్మా ప్రభుత్వవిధికూడాను. కాని ఇన్నాళ్ళనుండి బర్మా అభివృద్ధికి కృషి చేసిన భారతీయులకు అన్యాయముచేయక, సమంజసముగా వారికి పరిహారమిచ్చుట బర్మా ప్రభుత్వ విధి. ఈ విషయములో బర్మా ప్రభుత్వము బ్రిటిష్‌వారిపట్ల ఎట్టి వైఖరి నవలంబించుచున్నదో, భారతీయులపట్లకూడ అట్టి వైఖరినే అవలంబించుట మంచిది. బర్మాలోని భారతీయులుకూడ, తాము ఆ దేశమునే నమ్ముకుని వుండుట మంచిది. అట్లుగాక, బర్మా తమకు విదేశమని, అచ్చటి తమ ఆస్తులను వీలైనంత త్వరలో అమ్ముకొని తమ దేశమునకు తిరిగిపోవలెనని వారు భావించుచున్నచో, వారికి కనీసపు మొత్తమునే ముట్టజెప్పవలెనని బర్మా ప్రభుత్వము ఆలోచించుటలో తప్పేమియు లేదు.

అసలీ సందర్భంలో మన ఆర్థికశాఖామంత్రులు తిన్నగా ఆలోచించినట్లు తోచదు. జనబాహుళ్యానికి ఇబ్బంది కలుగకుండా క్రొత్త పన్నులు విధించతగిన విషయాలు అనేకమున్నాయి. సన్నకారును నొప్పించకుండ, బడ్జెట్లను లోటుపరచకుండా ప్రయోగించవలసిన క్రొత్తపన్నులనుకొన్నిటిని ఇక్కడసూచించవచ్చు.

శిరోజాలవల్ల కొన్ని దేవస్థానాలు విశేష లాభం సంపాదించటం అదనరూ ఎరిగినదే. ఈ విషయంలో శ్రద్ధ వహిస్తే ప్రభుత్వానికికూడ కొంత రాబడి రావటానికి వీలవుతుంది. చెవుమించి క్రిందికి దిగిన బుట్టక్రాపులపై పన్ను నమూనాగా తీసుకుందాం. ఈవిధమైన జులపాలను మొట్టమొదట ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టి ప్రాపకం చేసింది సాహితీసమితివారు దరిమిలా వారిలో చాలమందికి స్వాభావికకారణాలవల్ల ఇలాంటి విగ్రక్రాపులకు అవకాశం లేని రిపస్థితులు వచ్చేసరికి సినిమాఫిలిములు, భరతనాట్యపుట్రూపులు అందుకున్నాయి. గిరజాల క్రాపులు, దవడ పుస్తీలు, కాళ్లజెర్రి కోర మీసాలు ప్రస్తుతం పరిపాటి అయింది. వీరిమీద పన్ను వేస్తే ఇవి అంతర్ధానమవుతాయని భయపడ నక్కరలేదు. పన్నులు ఎక్కువయినందువల్ల కాఫీలుతాగేవాళ్లూ, సిగరెట్లు పీల్చేవాళ్లూ ఎంతవరకు మానగలుగుతున్నారో వీళ్లూ అంతే. దీనివల్ల కొన్ని లక్షల ఆదాయం ప్రభుత్వానికి తప్పకుండ చేరుతుంది. ఇది పురుషుల విషయం.

ఇక స్త్రీలవిషయం: ప్రస్తుతం ప్రతిపట్టణంలోను అధికంగా అమలులో ఉన్నవి "రెండుజడలు": జానెడు మొదలుకుని బారెడువరకూ ఉండే చెంపజడలు ఇప్పటి నాగరికతాలక్షణం. రామాయణంలో విభీషణుడికి 'త్రిజట' అనే మూడుజడల కూతు రుండేదట. అది అప్పటి సింగారపు పద్ధతి కావచ్చును. కాలక్రమాన మూడల్లా ఒకటయి ఒకటల్లా ఇప్పుడు రెండు అయినాయి. ముందుకాలంలో తిరిగి మూడు అయ్యే సూచనలు లేకపోలేదు. మరొక ఆచారం సినిమాతారలవల్ల సిద్ధించింది. చుట్టకుదురంత జడచుట్ట. దానిమీద నడినెత్తివరకు పూలచెండ్లు దీనిఫలితం. ఈ రెండువిధాల జడలమీద పన్ను విధిస్తే మరికొన్ని లక్షల ఆదాయం తప్పదు.

స్త్రీపురుషులలో ఉభయులకు వర్తించే పన్ను ఈసందర్భంలో మరొకటి సూచించవచ్చును. ఒక్కవారంరోజులలో బట్టతలలను జుట్టుతలలుగాను, పండిపోయిన జుట్టును తుమ్మెదరెక్కలుగాను మార్చగలవనే అరఖుసీసాలు బజారులో ప్రతిచోటా కనిపించుతాయి. వీటిమీద, మరి ఇతరకృత్రిమరంగుసీసాలమీద పన్ను వేస్తే అనేకవేలు ప్రభుత్వానికి చేకూరగలవు.

తరువాత గమనించవలసినది పెళ్లిపన్ను. జననమరణాలకు సుంకాలు చెల్లిస్తున్నప్పుడు వివాహాలకుకూడ చెల్లించటంలో అసందర్భం ఉండదు. అదీగాక డబ్బుకు విలువ కనబడని కాలం వివాహసమయం. ఎవరి మనస్సూ కష్టపడకుండా సంతోషంగా ఈ పన్ను చెల్లిస్తారు. దీనిని వసూలు చేయడానికి వచ్చిన ఉద్యోగులకు భోజనతాంబూలాలు సహితం లభించగలవు. భార్య ఉండగానే అదనపు పెళ్లిళ్లు జరిగినప్పుడు ఈ పన్నురేటును హెచ్చించాలి. ఎంతకైనా తెగించినవారు తప్ప పెండ్లిమీద పెండ్లి చేసుకోరుకాబట్టి ఇలాంటి పన్నును లెక్క చేయకుండా విసిరిపారేస్తారు. ఈ పెళ్లిళ్ల పన్నువల్ల ఒక కోటిరూపాయలైన సర్కారుఖజానాకు సరఫరా చేయవచ్చును.

ఇలాంటి క్రొత్తక్రొత్తపన్నులు విధిస్తే బడ్జెట్లకు లోటు తొలగటమేకాక రామపాదసాగరాలను ఎన్నిఅయినా నిర్మించుకోవచ్చును. అంతేగాని నిప్పుపెట్టెలను, సిగరెట్లను, కాఫీ, టీలను ఆర్థికశాఖామంత్రులు ఎంతకాలం పట్టుకుని పాకులాడినా ప్రయోజనం ఉండదు.

పాకిస్థాన్‌లో నా పర్యటన

(6 వ పేజీ తరువాయి)

మైన భాగము. ఈ రాష్ట్రాన్ని గురించి నాకు ప్రత్యక్షంగా అనుభవం లేదుగాని, దానినిగురించి మాత్రం నాకు సందేహమే. అధినివేశమునంతటిని గూర్చి, అది స్థాపింపబడిన ఇంత కొద్దికాలానికే తొందరపడి ఏమాటా చెప్పటం మంచిదికాదు. నాకు మూడు పశ్చిమరాష్ట్రాలతో మాత్రమే అనుభవం వున్నది. ఆసియాఖండంలోని ఈ నూతన అధినివేశ గ్రహస్థితి బాగానే వున్నట్లు నాకు తోచింది. పాకిస్థాన్ కేంద్రప్రభుత్వ ఉద్యోగి ఒకరు, నా పాతస్నేహితుడు. ఆగస్టులోనే ఒక చక్కని మాట అన్నాడు. భారత నాయకులు, తలచుకొన్నట్లయితే, ఈ అధినివేశాన్ని ఆదిలోనే "దయాస్త్రంతో సంహరించి వుండగలిగేవారు" అని ఆయన అన్నాడు. కాని అన్నివైపులనుండి నిర్దయగా ప్రతిఘటిస్తూ—అని అతడన్నాడు—వారే దానిని పెంచి పెద్దచేశారు.

బాలారిష్టం

ఈ వుద్దేశ్యాన్నే, ఇంకొకరకపు మాటలలో, వజీర్‌స్థాన్‌లోని ఒక పఠాన్ సైనికోద్యోగి కొంచెం కటువుగా నా దగ్గర వెలిబుచ్చాడు. ఇతడు మొన్నటివరకు హిందువులతోను, సిక్కులతోను కలిసి పనిచేసినవాడే. ఈనాటికీ వారి స్నేహప్రియత్వాన్నీ, సామర్థ్యాన్నీ పొగడుతుంటాడు.

ఇండియా పాకిస్థాన్‌ను నాశనం చేయ జూస్తున్నదను ఆరోపణను, అగ్రనాయకులే అనేక పర్యాయాలు ఖండించారు. కాని పాకిస్థానీయులందరు ఈవిషయాన్నీ నాడు నిస్సంకోచంగా విశ్వసిస్తున్నారు. పాకిస్థాన్ వ్యతిరేక, వినాశకర సంఘటన లనేకాలు భారతదేశం జరిపినట్లు వారు నిరూపిస్తున్నారు. ఆ సంఘటనలను ఇప్పుడు తిరిగి త్రవ్వకో నవుసరములేదు; అందువలన ఈ రెండుదేశాల సంబంధాలు, వాటి మంచిని కోరేవారు ఎంతబాగు పరుద్దామనుకున్నా, మరింత చెడిపోవచ్చును. కాని వాస్తవికవాదులైనవా రందరూ, ఈ ఆరోపణను నిజమని దృఢంగా విశ్వసించియే చేస్తున్నారని గమనించాలి. ఈ విశ్వాసమే పాకిస్థాన్‌కు, ఎట్టి కష్టములనైనను సహించుటకు తగిన ఆత్మబలమును—ఆ కష్టములలో కొన్ని దాని భౌగోళికస్వరూపమువంటి సంప్రాప్తించుననుకున్నా—లభింపజేయవచ్చును.

రాష్ట్రవిభేదా లొక పెద్ద ఆటంకము. చరిత్ర, భాష, ఆర్థికవ్యవస్థలలో పాతుకునిపోయి వున్న ఈ విభేదాలు పాకిస్థాన్ అభివృద్ధికి గొప్ప ఆటంకములు. కాని ఈ ఆటంకములు ఇండియన్ యూనియన్‌నుకూడా బాధించేటట్లే వున్నవి. పాకిస్థాన్ కేంద్రమంత్రులు కలసిమెలసి, సమర్థతతో పని చేస్తే, ఈ ఆటకం కొంతవరకు తొలగిపోతుంది.

కేంద్ర మంత్రివర్గం

ప్రస్తుతం వీరందరూ ఐక్యతతో, కలసిమెలసి పనిచేస్తున్నారు. వీరిలో కొందరు ప్రతిభావంతులు కూడా వున్నారు. రెండు అధినివేశముల మధ్య శాంతిని కాపాడగల్గినచో, తమకు ఉజ్వల భవిష్యత్తున్న దనే వీరు విశ్వసిస్తున్నట్లు వారితో సంభాషణలలో, నాకు అవగతమైంది. ఇప్పుడేమాత్రము జగడము పెట్టుకోకూడ దని వారు భావిస్తున్న మాట తథ్యం. ఈ నూతన అధినివేశం, అంతరంగికంగా సంభవించే బాలారిష్టాల నెదుర్కొనుటకు తగినంత అవకాశం లభించవలెనని వారు మనఃపూర్తిగా కోరుకుంటున్నారనటం, ఇండియాపట్ల వారికి తీవ్ర అనుమానా లున్నటం వలెనే వాస్తవము.

ఈ నూతన అధినివేశాన్ని జాగ్రత్తగా కాపాడటంలో ఇంతవరకు వారు సాధించినది అభినందనీయమే. పరిస్థితులు వారికి ఏ మాత్రం అనుకూలంగా లేవు. కరాచీలో కొన్నివారాలవరకు కేంద్రప్రభుత్వం పేరుకు తప్ప మరేమీ లేదు. ఉత్తరాన, మతకలహాల వలన, తద్వారా సంభవించిన జనాభామార్పిడి, ఆశ్చర్యకరంగా సంభవించిన ఇతర అత్యవసర సమస్యలవలన మంత్రులు ఒకరికొకరు ఎంతో దూరంగా ఎన్నోరోజులు వుండవలసివచ్చి, పని చాల కుంటుపడిపోయి యిబ్బంది కలిగింది.

గొప్ప వ్యక్తి

కేంద్ర మంత్రివర్గంపైన క్వాయిదే-అజాం-జిన్నా శిఖరంవలె అత్యున్నతంగా వున్నాడు. ఆయన ఒక గొప్ప వ్యక్తి! పశ్చిమరాష్ట్రాలలో మూడింటిలోను నేను జరిపిన సంభాషణలు, ప్రతిచోట—భాగ్యవంతుల ఇండ్లనుంచి, రోడ్డు కాలిబాటపై వున్న ఈగలు ముసిరిన కొట్లలో వరకు—కనపడుతున్న ఆయన చిత్రపటాలు ఈ విషయాన్ని రుజువుచేస్తున్నాయి. సైన్యప్రియులైన సరిహద్దుప్రజలు, ఆయన బక్కపలచని ఆకారం—కొన్నిచోట్ల ఆయనప్రక్కన ఆ బొద్దుమనిషి, పాకిస్థాన్ ప్రధానికూడా వున్నాడు—ఈ ప్రపంచంలో నాటకవేషధారులు తప్ప మరెవ్వరూ ధరించనంతటి సుందరమైన సైనికదుస్తులతో వున్నట్లు, రంగురంగులలో మనోజ్ఞంగా చిత్రించారు.

నేను ఆయనను కలుసుకుని వుండటంవలన చాలమంది నాతో ఆ విషయం ప్రధానంగా ప్రస్తావించారు. ఆయన ఆరోగ్యాన్ని గురించి పుకార్లున్నాయి; ఆయన రెపటవలె వున్నా గత వేసవిలోకన్నా చాల ఆరోగ్యంగా వున్నాడని నేను చెప్పగలను. గత వేసవిలో ఆయన చర్మం కాగితంవలె తెల్లగా, లోపల కండవుందా లేదా అన్నట్లుగా వుండేది. ఇప్పుడు కొంచెం నయంగా వుండటమేగాక, ఆయన అలసట కూడా చాలవరకు తగ్గినట్లుగానే వుంది. (పాకిస్థాన్ పాలకులలో మరొక ప్రముఖవ్యక్తి సర్ జార్జి కన్నింగ్‌హాంకూడా ఇదివరకువలె ఒక శిల్యావశిష్టమైన, సామ్రాజ్యానికిగాక ఒక నూతన అధినివేశానికి సేవ చేస్తున్నాడు కాబట్టి యేమో చాలఏండ్లు చిన్నవాడైనట్లుగా కనిపించాడు.)

రాష్ట్రాలు

'పాకిస్థాన్‌లోని రాష్ట్రమంత్రివర్గాలు, ఇండియన్ యూనియన్‌లోవాటివలెనే' విచారకరంగా భిన్నభిన్న సామర్థ్యాలుగలవిగావున్నవి. పశ్చిమ పంజాబ్ మంత్రివర్గాన్ని గురించి మంచి నాకేమీ వినపడలేదు; అసమర్థత, కుట్ర ఇవే దానినిగురించి వినిపించేమాటలు. ఆ మంత్రివర్గం సాధించినదానిలో చాల భాగం, కేంద్ర మంత్రులు, ఉద్యోగులు వచ్చి మకాంవేసివుండి సాధించినదే నట. అనుభవశాలి, చాకచక్యముగలవాడు అయిన గవర్నర్ ఎక్కువ కృషి చేస్తున్నాడట. బహుశః ఆ మంత్రివర్గం ఇంకా విస్తృతం చేయబడవలెనేమో! కొన్ని వారాల క్రిందటివరకు కాందిశీకుల శాఖకు మంత్రియే లేడు.

సరిహద్దు మంత్రివర్గం కూడా అంతే; అందులో ఇద్దరు నిర్విరామంగా కృషి చేసే వారూ ఒకరు ఒకమాదిరైనవారూ వున్నారు. ఆ ప్రధానిని, కాంగ్రెస్‌వాలాగాను, లీగర్‌గానూ కూడానే నెరుగుదును. పాకిస్థాన్ సరిహద్దు ఇవతల ఇప్పుడతనిని బాగాదూషిస్తున్నారు—కాశ్మీర్‌ను గురించి అతని తీవ్రధోరణివలన గావచ్చు—కాని అతను అన్నివిధాలా ఇప్పుడు కొంతవరకు అధిక్యాన్ని పొందాడనే నేననుకుంటున్నాను. ఎదిరి పక్షంలో నుండి తప్పుకొని కొందరు అతనిలో జేరటం వలన అతని రాజకీయ స్థాయి కూడ ఇప్పుడు వృద్ధి అవుతున్నది. కాని అతని రాష్ట్ర వ్యవహారములు జిత్తులమారివి.

తూర్పు బెంగాల్—పశ్చిమ పంజాబ్ వలె, విభజన సమస్యల నెదుర్కొంటున్నది, ఇతర విషయములలో సంశయాత్మకము కూడాను—భాషా విభేదాలు, రాజకీయ విభేదాలు వున్నప్పటికీ, చాల బాగా పనిచేస్తున్నట్లు తెలుస్తున్నది. సింధు వ్యవహారాలు కూడా ఇదివరకటి అరాచకాన్ని విస్మరిస్తే—బాగానే వున్నట్లున్నవి.

సహనము

షరియత్ నిరంకుశత్వము, ముల్లారాజ్యము, మతనిర్బంధము, పాన్—ఇస్లాం సంకుచితదృష్టి, మూర్ఖత్వము...నేను పాకిస్థాన్ వెళ్ళకముందు, అక్కడ యివి పెరిగిపోతున్నట్లు, పాకిస్థాన్ వీటివైపుకు మొగ్గిపోతున్నట్లు ఎక్కువగా వింటుండేవాడిని. అక్కడినుంచి వచ్చినాక ఇంకా ఎక్కువ విన్నాను. జిన్నాగారి ఉపన్యాస మొకటి ఇదివరకు ప్రకటించిన మతవిభేద రహితరాజ్యమను సూత్రమును, విస్మరించినట్లే, భావించుటకు అవకాశ మిచ్చినది. ఇంకా ఇతర ఆధారములుకూడ వున్నవి. కొంత మార్పు వచ్చిన మాట నిజమేనని నేననుకుంటున్నాను. అది ఎంత ముఖ్యమైనదో, ఎంతకాలము నిలుస్తుందో నేను చెప్పజాలను. కాని దానివలన, అక్కడ మిగిలివున్న అల్పసంఖ్యాకులు, కిరస్తానీవారు సహా, చాల ఎక్కువ ఆందోళన జెందుతున్న మాట నిజము.

పాకిస్థాన్‌లాంటి క్రొత్త రాజ్యములో, ఆదిలో ఇస్లాం మతపిచ్చి కొంతవరకు పెరిగిపోవటం సహజమే; దానినిగురించి ఆందోళన జెందనక్కరలేదు. విభజనతరువాత జరిగిన దురదృష్టకర సంఘటనలు దానిని మరింత వృద్ధిపరచినవి; అల్పసంఖ్యాకులందరు వెళ్ళిపోవటం వలన మిగిలివున్న కొద్దిమంది అల్పసంఖ్యాకులు మరింత బలహీనులు, భయగ్రస్తులునైపోయిరి. షరియత్‌లోవున్నది చాలవరకు ఆధునిక సామాజిక పద్ధతికి అనుగుణము చేయవచ్చును. కొన్నిమాత్రం మార్పుటకు వీలులేనివి—దొంగతనానికి కుడిచేయి కొట్టివేయుటం మొదలైనవి—ఈవిషయం మూడు రాజధానులలోను తీవ్రంగా ఆలోచింపబడుతున్నట్లు నాకు తెలిసింది. ఈవిషయంలో శాస్త్రాలలోని (కొరాన్) వచనాలు ఇంకోరకం అర్థం చెప్పటానికి తగినట్లుగానే వున్నాయి.

ఇప్పటి పాకిస్థాన్ నాయకులు, తామే చాలవరకు పాశ్చాత్య భావాలు గలవారు, పాశ్చాత్య భావాలు గలవారే ఎక్కువమంది వీరి అనుయాయులు. ఇట్టివారు ఆ విధానాలను వదలుకుని, ఆధునిక జీవితానికి ఎబ్బెరికంగా వుండే పూర్వకాలపు మూర్ఖపు టాచారాలను ప్రవేశపెడతారని నేననుకోను. బహుశః కొంతకాలంవరకు వారు, మతపిచ్చిగాళ్ళతో సామరస్యంతో వుండటానికి ప్రయత్నిస్తున్నారేమో!

ఆఫ్ఘన్ సమస్య

ఈ సమస్య ప్రభావం, ఇంతవరకు సందిగ్ధంగానే వున్న పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సంబంధాలపై కొంతవరకైనా పసరింపకపోదు. నూతనంగా తన పొరుగున ఏర్పడ్డ రాజ్యంపట్ల ఆఫ్ఘనిస్థాన్ ద్వేష భావంతోను, స్వలాభాపేక్షా భావంతోను వుండటం చాలమందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. పాకిస్థాన్‌లో, ముఖ్యంగా పెషావర్‌లో దీనిని గురించి చాలమంది విచార పడుతున్నా, చాలమందికి ఇదొక తమాషాగానే వుంది. ఆఫ్ఘన్ ప్రభుత్వం దుర్బలమనీ, స్థయిర్య రహితమనీ ఇంతవరకూ భావిస్తున్నారు. 1929 వ సం. లో నాదిర్‌షా రాజ్యానికి, వజీర్‌స్థాన్ కొండజాతి సహాయంతోనే రాగలిగినా డన్న సంగతికూడా జ్ఞాపకం వుంచుకోవాలి. ప్రజాస్వామ్య సంస్థలతోను, చక్కని రాకపోకల సౌకర్యములతోను, సైన్యబలం తోను అభివృద్ధి సూచకంగా వున్న పాకిస్థాన్ వెనుకబడివుండి, నిరంకుశ పరిపాలన క్రిందవున్న ఆఫ్ఘనిస్థాన్‌కు కొంత భూభాగము యివ్వవలె ననటం అసంభావ్యం...అయితే పాకిస్థాన్ ఇస్లాం మతపిచ్చిలోపడి, ఆధునిక పద్ధతులను విస్మరిస్తే, ఈ వాదనలో బలం కొంతవరకు తగ్గిపోతుంది.

పాకిస్థాన్‌లోని బ్రిటిషువారు

పాకిస్థాన్‌లో వున్న బ్రిటిషువారు ఈనాడు అత్యుత్సాహంతో వున్న పాకిస్థానీలుగావున్నారు వారు సంపూర్ణంగా పాకిస్థాన్‌తో మిళితమైపోతున్నారు. రెండు అధినివేశములలోను వున్న బ్రిటిష్‌వారి మధ్య ఈ అభిప్రాయభేదాలు ఎంత తీవ్రంగా వున్నవో అంత ఆశ్చర్యకరంగా కూడా వున్నవి. పాకిస్థానీ బ్రిటిష్ వారు ఇండియా యూనియన్ చేస్తున్న అకృత్యములను, పాకిస్థాన్ వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. "మామంత్రులవిధానమే సరియైనది...కచీరాలో జనవరిలో జరిగిన కల్లోలంలోనుంచి మేము చాల త్వరలో తేరుకోగలిగాము......మాసైన్యంలో చక్కని ఉత్సాహం వున్నది" అంటూ వారు ఉపయోగిస్తున్న 'మా' ధోరణి తమాషాగా వుంది. అవిభక్తభారత ఆఖరు రాజప్రతినిధి, భారతయూనియన్ ప్రస్తుత గవర్నర్ జనరల్‌ను గురించి వారు ఉపయోగించే భాష—ఆయనను ఈదేశంలో బాగా గౌరవిస్తూనేవున్నారు—ఇతర పాకిస్థానీ లుపయోగించే భాషకు ఏమాత్రము తీసిపోదు.

ఇండియా యూనియన్‌నుంచి వచ్చిన అతిథిగా, ఇదివరకు నన్నెరుగని బ్రిటిష్‌వారికి నేను ఎరుకపరచబడినప్పుడు కొందరు మితభాషిత్వంతోను. అనాదరణతోను నన్ను చూచారు. కొందరు నన్ను చూచి జాలిపడ్డారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలన్నీ వారు చాల ఎక్కువ విమర్శనాదృష్టితో పరిశీలిస్తున్నారు. ఇక్కడ జరిగిన వ్యవహారాలు కొన్ని, అవి నాకు ఇష్టం లేకపోయినప్పటికీ, వాటిని సమర్థిస్తూ, నేను మాట్లాడవలసివచ్చినది—వాటిమీద విమర్శలు అంత తీవ్రతరంగాను, అసంబద్ధంగాను వున్నవి. 1946 ఆగస్టు తరువాత, ముస్లిమేతరులవలె ముస్లిములుకూడా కల్లోలాలలో పాల్గొన్నారనే విషయమే వా రంగీకరించటం లేదు. ఈ దేశంలో అతిచిన్నదైనప్పటికీ, ముఖ్యమైనదైన సిక్కులు, కల్లోలాలతర్వాత ఇట్టి బాధలు పడటంపట్లనా సానుభూతి ప్రదర్శించినందుకు అందరూ కేవలం అనంగీకారం సూచించటమేగాక, కొంతవరకు కోపం తెచ్చుకున్నారు కూడాను.

మనం ఇంకొకరికి అగత్యమై వుండటం సంతోషకరం. చిన్నది, దుర్బలమైనది అయిన పాకిస్థాన్ అక్కడవున్న బ్రిటిష్‌వారు (వా రిదివరకటినుంచి వున్నారనే భావంవల్లనైతేనేమి, వారు తనకు మిక్కిలి సహాయకారులుగా వుందురని భావంవల్లనైతేనేమి) ఉండవలె నని కోరుతున్నది. ఇందుకు ఆ బ్రిటిష్‌వారు హృదయపూర్వకంగా తమ అంగీకారం తెలియజేసి తమ చేతనైనంత సహాయం చేస్తున్నారు. ఆ అధినివేశంపట్ల వారు గౌరవంతో వ్యవహరిస్తూ, పాకిస్థానీ దేశభక్తితో వ్యవహరిస్తున్నారు. ఇండియా యూనియన్‌లో బ్రిటిష్ వారు, ఈనాడు తమ నిక్కడ సహించుటమేగాక, ఆదరిస్తున్నారని గ్రహించారు. ఈ దేశాన్ని వారు గౌరవిస్తున్నారు. స్వాతంత్ర్యదినోత్సవంనాడు జరిగిన మార్పు ఈ విధంగా శుభపరిణామం పొందింది. కాని ఇక్కడ బ్రిటిష్‌వారి అవుసరం తక్కువ; అదీగాక అప్పుడప్పుడు, పూర్వపు వైరుధ్యాలు, తప్పుగానే కావచ్చు, జ్ఞాపకం, వచ్చి తమకు అన్యాయం జరుగుతోందని, అది వారి తప్పుకావచ్చు, ఎదుటివారి తప్పుకావచ్చు, వారు భావిస్తున్నారు.

గృహపరిశ్రమలు :

సబ్బులు తయారుచేయు విధానం

శ్రీ బ్రహ్మాండం ఆంజనేయులు

మనదేహము, దుస్తులు, ఇండ్లు గ్రామపరిసరములను శుచిగా యుంచుకొని జాతియొక్క ఆరోగ్యమును పెంపొందించుట నాగరికతా లక్షణములలో నొకటి. పరిసరములు, దేహము యొక్క నైర్మల్యమునుబట్టి మానసిక నైర్మల్య మేర్పడును మన ఋషులు యీ విషయము చాల ముఖ్యమని గుర్తించిరి. శారీరక అంతశ్శుచిని చక్కని ఆహార, వ్యవహార నియమముల ననుసరించి పొందవచ్చును. శారీరక బాహ్య శుచిని స్నానాదులవలన పొందగలుగుదుము.

మనము ధరించు దుస్తులను, నివసించు యిండ్ల పరిసరములను నిరంతరముగ, అనుదినము శుభ్రపరచుకొనుచుండవలయును. పూర్వులు తమ దేహశౌచము కొరకు స్నానము చేయునపుడు శున్నిపిండి, కుంకుడు, సీకాయ, చిట్టింటయాకు పొట్టు, మొదలగు శౌచమూలికలను (శానిటరీ హెర్బ్స్) వుపయోగించుచుండెడివారు. బట్టలను వుతికి శుభ్రపరచుటకు, చాకలి చౌడుమట్టిని (మేధకక్షార(మృత్తిక) వుపయోగించుచుండెడివాడు. అందువలననే యీ చౌడుమట్టికి "చాకలి చౌడు" అని గూడ వ్యవహారనామము కలదు. గోమయ, గోమూత్రములను, శుద్ధినిమిత్తము వాడుట మన సాంప్రదాయ సిద్ధము. ఇండ్ల నేలలు, వంటగదులు, వంటపొయ్యి, మొదలగు అతి శుచిగా వుంచవలసిన భాగములను, మన పెద్దలు ప్రతిదినము గోమయముతో అలికి శుద్ధి చేయు నాచారముకలదు. గోమూత్రమునుకూడ వీరు క్రిమికీటకసంహారణములో (ఇన్సెక్టిసైడు) వుపయోగించుకొనిరి. గోమయ, గోమూత్రములలో క్రిమిసంహారక గుణము కలదని శాస్త్రము. ఈవిధముగా గోమయముతో అలికి మన వంటగదులను ఆసుపత్రులలోని శస్త్రచికిత్సచేయు గదుల (ఆపరేషన్ థియేటర్) వలె అతి శుచిగా నుంచుకొనిరి. శస్త్రచికిత్స చేయబోవు వైద్యుడు తన చేతులనెంతగా శుభ్రపరచుకొని శస్త్రచికిత్సకు దిగునో అంతటి యాచార శౌచములతో మనవారు ప్రతిదినము వంటగదిలోనికి ప్రవేశించుచుందురు. వంట చేయునపుడు వంటకములను చేతితో ముట్టెడువారు కారు. వంటచేయువారు తమ చేతులను వీలువెంట పలుమారులు కడిగి శుభ్రపరచుకొనుచుండెడి యాచారముకూడ కలదు. ఇంతియేగాక మనము ప్రతిదినము భుజించు ఆహారము పరిశుభ్రమై కల్మషరహితముగా నుంచుటకొరకే ఉద్దేశింపబడెను. అధునాతన యుగలక్షణముగ పరిణమించిన భోజనశాలలు (హోటళ్లు, వగైరా) యీ వుద్దేశ్యమును భంగపరచినవి. మనలో కొందరు ఆహితాగ్నులు, తాము భుజించు ఆహారమును తామే పక్వముచేసికొని, భుజించు ఆచారము యిప్పటికినీ అరుదుగా కలదు. వీరినే "స్వహస్తపరు"లని పిలుచుచుందురు. దీనిని వీరు శౌచనీయముగా పరిగణించుచుండిరి.

శౌచరసాయనములు-శౌచక్రియలు

చాకలి, బట్టలు బాగుచేయుటకు చౌడుమట్టి నీటిని వాడుచున్నాడు. ఈ నీటిలో సహజముగా నుండు సబ్బు నురుపు స్వభావము (స్లైమీ ఫీలింగ్) వలననే బట్టలలో గూడుకట్టిన మురికి జిడ్డు కదలబారి బహిర్గతమగుచున్నది. మురికి వస్త్రములను యీ విధముగు క్షారమృత్తికా ద్రవములలో నానబెట్టి వుతికినపుడు యీ క్షారద్రవము దారములసందులలోనికి చొచ్చుకపోయి అచటనిలచి గూడుకట్టి యున్న మురికిని కదల్చి బయటికి వెడలగొట్టుచున్నది. దాహక సోడావంటి కొరుకుడు క్షారములను (కాస్టిక్ సోడా) చమురులతో (ఫాట్స్) కలిపి వంట చేయుటవలన సబ్బు తయారగుచున్నది. బట్టలవుతుకులో వీనిని విరివిగా వాడుచుండిరి.

మురికి-నిర్మాణము

మన శరీరమునుండి నిరంతరము చెమట, జిడ్డు, కొన్నివాయువులు, చర్మము పైకి వచ్చుచుండును. చర్మముయొక్క వైహార చచ్చి కుబుసముగా నిరంతరము మారుచుండును. లోపల నుండి బహిర్గతమైన పదార్థములు, గాలిలోని ధూళి, యీకుబుసము మొదలగు యితరపదార్థములు కలిసి మురికిగా నేర్పడుచున్నది. ఇది చర్మముపైన పేరుకొనుట, ధరించిన వస్త్రములలోనికి చేరుచుండుట తటస్థించుచుండును. మురికి, దుమ్మమాత్రమే వినచో దులిపి శుభ్రము చేయవచ్చును. జిడ్డుపేరినపుడు వంటిని, వస్త్రములను, సబ్బువాడుటవలన శుభ్రపరచవచ్చును. వంటికివాడ తగిన సబ్బు వేరుగను, (స్నానాల సబ్బు) బట్టలకువాడు సబ్బు వేరుగను (బట్టల సబ్బు) వుండును. సబ్బులను వీలైనంత స్వల్పముగా నీటితో కలిపి వాడుదురు.

సబ్బునీరు-మురికిని వదల్చుట

సబ్బుయొక్క మిశ్రమాణువులలో అమ్లజని, ఉదజని, కర్బనము అణువులు ఒకదాని వెనుక వకటి వరుసలో తోకపురుగు ఆకారమున చేరి యున్నవి. ఈ తోకపురుగు యాకారములోని తల భాగమున అమ్లజని అణువు; తోకభాగమున ఉదజని, కర్బనము అణువులు అమరివున్నవి. విద్యుత్ ప్రకోపితములగు అమ్లజనిఅణువులను నీరు ఆకర్షించుచుండును. విద్యుత్ రహితములగు ఉదజని, కర్బనము అణువులుమురికిలోని జిడ్డుపదార్థమును ఆకర్షించును. అనగా యీసబ్బుతోక, మురికివైపుకు తిరిగి మురికిలోని జిడ్డును పట్టుకొనును. సబ్బుతల ఉపరిభాగమునను న్న నీటి ని పట్టుకొని వున్నది. ఈవిధముగా పైనున్న నీరు సబ్బు మిశ్రమాణువుయొక్క తలను, తలలోని అమ్లజని అణువు సబ్బుతోకను, తోకలోని ఉదజని, కర్బనము అణువులు మురికిలోని జిడ్డును, ఒకదానినొకటి పట్టుకొని లోతుగా పాతుకొని యున్న మురికిజిడ్డును పెల్లగించి బహిష్కరించును. ఈవిధానమునే శాస్త్రరీత్యా "ద్రవముల ఊర్ధ్వతలపీడన" (సర్ఫేస్ టెన్షన్ ఆఫ్ లిక్విడ్స్) అనికూడ వ్యవహరింతురు.

మనము మురికిచేతులను సబ్బునీటితో కడుగుకొనునపుడు సబ్బు మిశ్రమాణువుయొక్క తలగా నమరియున్న అమ్లజని అణువును, ఊర్ధ్వభాగమున నున్న నీరు పైకి చేదుకొనుచుండును. సబ్బులోని అమ్లజనిఅణువు తన ఉదజని, క్యారన అణువుతోకలద్వారా చర్మరంధ్రములలో నిల్వవున్న మురికిజిడ్డును ఆకర్షించి సబ్బునీటి పై భాగమునకు చేర్చుచున్నది. ఈ విధముగా మన మురికిచేతులు సబ్బునీటితో కడిగినపుడు శుభ్రపడుచున్నవి.

మనము తలంటుకు ఉపయోగించెడు కుంకుడుకాయనీటిలోగూడ సబ్బు నురుపు స్వభావముండుట చేతనే యీనీరు నూనెలతోకూడిన తలలోని మురికిని వదల్చగల్గుచున్నది. ఈ కుంకుడుకాయ నీటికి చిట్టింటపొట్టుకూడా కొంతచేర్చి వాడినచో యీనీటి చిక్కదనము, జిగురు, అభివృద్ధి చెందును. ఈద్రవముయొక్క ఊర్ధ్వతల పీడన పెరుగుటచేత తలలోని మురికి సులభముగా కదులును. కాని యీకుంకుడు, సీకాయ మొదలగు వృక్షసంబంధమగు శౌచమూలికలు దేశమున బహు అరుదుగా లభించుచున్నవి. ఇంతియేగాక బట్టలమురికిని తీసివేయుటకు కుంకుడు మొదలగువృక్షమూలికలను వుపయోగించెడి అలవాటులేదు. బట్టలుతుకుటకు చవుడునున్నం, బట్టలచవుడు మొదలగు ఖనిజసంబంధమైన శౌచరసాయనములనే వుపయోగించుట సులభము.

సబ్బులు - తిండినూనెలు - దుబారా!

మనదేశపు సముద్రపట్టులలో యీచౌడుమట్టి విరివిగా లభించుచున్నది. దాహక క్షారముల తయారీకి అవసరమగు గుల్లగూడ (గుల్లసున్నము) సముద్రపట్టెలతో దొరకును. బట్టలసోడావంటి మేధకక్షారములు దేశ వివిధప్రాంతములలో ప్రకృతి సిద్ధముగా లభించుచున్నవి. బహు అరుదుగా లభించు కుంకుడు, సున్నిపిండి, సీకాయ మొదలగు శౌచమూలికలవాడుకకన్న దేశమున విరివిగా లభించుచూ, వృధాయగుచున్న క్షారమృత్తికల నుపయోగించుకొనుట మంచిదిగాదా? మనము వంటిమీద వాడుచున్న పెసరపిండి ఆహారపదార్థమైయున్నది. ఈ ఆహారకరువు రోజులలో పెసరపిండిని శౌచముకొరకు వాడుట ధర్మముకాదు. కనుకనే శౌచక్రియలలో సబ్బులవాడుక అవసరమగుచున్నది. కాని తినుటకు ఉపయోగించునూనెలనుకూడ సబ్బుల తయారీలో చాలవరకు తగ్గించవలసియున్నది. వేప, గానుగ, ప్రత్తివిత్తులు, పొగవిత్తుల నూనెలు, చేపనూనె, విప్పనూనె, ఆముదము, రోజిన్, కొవ్వు మొదలగు ఆహారేతరనూనెలనే హెచ్చుగా సబ్బుతయారీలో వాడనగును. కొబ్బరినూనె, వేరుశనగ, నువ్వులనూనెలు మొదలగు తిండినూనెలను యీ సబ్బులలో వాడుట దేశసంపద దుబారాక్రింద పరిణమించును.

ముడిసరుకుల యిరువులు

సబ్బు ముడిసరుకులలో యీదిగువనున్నవి ముఖ్యముగా పేర్కొనతగినవి:—

(1) నూనెలు (2) క్షారములు (3) వాసనలు (4) రంగులు.

నూనెలు:—మనదేశమున సబ్బు తయారీకి అవసరమగు ముడిసరుకుల యిరువులు విరివిగానున్నవి. సబ్బునిచ్చునూనెలు సబ్బుతయారీలోని ముడిపదార్థములలో హెచ్చుభాగమైయున్నవి. సబ్బు తయారుదారిని ముడిపదార్థముల మొత్తపు ఖరీదులో యీ నూనెల ఖరీదు యించుమించుగా నూటికి తొంబదిపాళ్లువరకువుండును. పొగవిత్తుల నూనెగుంటూరు జిల్లాలోను, విప్పనూనె భద్రాచలకోయ అడవిలోను విరివిగా లభించును. వేపనూనెను దేశమంతటను వేపగింజలనుండి తీయుచున్నారు. వేరుశెనగనూనెకూడ దేశమున విరివిగా కలదు. ఆముదము కృష్ణా, గోదావరిలంకలలో విరివిగా పెరగును. హిమాలయప్రాంతపు "పైన్"అడవుల నుండి లభించు జిగుళ్లను బట్టి బట్టి రోజిన్ పొందగలుగుచున్నారు. ప్రత్తివిత్తుల నూనెకూడ పల్నాడు, రాయలసీమజిల్లాలలో పుష్కలముగా లభించును. ఇంతియేగాక పలురకముల సబ్బు నిచ్చు తదితరనూనెలుకూడ దేశమున విరివిగా లభించుచున్నవి.

2. క్షారములు:— సముద్రతీరమున కొన్ని ప్రాంతములలో చవుడుమట్టి విరివిగా లభించును. సముద్రతీరముననే లభించు గుల్లసున్నముతో యీ చౌడుమట్టిద్రవమును వుడకబెట్టుటవలన సబ్బుతయారీకి అవసరమగు దాహకసోడాను పొందవచ్చును. సముద్రపుగడ్డిని, అరటిసారగును, పొగఈనెలను కాల్చి తెల్ల బూడిద చేయుటవలన స్వచ్ఛమగు బట్టలసోడాను పొందవచ్చును.

3. వాసనలు :— చందనతైలము మైసూరు చందనపు అడవులనుండి విరివిగా లభించు చందనపు కొయ్యలను బట్టీ పెట్టగా లభించుచున్నవి. నిమ్మనూనె, నారింజనూనె, మల్లె, లవంగ, జపాకుసుమ్ మొదలగు అత్తరులను తయారుచేయు సంస్థలు హెచ్చుగా ఉత్తరదేశమున గలవు.


4. రంగులు:— అవసరమునకు కావలసిన సబ్బురంగులుకూడ దేశమున లభించుచున్నవి.

నింపుడుదార్లు (ఫిల్లర్స్):— సబ్బులలో నింపుడుదార్లను వాడుట వ్యాపారలక్షణము. వ్యాపారములో సబ్బును చౌకధరలకు గిట్టింపు చేసుకొనుటకు యీ నింపుడుదార్లను వాడుచుందురు. స్వచ్ఛమైన బట్టలసోడాను, యిసుకను కలిపి వంటచేయుటవలన సోడా సిలికేటు అనునది (నీటిగాజు) లభించును. దీనిని సబ్బులలో నింపుడుదారుగా వాడుచుందురు. రాయలసీమజిల్లాలలో లభించెడి సబ్బురాతిపొడి (టాల్క్)నికూడా సబ్బులలో నింపుడుదారుగా వాడుచుందురు.

చౌడుసున్నము - బట్టబలము.

చాకలి బట్టలను శుభ్రపరచుటకు చౌడుసున్నమును వాడు ఆచారము కలదు. చౌడునీటిలో సున్నముచేర్చుట వలన యీనీటికి కొరుకుడుస్వభావము కలుగుచున్నది. ఈ కొరుకుడు వలన వస్త్రము దెబ్బతిని ఆయుర్దాయము క్షీణగును. ఆదిన వీరు బట్టలు ఉతుకుటకు ఒక్క చౌడు మాత్రమే వాడుచుండెడివారు. చౌడువాడకమువలన వస్త్రముల బలము అంతత్వరలో క్షీణించెడిది కాదు. బట్టలు చక్కగా 'నీరుకావి బట్టి హెచ్చు కాలము మన్నెడివి. ఈస్థితిలో గుడ్డలుమిల్లులు దేశమున వుద్భవించినవి. ఈ మిల్లులు సన్నని వస్త్రములను నేసి వానిని చలువసున్నము (బ్లీచింగ్ పౌడరు) వగైరాలతో తెలుపుచేసి, పెట్టెపట్టి నునుపుచేసి, బజారులలో అమ్మకమునకు పెట్టిరి. చాకలి దానిని చూచి, చౌడు సున్నముతో చలవ సున్నమును కూడ వాడమొదలిడెను. బట్టలను చలువచేసి పెట్టెపట్టి, తెల్లని నునుపైన యిస్త్రీమడతలను ప్రజలకు అందించుచూ వచ్చెను. ప్రజలు యీ తెలుపుతనమునకు, నునుపు తనమునకు భ్రమసి

(22 వ పేజీ చూడుడు)



గ్రంథ పరిచయము

వయోజనవిద్యా-బోధనక్రమము

గ్రంథకర్త—శ్రీయుత గాడిచెర్ల హరి సర్వోత్తమరావుగారు. స్వయంగా వయోజన విద్యావ్యాప్తికోసం చేసిన కృషిలో కలిగిన అనుభవాలను, ఫలితాలను, ఇంకా తమకు తట్టిన యోజనలను, ఆధారంగా చేసుకుని గ్రంథకర్త యీ పుస్తకరచనకు పూనుకున్నారు. ఈమధ్య దక్షిణదేశంలో అములులోకివచ్చిన కొన్ని నూతన మార్గాలను గూడా వీరు తేటతెల్లంగా వివరించారు. వయోజనులకు, ఏండ్లు బాగా మీరినవారికి సాధారణంగా చదువుమీద అభిలాష, చురుకుదనం, జ్ఞాపకశక్తి క్రమంగ తగ్గిపోతాయి. అటువంటివారికి సులభంగా అతిశీఘ్రంగా, అక్షరాలను నేర్పడం ఎల్లాగో, చదువుపై అభిరుచి కలిగించడం, ఆ అభిరుచి వృద్ధిపొందించడం ఎల్లాగో వీరు చక్కగా చూపించారు.

"ఒక్కనికి ఒక్కడు నేర్పుట" అనే పద్ధతి వీరికి బాగా నచ్చినట్లు తోస్తుంది. అంటే చదువు బాగా నేర్చిన ప్రతివాడు ఒక్క కాలములో ఒక్కడికే నేర్పడం. ఇల్లా నేర్చుకున్న ప్రతి ఒక్కడూ తిరిగి మరొక్కనికి చదువు నేర్పడం. ఈ విధంగా వయోజన విద్యావ్యాప్తిలో ఉత్సాహమున్న వారు ఐచ్ఛిక సేవా దళాలుగా ఏర్పడి బోధనా కార్యక్రమం నిర్వహిస్తే, త్వరగా, సులభంగా, గాఢంగా విద్య వ్యాపిస్తుందని వీరు యీ గ్రంథంలో నిరూపించారు. కాని ఆర్థిక దుస్థితి భారంతో, క్రుంగిపోయి, దినమంతా పొట్టపోషణార్థం పాటుబడే మన విద్యార్థులు ఐచ్ఛికంగా ఎంతవరకూ యీ కార్యక్రమంనిర్వహించ గలుగుతారో? పరిశీలించి, ఆచరించి చూడాలి.

ఇది అనుభవాలమీద ఎక్కువగా ఆధారపడిన గ్రంథం. గనుక తప్పక వయోజన విద్యా బోధకుల కందరికి బోధనకు వాస్తవికపద్ధతుల్ని సూచించి వారి పనిని తేలిక చేస్తుంది అనడానికి సందేహం లేదు.

సభలు-సమావేశాలు

గ్రంథకర్త: శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమ రావుగారు. నేటికాలంలో ప్రజాజీవితంలో సభలూ సమావేశాలూ ఒక ప్రముఖస్థానాన్ని ఆక్రమిస్తున్నవి. ముఖ్యంగా యివి ప్రచారానికుపయోగించబడుతున్నాయి. గ్రంథాలవల్ల కలిగే ప్రచారం, ప్రబోధంకంటే సభలు సమావేశాలు ఇమ్మడిగా ప్రచారం ప్రబోధం కలిగిస్తున్నా యనడానికి సందేహం లేదు. మన దేశంలో పూర్వకాలంలో ఏరూపంతో, ఏ ప్రణాళికల ననుసరించి, యివి జరుపబడేవో తెలియజేసే వివరాలన్నీ మనకు మన పూర్వ గ్రంథాలద్వారా లభించడం లేదు. ఇప్పుడు జరిగేవన్నీ విదేశాలనుంచి దిగుమతి అయినవే. విదేశాలలో జరిగే సభల కార్యక్రమ పద్ధతులనూ, ప్రణాళికలనూ అనుసరించియే మనము నేడు సమావేశాలు జరుపుకొంటున్నాము.

గ్రంథకర్త జగమెరిగిన బ్రాహ్మణులు. వీరు ఈ చిన్నపుస్తకంలో సభలకు, సమావేశాలకు సంబంధించిన సూత్రాలను, సిద్ధాంతాలను సూక్ష్మదృష్టితో పరిశీలిస్తూ, చక్కని వ్యావహారిక శైలిలో వీటి నన్వయపరిచారు. ఏ సక్రమ పరిస్థితుల ననుసరిస్తే సభలు జయప్రదంగా ముగింపబడతాయో, వాని అత్యధిక ఉపయోగం మనం పొందగలుగుతామో వీరు యీ పుస్తకంలో వివరించారు. అధ్యక్షు డెట్టివాడై వుండాలి, కార్యదర్శి కర్తవ్యమేమిటి, సభకు హాజరైనవారు, వక్తలు, ప్రారంభకులు, ప్రతిపాదకులు, సవరణకర్తలు మున్నగువారంతా ఏ నియమాలకూ, విధులకూ లోబడి ప్రవర్తించాలి, వారల్లా ప్రవర్తించకపోతే అధ్యక్షుడు ఏవిధంగా పరిస్థితి నదుపులోకి తీసుకు రావాలి—అన్న విషయాలన్నీ, వీరు చర్చించారు. ఈ పుస్తకం కళాశాలలలో, హైస్కూళ్ళలో సభలు జరుపుకొనే విద్యార్థులనుండి పెద్ద పెద్ద సంస్థలలో ప్రత్యేక సమావేశాలు జరిపే వారివరకూ అందరకూ నిస్సంకోచంగా ఉపకరిస్తుంది.

గ్రంథాలయములు-రిజిస్ట్రేషను

గ్రంథకర్త—పాతూరి నాగభూషణంగారు. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు గారి షష్టిపూర్తి మహోత్సవానికిగాను సంకల్పింపబడి ప్రకటింపబడిన పుస్తకాలలో యిది మొట్టమొదటిది. ఇది 30 పేజీల చిన్న పుస్తకం.

గ్రంథాలయములను స్థాపింపదలచు కొన్నవారు వాటిని రిజిస్టరు చేయించుకోవటం ముఖ్యావసరం. లేకపోతే తరువాత అనేక చిక్కులు లావాదేవీలు సంభవిస్తాయి. అయితే ప్రారంభకులకు రిజిస్ట్రేషను గొడవలు చక్కగా తెలిసివుండవు కాబట్టి వాటిని గూర్చిన వివరాలను ఈ పుస్తకం ద్వారా అనుభవజ్ఞులైన గ్రంథకర్తలు తెలియజేశారు. దీనిలో వీరు నాలుగు అనుబంధాలను గూడా చేర్చారు. వీనిలో కార్యస్థాన నిరూపణ పత్రము, రిజిస్ట్రేషను ధృవపత్రము, గ్రంథాలయ నిబంధనలు మున్నగువాని మాదిరి నమోనా ప్రతాలను వ్రాసి చూపించారు. గ్రంథాలయ ప్రారంభకులకు ఇది బాగా సహాయపడుతుంది.

బాపూజీ (పద్యకావ్యము)

రచయిత—ఉభయ భాషాప్రవీణ, శ్రీ త్తి సత్యనారాయణ చౌదరిగారు.

ఈ ఖండకావ్యం నిన్నమొన్న జీవయాత్రను ముగించి దివంగతులైన గాంధీమహాత్ముని దివ్యసంస్మృతికొఱకు వ్రాసిన పద్యసంపుటి. దీనిలో 168 వృత్తము లున్నవి. పద్యాలు చదువుతుంటే, కవిపొందిన దుఃఖావేశం, భావావేగం స్ఫుటంగా కన్పిస్తునే వున్నాయి. ఆ ఆవేశం ప్రకటింపబడిన రీతి ఛందోబద్ధమైవున్నమాట నిజమేగాని, మహోత్తమ భావశిఖరాల కెగరలేదు. కవిత్వానికి మూలములైన ప్రతిభావ్యుత్పత్తులు రెండూ ఒకేమాదిరి సామాన్య ధోరణిలో ఉన్నాయి. పద్యపునడకలోగాని, భావాల పొంగులోగాని కవితాసౌందర్యం తక్కువ.

ఇల్లా అనిపించటానికి కారణం, బహుశః గాంధీజీ మరణానికి మనం పొందిన దుఃఖం, అనుభూతి, ఏ భావాలకూ మాటలకూ కూడ అందక అతీతమైవుండటం కావచ్చు. బహుశః ఎన్నివేల కావ్యా లుద్భవిల్లినా యీ మహోదాత్త దుఃఖాన్ని సరిగా ప్రకటించలేకపోవచ్చు. ఒకటి మాత్రం ఒప్పుకోక తప్పదు. కావ్యసౌందర్యము నటుంచి, ఈ కవియొక్క శోకానుభూతి, దానిని వెల్లడించవలెననే ప్రయత్నం మాత్రము పద్యములలో వ్యక్తమౌతున్నది.

బాపూజీ

కవి: గురుజాడ రాఘవశర్మగారు. ఇదికూడా బాపూజీ మరణదుఃఖాన్ని పురస్కరించుకొని ప్రచురించిన కావ్యమే. అయితే చివరిభాగంలో తప్ప తక్కిన పద్యాలన్నీ కవి యిదివరకే యొప్పుడో వ్రాసినవి. సత్యస్మృతి అనే పద్యాలు మాత్రం మహాత్ముని నిర్యాణానంతరం వ్రాసినవి. వీరి పద్యాలలో స్వాభావికత, సరళత కనిపిస్తుంది. సీసపద్యాలలో శైలి ధారాళంగా నడిచింది. రెండుమూడు పాటలుకూడా రాగతాళాలతో సహా కావ్యంలో మొదట చేర్చబడ్డాయి.

ఈ కావ్యం ఉత్తమశ్రేణికి చెందనంత మాత్రాన నిరసింపదగినది కాదు. ప్రచారాని, సామాన్యప్రజలలో ప్రబోధానికి పనికివచ్చే గేయాలు, పద్యాలు దీనిలో వున్నాయి.

'రామో'

'నెహ్రూ చరిత్రము'

రచయిత: శ్రీ కొమాండూరి శఠకోపం. వకీలు, కాకినాడ వెల 2-4-0.

ఈ గ్రంథాన్ని నాల్గవకూర్పు ఇప్పుడు ప్రకటించటంవల్ల ఇది ప్రజాదరణను ఏవిధంగా పొందగలిగినదీ తేటతెల్లమవుతుంది. గడచిన ముప్ఫయ్ సంవత్సరాలుగా నెహ్రూ కుటుంబచరిత్రను రచయిత విపులంగా వర్ణించాడు. దేశచరిత్రలో, అందులో ముఖ్యంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ కుటుంబం ప్రధానస్థానం ఆక్రమించింది. మహాత్ముడి తరువాత జవహర్‌లాల్ నెహ్రూ కున్నంత పలుకుబడిగాని, ప్రజాదరణగాని మరొక జాతీయనాయకునికి సిద్ధించలేదు. ఈ పుస్తకమూ వ్యక్తియొక్క జీవితాన్ని తేదీవారీగా ఏకరువు పెట్టటంచేత పరిపుచ్ఛకోలేదు. చారిత్రకంగా ప్రతివిషయాన్నీ పరిశీలించి సమన్వయంచేసి నెహ్రూపండితుడు దేశంకోసం చేసిన కృషిని వ్యక్తం చేస్తుంది. ఇటీవల జరిగిన పరిణామాలన్నీ ఇందులో చేర్చబడినవి. స్వతంత్రభారతదేశానికి ప్రధానామాత్యుడుగా నెహ్రూ చేస్తున్న సేవను వర్ణించి జాతీయాందోళనలో ఆయన ప్రదర్శించిన నాయకత్వాన్ని మించేటట్లు రాజ్యకార్య నిర్వాహణలో విశదం చేస్తున్న సామర్థ్యాన్ని రచయిత నిరూపించాడు. శైలి రసవంతంగా వున్నది. ప్రస్తుత దేశచరిత్రను తెలుసుకోదలచిన ప్రతివ్యక్తీ చదవవలసిన పుస్తక మిది. గ్రంథం చివర పొందుపరిచిన ముఖ్యవృత్తాంతాల జాబితా ఎంతో ఉపయుక్తంగా ఉన్నది. అక్కడక్కడ చొప్పించిన చిత్రాలుమాత్రం హీనంగా తయారైనవి.

నాగార్జున చరిత్ర

రచన: శ్రీ కొడాలి లక్ష్మీనారాయణ, మోపఱ్ఱు, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా వెల. 3-0-0.

బౌద్ధ మహాయుగంలో అద్వితీయ ప్రతిభాశాలి అని విశ్వవిఖ్యాతిని పొందిన ఋషి నాగార్జునుడు. మహాయాన బౌద్ధమతాన్ని అత్యున్నత స్థానానికి తీసుకువెళ్లిన వారిలో ముఖ్యుడీతడు. ఆయన కేవలం మతాచార్యుడేగాక, సకలశాస్త్ర పారంగతుడు, మహత్తర శిల్పి, రసాయనశాస్త్ర వేత్త, లోహశాస్త్ర నిపుణుడుగూడను. మంత్రశాస్త్రం సమగ్రంగా తెలిసినవాడు. ఇంద్రజాల విద్యలు, వెండిబంగారు విద్యలు, ఖగోళశాస్త్రం, మూలికావైద్యం మొదలయిన అన్ని విషయాలలోను ప్రావీణ్యమును సంపాదించాడు. ఇతడు క్రీస్తుశకం ఆరంభంలో జన్మించి దేశాటనంచేస్తూ విద్యలు నేర్చుకొని గుంటూరు జిల్లాలోని నాగార్జున కొండదగ్గర ఆరామమును నిర్మించి అక్కడ చాలాకాలం నివసించాడు. అమరావతీ విహారాలకు ప్రాకారం కట్టాడని ప్రతీతి. క్రీ. శ. 194 సం॥ లో సమాధి చెందాడు. ఈ మహావ్యక్తిని గురించిన చరిత్రను సప్రమాణంగా ఈ పుస్తకంలో రచయిత వర్ణించాడు. సమస్త విషయాలను వివరించినప్పటికీ చరిత్రకారుల అభిప్రాయాలను వరుసగా ఏకరువు పెట్టినందువల్ల సామాన్యపాఠకుడు అసలు విషయానికి వెతుక్కోవలసి వుంటుంది. ప్రత్యేకంగా చారిత్రక విషయాలలో పరిచయమున్నవాళ్లు తప్ప, ఇతరులు అంత ఆసక్తితో చదివేటట్లు వ్రాయతే బాగా వని తోస్తుంది. మోపఱ్ఱు గ్రామచరిత్రను ఈ పుస్తకంలో చేర్చటం కేవలం అనవసరం. దానికి బదులు నాగార్జున శిల్ప చిత్రాలను చేర్చినట్టయితే ఎంతో బాగుండేది. బొమ్మలులేని లోటు ఎక్కువగా కనబడుతుంది. ఆఖరకు నాగార్జునుని సూచించే పటమైనా ఉంచవలసింది. ఒకవిధమైన గ్రాంథికభాషలో రచన జరిగింది. ఆంధ్రులకు ముఖ్యంగా సంబంధించిన నాగార్జునుడి చరిత్రలో ఇంతమాత్రం కృషి చేసినందుకు గ్రంథకర్త అభినందనీయుడు.

'శాంతి'

అరుణ ప్రచురణ, వెరైటీ ఏజన్సీస్, బెజవాడ. వెల. 0-12-0.

హిందీకథలను తెలిగించి కూర్చినది సంపుటి అమ్మ, మధురస్మృతి, శాంతి, అనే మొదటి మూడుకథలు విశ్వంభరకౌశిక్ వ్రాసినవి. అమ్మలో, గామేశ్వరి తన మరిదిపిల్లలను చూసి అసూయపడి ద్వేషిస్తుంది. చివరకు మాతృవాత్సల్యం బయిటికివచ్చి మారిపోతుంది. మధురస్మృతిలో చమేలి వ్యాధిగ్రస్త కాగానే అదివరదాకా ప్రేమిస్తున్న భర్త ఆమెను ఉపేక్షించి నిరసిస్తాడు. ఆమె అవసానకాలానికి భర్తకు పశ్చాత్తాపం కలుగుతుంది. శాంతిలో మన శ్మాంతిలేని గొప్పయింటి వ్యక్తి ప్రపంచంమీద విరక్తితో సన్యసించబోగా ఒక భిక్షువు ప్రపంచానికి దూరంగా వుండి శాంతిని వెదకటం భ్రమ అని బోధిస్తాడు. దేవేంద్రుడి "వారివారి అదృష్టాలు" అనే కథలో ఒక చిన్నపిల్లవాడు దారిద్ర్యంవల్ల బాధపడి చలిబాధకు చెరువుదగ్గర మరణిస్తాడు. సుదర్శన్ వ్రాసిన "కవిపత్ని"లో ఒకయువతి ఒకకవిని పెండ్లాడుతుంది. కవితాప్రపంచంలో విహరించే భర్త భార్యను సంతోషపెట్టడానికి ప్రయత్నించడు. విసుగుతో ఆ భార్య మరొకణ్ణి దగ్గరకు రానిస్తుంది. కవి ఆత్మహత్య చేసుకుంటాడు. అతడు నోటితో వెల్లడించని ప్రేమను అతని గీతాలలో చూసి భార్య పశ్చాత్తాప పడుతుంది. మొత్తంమీద కథ లన్నిటిలోను ఒక విధమైన తెలివితక్కువ, పిసప పశ్చా



పూర్తిగా ఆంధ్రదేశములోనే కలువలెనని కలలు కంటున్న మమ్ము "ఇష్టమయితే ఆంధ్ర రాష్ట్రమునకు వెళ్ళుట మంచిది." బెదిరించు అనవసర శ్రమ ఆయన కేలనో? ఆంధ్రనాయకులు ఇలాంటి వివాదములను ఎప్పటికప్పుడే ఖండించుచు మా జిల్లాలో పర్యటనలు చేసి ప్రజల నుద్బోధించుచు సత్వర ఆంధ్రరాష్ట్ర సిద్ధికి కృషి చేయుదురని విశ్వసించుచున్నాను.

పి. యల్. నరసింహయ్య
ఆరణి.

"నవీనవిద్య (బేసికువిద్య)"

అయ్యా!

మన రాష్ట్ర అసెంబ్లీలోను, కౌన్సిలులోను కూడ గాంధీగారికి అత్యంతప్రియమైన నవీన విద్య (బేసికువిద్య లేక ప్రాతిపదికవిద్య)గురించి హెచ్చరికగా ఏ ఒక వ్యక్తియుకూడ ముచ్చటించక పోయినందుకు చాలా విచారించుచున్నాను. అందరు ప్రజాప్రతినిధులు విద్య అభివృద్ధి కావలెనని, కళాశాలలు అభివృద్ధి కావలెనని కోరుచున్నారేకాని, ఆ విద్య ఏ విధంగా ఉండాలి, ఏ విధంగా సంస్కరింపబడాలి అనే విషయము యెవరును గమనించుట లేదు. కళాశాలలు, పాఠశాలల లోని విద్య యిపుడున్న మాదిరిగానే ఉండి యివి పెరగాలి అంటే, మనము ఆర్జించుకున్న స్వరాజ్యమును మనమే తృణీకరించుచున్నామన్నమాట. ఎందుకంటే యిపుడందులో ఉండే విద్యద్వారానే మన బానిసతనము, పరధర్మస్వీకారము, పరాధీనత ప్రాప్తించినవి. ఈ విద్య మూలముననే మన కళలు, సాహిత్యము, పరిశ్రమలు నాశనము గావించబడినవి. దీనిద్వారానే ఉద్యోగాలకు కొట్లాట, కులకక్షల విజృంభణ, నిరుద్యోగము ప్రబలినవి. మనలో యిటువంటి విద్యనే కోరటమా? మార్పును గురించి ఎత్తుకొనకపోవుట కరము.

పూజ్యగాంధీజీ తలపెట్టిన నవీనవిద్య (బేసికు విద్య) మన జాతీయ అభ్యున్నతికి, గౌరవానికి, స్వతంత్ర తనకు, ఆత్మగౌరవమునకు, అవసరాలకు తగిన విద్యాసంస్కారమునకు పునాది. విద్యకు కొత్తకళ,జీవితం కల్పించటానికి తలపెట్టబడింది. గౌ. విద్యామంత్రిగారు నుడివినట్లు ఇది కేవలం వడకు పరిశ్రమను నేర్పే విద్యమాత్రమే కాదు. దాని ద్వారా మన జాతీయపరిశ్రమలు, కళలు, విజ్ఞానము, జాతీయధర్మములు, నీతి నిష్ఠ, శౌచము అభివృద్ధి కాగలవు. నూతన వ్యవస్థకు, పునర్నిర్మాణమునకు (రికైజాన్సుకు)మార్గ మిది.

బ్రిటిష్‌వారి పరిపాలనలో ఉండి, వారి విద్య కోరి, వారితో పోటీపడి వారి స్థానమును ఆక్రమించుకొనటకే వారిని వెళ్ళగొట్టే మనసించుకో కూడదు. మనము కేవలం వారిని వెళ్ళగొట్టి, వారి పాలనపద్ధతి, పోటీపద్ధతి నిరంకుశపరిపాలనా పద్ధతి, ఉద్యోగవాంఛ, లాభదృష్టి అనుసరించుచున్నామనిపించుకోకూడదు. బానిసలకు, బానిసతనము నిలిపేందుకు, మన జాతీయత, జాతీయౌన్నత్యము మరుగు పర్చేందుకు నిర్మించిన సంస్థలను, విద్యలను మనము వీలగునంత తొందరలో వదలించుకోవాలి. మనము వాటికి అలవాటుపడిన మాట నిజమే. వాటిస్థానే ఏవేవి సృష్టించాలో ఆలోచించుటకు కూడ కాలము వ్యవధీ, లేకపోవుటకూడ కొంతవరకు నిజమే. ఐతే మనము ఒక విషయము మరచిపోకూడదు.

ఇట్టి పరిస్థితి ఏర్పడుతుందనే, స్వరాజ్యము వస్తుందనే, వచ్చేటప్పుడు మన సంఘము ఆర్థిక రాజకీయవ్యవస్థ ఎటుల చిత్రింపవలె నను ఆలోచనతోనే, పూజ్య బాపూజీ నిర్మాణకార్యక్రమ మను దేశములో ప్రవేశపెట్టెను. అందువల్లనే మనశక్తులన్నీ కేవలం పరరాజ్య విధ్వంసనమీదనే కేంద్రకృతము కాకుండా, అట్టి ప్రయత్నముతోబాటు, రాజకీయ స్వాతంత్ర్యము రాగానే గుడ్డిగా పరరాజ్యవిధానములను, సంస్థలను అనుసరించేగతి కలుగకుండా, మన విధానములతో సంస్థలతో సిద్ధంగా ఉండుటకుగాను కొంత శక్తిని, ప్రజ్ఞను యీ నిర్మాణ కార్యక్రమము పైకి మరల్చమని మనలను కోరుచువచ్చెను. మనము వారి సూచనలను పూర్తిగా అనుసరించని దోషము మూలాన నేడు యిట్టి సంఘటనలకు, నిస్సహాయతకు లోనుకావలసి వచ్చినది.

స్వతంత్ర భారతావనికి ఎట్టి రాజ్యము కావలెనో ఊహించలేక విదేశములకు పరుగెత్తుచున్నాము. మన జీవితమునకు, ప్రపంచశాంతికి ఎట్టి విద్యకావలెనో ఇదివరకు ఎట్టి ఆలోచనలు చేయక, మనను బానిసలుగా జేయుటకు మనలో జాతీయతను క్షీణింపజేయుటకు ఏది ఆధారమైనదో, అట్టి విద్యనే అపేక్షించుచున్నాము. అదే విస్తరించాలని కోరుచున్నాము. పూజ్య బాపూజీ జూపిన బాటను గుర్తుకి తెచ్చుకొనుటలేదు. ఆయనమార్గమును అనుసరించక, ఆయన హితబోధ మన్నించక, ఆయన దేహమునకై విలపించి ఏమి ప్రయోజనము?

వి. రాజగోపాలరావు
వినయాశ్రమం

రైతులు-ఎరువులు

అయ్యా,

ఇదివరలో రాష్ట్రములో తయారగు వేరుశనగపిండి గవర్నమెంటుద్వారా సప్లయి అవుతూ వుండేది. యిప్పుడు 60% గవర్నమెంటు వ్యవసాయ డిపార్టుమెంటు ద్వారాను 40% వర్తకుల ద్వారాను ఇచ్చుటవలన రైతులకు సరియైన ధరకు చాలినంత వేరుశనగ పిండి లభించుటలేదు.

బోనస్ కూపన్లు ముఖ్యముగా రెండవపంట (దాళ్వా) యున్న గ్రామములకు యివ్వవలసి యుండగా సప్లయి డిపార్టుమెంటు వారు యిష్టం వచ్చినట్లు యిచ్చుటవలన కావలసినవారికి కూపన్లు దొరకుట లేదు. రైతులవద్ద కూపన్లు కొని వర్తకులు హెచ్చు లాభమునకు ఎరువులు అమ్ముచున్నారు. యిప్పుడు రెండవ పంటకు ఎరువులు కావలసిన అదును. కొందరకు యింతవరకు కూపన్లు యిచ్చుట జరుగలేదు. కనక దాళ్వాయున్న గ్రామములకు ముందుగా, తొందరలో కూపన్లు యిచ్చి ఎరువులు సప్లయి చేయగలందులకు కోరుచున్నాను. ప్రత్యేకం నర్సాపురం తాలూకాలో ఎక్కువ అలజడిగా యున్నది.

హ. వె. సు. ప్రకాశరావు
నరసాపురం.

చెంగల్పట్టు, ఉత్తరార్కాడు: ఆంధ్రులు

అయ్యా,

ఈ నెల నాలుగవ తేదీన మదరాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశములో శ్రీ ముత్తురంగ మొదలియార్ గారు ఆంధ్రరాష్ట్ర నిర్మాణమును గురించి ప్రస్తావిస్తూ, ఉత్తరార్కాడు, చెంగల్పట్టు జిల్లాలలోని ఆంధ్రులకు సలహానొసంగినందుకు ఆయనకు మా ధన్యవాదములు. శ్రీ మొదలియార్ గారు తమిళనాడుకు నియంత కాదలచినచో మా అభ్యంతర మేదియు లేదు గాని, ఈ జిల్లాలోని ఎనిమిది లక్షల మంది ఆంధ్రులను తమిళనాడులో చేర్చవలసి యున్నదను విపరీతవాదనకు లొంగిపోయి, మా భాషను, సంప్రదాయములను మేము వదలుకొనబోము. మా ప్రాంతము

రాజకీయ బాధితులు: ప్రభుత్వ తక్షణ కర్తవ్యము

అయ్యా,

మద్రాస్ ప్రభుత్వము 1947 ఆగష్టు 15 కు పూర్వమే రాష్ట్రములోని రాజకీయ బాధితులందరికి భూవసతులు కల్పించెదమని వాగ్దానము చేసిన విషయం తమకు విదితమే. తదుపరి నవంబరులో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు యాజమాన్యమున బెజవాడలో ఆంధ్రరాష్ట్ర రాజకీయ బాధితుల మహాసభ ఆచార్య రంగాగారి అధ్యక్షతన జరిగి, పలు తీర్మానములు చేయబడినవి. రాష్ట్రకాంగ్రెసు, ప్రభుత్వముతో ఆ తీర్మానముల విషయమై ఎట్టి సంప్రదింపులూ జరిపినట్టు కన్పించదు. బీహారుప్రభుత్వము గతసంవత్సరమే రాజకీయబాధితులకు తగిన ఆర్థికసహాయముచేసి స్వాతంత్ర్య యోధులను గౌరవించింది. మద్రాస్ ప్రభుత్వము స్వచ్ఛందముగా వాగ్దానము చేసీ, యింతవరకు తక్షణ ఆచరణయోగ్యమైన చర్యనేదియు తీసుకొనకుండుట మిగుల శోచనీయము.

కాంగ్రెస్ సంఘాలకు జేరిన దరఖాస్తులను ఆయా జిల్లా కలెక్టర్లకు పంపవలసినదిగా గత డిశెంబరులో ప్రభుత్వము ప్రకటనమాత్రము చేసినది. అయినప్పటికీ యింతవరకు ఫలితము కాన్పించుటలేదు.

ఇప్పటికైనా ప్రభుత్వము తక్షణమే రాజకీయ బాధితులైనవారి కందరికి భూవసతులు కల్పించుటయేగాక, ఆ భూములను బాగుచేసుకొనుటకు, ఎరవులు, విత్తనాలు, తదితర వ్యవసాయ ఖర్చులకుతగిన ఆర్థికసహాయముచేసినచో, వచ్చేసంవత్సరము పంటలు పండించుట కవకాశము లభించును. తద్వారా అధికాహారోత్పత్తియును జరగగలదు. కాన మద్రాసు ప్రభుత్వము భారత స్వాతంత్ర్య ప్రదాన సందర్భములో తానొసగిన వాగ్దానము వెంటనే చెల్లించుకోవలసినదిగా కోరుచున్నాను

షేకు హుడేలుసాహెబ్
కోటనెములిపురి.

తాపం, కంటెనిరు ప్రత్యక్షం కావలసిందే రచన రసవంతంగానే ఉంది. కాని కొన్నిచోట్ల హిందీసమాస అన్వయాదులను మక్కీకి మక్కీగా ఉంచినట్లు తోస్తుంది. అనేక సందర్భాలలో తెలుగుమాటలనే ఉపయోగించి ఉండవలసింది. కొంచెం నిరుత్సాహంగా ఉండే విషాదకథలకు అలవాటు పడినవాళ్లను ఈ కథలు రంజింపజేయ గలవని చెప్పవచ్చును.

'భట్టర్ చికిత్స'

రచన: శ్రీమాన్ దీవి కృష్ణభట్టాచార్యులు; శ్రీ విఖనస గ్రంథమాల, ఎడపల్లి, తెనాలి తాలూకా. వెల 1-0-0.

ఈ పుస్తకంలో అన్నిరకముల జ్వరాలను, వాని లక్షణాలను వర్ణించి వాటిని కుదర్చగల ఆయుర్వేదప్రకరణులను రచయిత వివరించాడు. ఈయోగాలు అనేక వైద్యగ్రంథాలనుంచి స్వీకరించినవేగాక వీటిలో కొన్ని స్వానుభవమైనవి కూడా వున్నవి. ఈ పుస్తకాన్ని దగ్గరపెట్టుకుంటే ఏ జ్వరాన్ని అయినా నయంచేయవచ్చునేమోగాని, వైద్యుడుగానివాడుమాత్రం ఈ ప్రయోగాల జోలికి పోకుండా ఉండడం శ్రేయస్కరం.

'చిత్రా పూర్ణిమ'

రచయిత: శ్రీ గిరిమెళ్ళ సత్యగోదావరి శర్మ, శ్రీ అంబికా బ్రదర్స్, మైలాపూర్, మదరాసు. వెల. 4-2-0.

ఇది కల్పిత చారిత్రకనవల. రంగం. మైసూరు రాజ్యం. గోపాలరాజనే క్షత్రియుడు టిప్పుసుల్తానుతో యుద్ధంలో బ్రిటిషువారికి సహాయపడి హిందూరాజ్య స్థాపనకు తోడ్పడతాడు. శ్యామసుందరుడు గోపాలరాజు కొడుకు. ఇతడికి మైరావణుడువంటివాడు రామచంద్ర భట్టు అనే మధ్వ బ్రాహ్మణ స్నేహితు డుంటాడు. ఇద్దరూ దేశం చూడడానికి బయలుదేరుతారు. సదాశివరావు అనే మరొక క్షత్రియుడు టిప్పుసుల్తాను పక్షంలో పోరాడి ఖైదులో పడతాడు. ఆయనకు, చిత్ర, పూర్ణిమ అనే ఇద్దరు కూతుళ్ళు వుంటారు. యుద్ధానికి ముందుగానే సదాశివరావు పూర్ణిమను తన అన్నగారికి పెంచమని ఒప్పగించి భార్యను, చిత్రను కుమారుణ్ణి, కొండపల్లి పంపివేస్తాడు. కొండపల్లిలో పిడుగుపడి చిత్రమాత్రం మూగదై మిగులుతుంది. దేశాటనం చేస్తున్న శ్యామసుందరుడు, చిత్రను చూసి మోహిస్తాడు. గర్భవతి అవుతుంది. ఆమెను వదలి వెళ్ళిపోతాడు. తండ్రి కోర్కె మీద పూర్ణిమను పెళ్ళిచేసుకుంటాడు. చివరకు అందరూ ఒక చోటికి చేరుతారు. రామచంద్ర భట్టు సహాయంతో చిత్రకు మూగతనం పోతుంది. ఇద్దరు భార్యలతో సుఖంగా ఉంటాడు.—ఇదీ కథ.

కాశీమజిలీ కథల ధోరణిలో రచన జరిగింది. ఏఘట్టంలోను సహజత్వం గోచరించదు. దీని శైలి పాఠశాలల పఠనీయ గ్రంథాల శైలి. అక్కడక్కడ ఒకటి రెండు వాడుకపదాలు దొర్లినందుకు గ్రంథకర్త కొంచెం కించపడ్డాడు. పాత్రపోషణ సామాన్యంగావుంది. రామచంద్రభట్టు పాత్రమాత్రం రసవంతంగా తయారయింది. ఈ నాలుగువందల పేజీల పుస్తకాన్ని చదివించేది అతడి విచిత్రగాథలే నని చెప్పక తప్పదు.

'రవి'

సవరణ

మార్చినెల 10 వ తేదీ మా సంచిక 22 వ పేజీలో శ్రీ శివావధానులు గారిని గురించిన వ్యాసములో ఉన్న చిత్రము శ్రీ ముదిగొండ నాగలింగ శాస్త్రిగారిది గాని శ్రీ శివావధానులు గారిది కాదు. అదే వ్యాసములో శ్రీ కె. టి. రామారావుగారు ప్రకృతం ప్రణవానంద స్వాము లని ప్రచురింపబడినది. కె. టి. రామారావు గారు ప్రకృతం విమలానందస్వాము లని శ్రీ శాస్త్రి గారు మాకు తెలియపరచుచున్నారు. ఈ తప్పులను సవరించి చదువుకొన వలసిన దని మా పాఠకులను ప్రార్థించుచున్నాము.

సబ్బులుతయారుచేయుట విధానం

(19-వ పేజీ తరువాయి)

యీ చలువవిధానమును ప్రోత్సహించిరి. దీని వలన వస్త్రము మరింత దెబ్బతిని స్వల్పాయుర్దాయము పొందుచుండెను. ఇది జాతీయ సంపదకు పెద్ద అనర్థము. మిల్లువారలు స్వలాభాపేక్షతో యీ విధానమును ప్రోత్సహించిరి. ఈ చలువ పద్ధతిలో (లాండ్రీపద్ధతి) ఒక్కొక్క వ్యక్తికి హెచ్చు దుస్తులుండుట అవసరము. కొన్ని చాకలియింట! కొన్ని తనయింట! దేశమున ఇన్నిబట్టల మిల్లులు అడుచున్నను వస్త్ర క్షామమునకు యిదికక కారణ మగుచున్నది. మర కదుర్ల సంఖ్యను పెంచవలెనని ఆదుర్దా మిల్లు యజమానులకు పెరుగుచున్నది. ఇది యంతయు కృత్రిమము. ఈ యరిష్టము తొలగించవలె ననిన బట్టలను చలువచేయు పద్ధతి, రంగు వేయు పద్ధతిని పూర్తిగా తొలగించవలెను ప్రజలు కోరా (ముడి) గుడ్డనే ధరించుటకు నేర్చుకొనవలెను. తమ దుస్తులను తామునగాని, లేక చాకలి చేతగాని, నిత్యకృత్యముగా సబ్బుతోగాని, చాకలిచౌడుతోగాని వుతికించుకొనవలెను. ఈ వుతుకులలో చౌడు సున్నపు నీటి వాడుక వలన (కొరుకుడుక్షారము) వస్త్రములోని దూదిపీశెలు (కాటన్‌స్టేపుల్స్) కొరుకుడు పడి బట్టదెబ్బతిని పోవును. చలువచేయుటలో వుపయోగించు క్లోరిన్ వాయు సంబంధమైన చలువ సున్నము వలన కూడ గుడ్డ దెబ్బతినును. చలువ సున్నములోని క్లోరిన్ వాయువు వస్త్రములోని రంగుతోపాటు దూది పీశెలను కూడ తినివేయుచుండును. ఇందువలన వస్త్రము బహు కొలది వుతుకులకే చినిగి వాలికలై పోవును. శాస్త్రరీత్యా తయారైన సబ్బుకోపులోగాని, సబ్బు పొడిలోగాని, చౌడు మట్టి నీటిలోగాని యీ బలిష్ఠ కొరుకుడుక్షారము (దాహకసోడా) స్వేచ్ఛాస్థితిలో వుండదు గనుక వీని వాడకము వస్త్రముల జీవితము తగ్గనీక శుభ్రపరచును. ఈ మధ్యయుగములో భారతీయులు తమ ఆరోగ్యపారిశుద్ధ్యమునకు అత్యవసరమగు సబ్బులు మొదలగు కొంచ రసాయనముల కొరకు పరాయిదేశయంత్రాలయములమీద ఆధారపడవలసి వచ్చెను.

సబ్బుయంత్రాగారములు—గృహపరిశ్రమలు

మన దేశమున కొందరు ధనిక పారిశ్రామికులు చేరి హెచ్చు పెట్టు బడితో భారీయంత్రాలయముల నిర్మించి కేంద్రీకరణ విధానములో సబ్బు అధికోత్పత్తిని సాగించ మొదలిడిరి.

సబ్బుతయారీలు 3 విధములు :

(1) వంటచేయుని పద్ధతి (శీతలపద్ధతి-కోల్డ్ ప్రోసెస్);

(2) మరణించుపద్ధతి (సెమీ బాయిల్డ్ ప్రోసెస్);

(3) తేర్చుపద్ధతి(సెటిల్డ్ ప్రోసెస్).

(1) ఈ "శీతలపద్ధతిని మామూలుగా సబ్బు సాంకేతిక శాస్త్రము తెలియనివారు అవలంబించెదరు. ఈ పద్ధతి అతి సులభము. కావలసిన నూనెలను తూచి, తగినపాళ్ళలో కొరుకుడు క్షారద్రవముల (దాహకసోడా) నిర్ణీతమగు చిక్కదనములలో చేర్చి, చిలికినచో, సబ్బు తయారగును. వెంటనే యీ సబ్బును చల్లార్చు చట్రములలో పోసి మెల్లగా చల్లార్చెదరు. యీ పద్ధతిగా తయారయిన సబ్బులో గ్లిసరీను, సబ్బుకాని పదార్థములు మిగిలియుండుటయే గాక, దాహకసోడా ఒక ప్రక్కను సబ్బుగా మారని నూనె యింకొక ప్రక్కను విడివిడిగా మిగిలియుండును. ఈ విధముగా సబ్బులో నీచ్ఛాస్థితిలో యున్న కొరుకుడుసోడా బట్టలను వుతుకునపుడు నెమ్మది నెమ్మదిగా కొరికివేయుచుండును. దీనివలన బట్టల అయుర్దాయము క్రుంగును. ఈ పద్ధతిలో స్వేచ్ఛాక్షార రహితమగు సబ్బులు లభించవుగనుక యీ పద్ధతిని విసర్జించిరి.

(2) "మరగించు" పద్ధతిలో తయారైన సబ్బులో గ్లిసరీను నిలిచిపోవుటచేత యిది రసాయనిక ద్విగతిచర్యను (రివర్సిబుల్ రియాక్షన్) నిలకడమీద సబ్బులో ప్రేరేపించును. దీనివలన సబ్బులో స్వేచ్ఛాక్షారములు (కొరుకుడు) మరల యేర్పడుటకు అవకాశము కలుగును.

(3) "తేర్చు" పద్ధతిలో తయారైన సబ్బులో గ్లిసరీనుగాని, విడి నూనెలుగాని, విడి క్షారములు గాని వుండవు. కరగియున్న సబ్బును యీ పద్ధతిలోని ఆఖరు ఘట్టమున కొంత కాలము సబ్బువండు కాగులో నిల్వవుంచి తేర్చుటవలన సబ్బులోని మాడినపదార్థము, నూనెలోని కల్మషములు మొదలగునవి సబ్బు వండు కాగు అడుగుభాగమునకును, (నైగర్) సబ్బునురుగు, కాగు పైభాగమునకును తేరి, కాగు మధ్యభాగమున శుద్ధమై, అందమైన సబ్బు నల్లని కల్మషముపైన (నైగర్) తేరి మనకు లభించుచున్నది. సబ్బును నల్లని కల్మషమునుండి తేర్చి విడతీయుదురు గనుక యీ పద్ధతికి "తేర్చు" పద్ధతి యని వ్యవహరించుచున్నారు. ఈ పద్ధతిలో తయారైన సబ్బులో గ్లిసరీను నిలబడి వుండదు గనుక రసాయన ద్విగతిచర్యకు యిందు తావులేదు. అనగా యీ సబ్బులో కొరుకుడు సోడా పుట్టుటకు ఆస్కారములేదు. ఇది సరియగు శాస్త్రీయమైన సబ్బు తయారీ విధానము. ఈ పద్ధతిని ప్రతిష్ఠగల సబ్బుతయారీదారులందరు అవలంబింతురు.

ఈ తేర్చుపద్ధతి పెద్ద పెద్ద యంత్రాలయముల వారికే వీలగు నని ఒకడు రభిప్రాయము సామాన్యముగా వాడుకలో గలదు. ప్రతి మంచితయారీ పద్ధతిని కేంద్రీకృత పారిశ్రామిక హుమ్మరావులు తమ భారీయంత్రాగారములో ఆకట్టుకొనుటకు వీలులేదని మా అభిప్రాయము. నాణ్యమగు వస్తువుల నివ్వలేని పిచ్చిపద్ధతులను గృహపారిశ్రామికులవలంబిపంవలెనని వీరి యూహ. గృహ పారిశ్రామికులుత్పత్తి చేయువస్తువులు నాణ్యరహితమై, హెచ్చుధరలకు గిట్టునని యీ పారిశ్రామిక హుమ్మరావులు ప్రజలలో ప్రచారము సాగించుచుందురు. మేము యీ తేర్చుపద్ధతిని మా సబ్బు గృహపరిశ్రమలో కొంతకాలమునుండి కృషిసల్పి యీ పద్ధతి గృహపరిశ్రమలకు కూడ వీలగునని అభిప్రాయపడుచున్నాము. ఇది మా స్వానుభవముమీద చెప్పిన మాట.

సబ్బు వుత్పత్తి యంత్రాలయములవారు, సబ్బులను వివిధరకములలో వివిధ అవసరములకు సరఫరా చేయుచూవచ్చిరి. సబ్బులను కోపులుగాను, పొడులుగాను, పొరలుగాను, బిళ్లలుగాను, ముద్దగాను, ద్రవముగాను తయారుచేసి యిచ్చుచుండిరి. సువాసనసబ్బు బిళ్లలు స్నానము కొరకు; పొడిగాటికోపులు బట్టల ఉతుకుకు; సబ్బు పేస్టు (ముద్ద) నేలలు కడుగుటకు; సబ్బు పొడిమసిబారిన వంటపాత్రలు, జిడ్డుపట్టిన భోజనపళ్లెములు ఇతరవంట సామగ్రిని శుభ్రపరచుటకును; సబ్బుపొరలు సిల్కు, వున్ని, మొదలగు వస్త్రములను వుతుకుటకును; సబ్బుద్రవము (షాంపో) తలంట్లకొరకును యిచ్చుచుండిరి. కొందరు పాశ్చాత్యపారిశ్రామికులు కూడ వర్తకసుంకములనుండి తప్పించుకొను నిమిత్తము మనదేశమున అడుగిడివి దేశీపెట్టుబడితో భారీయంత్రాలయములను సబ్బువుత్పత్తికొరకు నిర్మించి ప్రపంచ అవసరములను గడుపుచూ వచ్చిరి. మనదేశమున చిరివిగా లభించు సబ్బు నిచ్చు నూనెలను వీరు పూర్తిగా నుపయోగించి, తిండికి పనికివచ్చు నూనెలనుకూడా సబ్బుగా మార్చి, ప్రపంచ అవసరములను స్వలాభాపేక్షతో గడుపుచూ వచ్చిరి. ఈ విదేశీపెట్టుబడి యంత్రాలయములు మనదేశముననే నిర్మించబడియుండుటచేత యీ యంత్రాలయములనుండి వచ్చు సరుకునుకూడ 'స్వదేశీ' యను నామముతో అమ్మ జొచ్చిరి.

ఈ యంత్రాలయమువారికి నీటిని నిలబెట్టి, సబ్బుఅని పేరుపెట్టి విక్రయించు శక్తి కలదు. దీనినే నీటిని సబ్బులో "నిగడదన్నించగల ప్రజ్ఞ" యని కూడా యందురు. ఈ కనుగట్టు విద్యకు నీటిగాజు (సోడా సిలికేటు) మంచి వస్తాదు. నీటిగాజువంటి సబ్బునింపుదుదార్ల వాడుక వలన తయారైనసబ్బులో హెచ్చునీరు నిలబడి వుండును. అందువలన సబ్బుబరువు హెచ్చు అగును. సబ్బుముక్కలోని అసలు సబ్బుపాలు (ఫాటియాసిడ్ కన్టెన్ట్) తగ్గును. ఈమాదిరి కల్తీ సబ్బులలో శుభ్రపరచుగుణము (డిటర్జెను ప్రాపర్టీస్) చాలవరకు క్షీణించును. సబ్బులు తూచి చౌకగా అమ్ముటకు యంత్రాలయతయారీదారులు యీ సబ్బునింపుకు పద్ధతిని అవలంబింతురు.

సబ్బులను, సబ్బురాతిపొడితో (టాల్కు) నింపి భర్తీచేయుట యింకొక విధము. వాడుకదార్లు ఈసబ్బును తడిబట్టలమీద వేసి రుద్ది వుతుకునపుడు, సబ్బులో నింపబడిన సబ్బురాతిపొడి వుతుకుచున్న బట్టనుండి బయటకు వచ్చును. ఉతుకుచుండెడివారు యీ మురికి అంతయు, తమ వస్త్రములలోనిదే ననియు, సబ్బు మంచిది గనుక మురికిని చక్కగా వదలుకొట్టుచున్నదనియు, భ్రమపడుచుందురేగాని యీ మురికంతయు తాము సబ్బుతోపాటు తూచి కొనుక్కొన్న మురికియే యని తెలుసుకోలేరు! వస్త్రము ఎండినతరువాత వీరు పరిశీలించినచో వస్త్రములోని మురికియే వదిలెనో, లేక సబ్బులోని మురికి వస్త్రమునకే పట్టెనో తెలియగలదు.

వీరి వుత్పత్తి వక్కచోటనే కేంద్రీకరింపబడియుండుటచేత వీరు దేశములోని వివిధప్రాంతముల లభించు పలురకములగునీటికి అనువగునట్లు అన్నిరకములలో సబ్బును వుత్పత్తి చేయజాలరు. వీరు యివ్వగలిగినది మామూలువాడుకలకు పనికి వచ్చు సబ్బులను మాత్రమే. మన వైద్యులకు చేతులు కడుగుకొను నిమిత్తము "ఈథర్" సబ్బు అవసరము. వీరికి యీ సబ్బు బజారుకొట్లలో దొరకదు. కొందరికి సబ్బుపొడి అవసరము. కొందరికి పొరలుసబ్బు అవసరము కావచ్చును. వీరందరి వేరువేరు ప్రత్యేకఅవసరములను తీర్చుటకు బజారువర్తకుడు సబ్బులను నిల్వవుంచలేడు. దళారీమార్గమునయిది వకలోపము. సబ్బునుగురించి వాడుకదార్ల సలహాలు సులభముగా వుత్పత్తిదారునికి చేరవు. బజారు వర్తకుడు సబ్బుయొక్క నాణ్యమునుగురించి యేమియును చెప్పజాలడు. బాధ్యత వహించలేడు. మన దొడ్డిబావిలోని నీటికి అనువగుసబ్బును కేంద్రీకృత వుత్పత్తిదారుడు యివ్వలేకపోవుటవలననే వాడుకదారు సబ్బునాణ్యమునుగురించి ఆక్షేపించుట తటస్థించుచుండును.

సామాన్యముగ చెరువులు, కాలువలు, నదులు, కొళాయిల నీరు సబ్బును కరిగి నురుగు చేయుటకు (సాఫ్ట్‌వాటర్) అనుకూలముగనే వుండును. కొన్నిప్రాంతముల బావినీటిలో సబ్బును విరిచివేయు గుణ ముండును. (హార్డ్ వాటర్) ఇది నీటిలో కరిగియున్న సుద్ద (కాల్షి యక్షారకర్బనితము)వలన కలుగును. ఈ నీటినే "బరువు"నీరు (హార్డ్‌వాటర్) అందురు. గనుక నీరు రెండు రకములు.

(1) తేలికనీరు : సబ్బును సులభముగా కరిగి నురుగుచేయునీరు.

(2) బరువునీరు : సబ్బును విరిచివేయు నీరు.

సబ్బు పరిశ్రమ వికేంద్రీకరింపబడి స్థానికమైనయెడల, తయారుదారు తన ప్రాంతపు నీటి స్వభావమును గుర్తించును. సుద్దగల బరువునీటికి సులభముగా కరుగు సబ్బును, సుద్దలేని తేలికనీటికి కొంచెము కష్టముగా కరుగుసబ్బును యిచ్చుచుండును. ఇందువలన సబ్బుబిళ్ల నీటిలో చక్కగా మనును. ఈ గృహపారిశ్రామికుడు అవసర పరిస్థితులకు తగినట్లుగా తన సబ్బు తయారీని సవరించుకొను అవకాశము కలిగియుండును. ఈతడు ప్రాంతీయుడగుటచేత, తన సబ్బు వాడుకదార్ల అభిప్రాయమును గ్రహించుచుండును. ఈతడు "నీటిని నిగడించి" చౌక సబ్బును తయారుచేయు పద్ధతి అవలంబించడు. యంత్రాలయ యజమానుల భుజములపై పెద్ద పెద్ద జీతగాండ్రను పోషించవలసిన భారముండును. ఈ యంత్రాలయముల వారు, యీ భారము చేతనే అధిక వస్తూత్పత్తి, అధిక వ్యాపార విడుదల, చౌక రకముల తయారీ కొరకు తహ తహలాడుచుందురు. వీరికి "కూలీసమ్మె" ఒక సింహస్వప్నము.

గృహపారిశ్రామికుడు ఆర్డరును చూచుకొని యేవుత్పత్తికి దిగును. గనుక యీతనికి అధికవస్తూత్పత్తి ప్రశంసయే లేదు. ఈతడే తనస్వగృహమున నెలకొల్పుకొనిన పరిశ్రమలో మామూలు కూలీవాడు చేయగల వెట్టి చాకిరి నుండియూ, మేధావి చేయగల ఆలోచనా భాగము వరకును తానే స్వయముగను, కుటుంబ సహాయముతోను చేసుకొను చుండును. గనుక యీతనికి "కూలీసమ్మె" లే లేవు. కేంద్రీకృతయంత్రాలయ పద్ధతిలో జాతీయ సంపద, ధనము, కొద్దిమంది పారిశ్రామిక హుమ్మరావుల చేతులలోనికి పోవును. వికేంద్రీకరించబడిన గృహపరిశ్రమ విధానమున జాతీయ సంపద, ధనము సామాన్య కుటుంబీకులలో సరిసమానముగ పంపకమగును. ఈ గృహపరిశ్రమల విధానములో ప్రతి మానవునకు సరిసమానమగు వీలు లభించుచుండుట చేత, జాతిఅంతటిలోను వ్యక్తియొక్క గౌరవ, ప్రజ్ఞా ప్రదర్శనములు అభివృద్ధి చెందుచుండును.

ప్రభుత్వబాధ్యత

అత్యవసరవాడుక వస్తూత్పత్తి కొరకు మన ప్రభుత్వము క్రొత్తక్రొత్త యంత్రాలయములను, దేశమున నెలకొల్పుటకు అనుమతించకూడదు. వీలైనంతవరకు గృహపరిశ్రమలనే గ్రామ, గ్రామమునను నెలకొల్పుటకు అనుమతించి దోహదము చేయవలెను. ప్రభుత్వములు యీ వుద్దేశ్యముతో పని చేయుచో ప్రస్తుతము దేశమున వ్యాపించియున్న పారిశ్రామిక అశాంతి సమసిపోవును. ప్రప్రథమముగా దేశమున నెలకొనియున్న భారీయంత్రాగారముల నన్నంటిని ప్రభుత్వము తన హస్తగతము చేసుకోవలెను. అవసరవాడుక వస్తువుల ఉత్పత్తి నంతటిని గృహపరిశ్రమల రూపములో దేశమున వికేంద్రీకరించి ప్రజాయత్తపరచవలెను. గృహ పరిశ్రమలకు అవసర మగు చిన్న యంత్రములను, పనిముట్లను, ముడిపదార్థములను ఈ భారీయంత్రాగార సహాయముతో తయారు చేయించి, పారిశ్రామికునకు అందజేయవలెను.


ప్రభుత్వము-మంచిచెడ్డలు

ప్రభుత్వ మంచిచెడుగులను నిర్ణయించునది తాను సృష్టించు కోటీశ్వరుల పారిశ్రామిక హుమ్మరావుల సంఖ్యనుబట్టి కాదు. స్వతంత్ర జీవనోపాధుల అభివృద్ధికి తాను ప్రజలలో కల్పించగల వసతుల సంఖ్యనుబట్టి మాత్రమే నిర్ణయ మగుచుండును. సామాన్యకుటుంబీకుని జన్మహక్కు అగు స్వతంత్ర జీవనోపాధుల అభివృద్ధికి ప్రభుత్వములు, పథకములు వేసి కృషి సల్పవలసియున్నది. ఇటీవలనే వెలువడిన "నెహ్రూ-ఆర్థిక" పునర్నిర్మాణకమిటీవారి సూచనలు మిక్కిలి సంతోషదాయకములు.

ప్రభుత్వ కొనుగోలువిధానము

గృహపరిశ్రమల ప్రోత్సహించదలచిన ప్రభుత్వము యీ పరిశ్రమలు తయారుచేయువస్తువులనే తన వివిధశాఖలలో వాడుకొనవలెను దీనివలన వుత్పత్తితోపాటు కొనుగోలు విధానముకూడ వికేంద్రీకరించబడును.

గాంధీమహాత్ముడు ఇంతకాలముగ మనకు బోధించిన ఆర్థికవిధానము ఈ గృహపరిశ్రమ విధానమే! గృహపరిశ్రమలే భారతజాతీయత కాగలవు. గృహపరిశ్రమలే లోకమునకు శాంతిని సమకూర్చగలవు. మనలను వీడి దివంగతుడైన గాంధీమహాత్ముని పవిత్రాత్మకు శాంతిని సమకూర్చగలవు.




ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రత్యేక స్నాతకోత్సవ చిత్రం: అమృతకౌర్, జవహర్లాల్ నెహ్రూ, మౌంట్ బాటన్ సతీపతులు, అబుల్ కలాం అజాద్, ప్రభృతులు ముందువరుసలో కూర్చొన్నారు


వార్తా చిత్రాలు




డాక్టర్ డిగ్రీపొంది ఆదుస్తులలో వున్న పండిత నెహ్రూ




ప్రథమ భారతీయ ప్రధాన న్యాయమూర్తి గౌ. పి. వి. రాజమన్నార్ [ఎడమనుండి మూడవవారు] గారికి మద్రాస్ ఎడ్వొకేట్లసంఘం అల్పాహార విందొసంగినప్పటిచిత్రం



అంతర్జాతీయ ఆహారసంఘంలో భారతప్రతినిధి వర్గనాయకుడు. శ్రీకృష్ణస్వామిగారు (టోపీవున్నవారు) సౌతిండియా ఛాంబర్ ఆఫ్ కామర్సును దర్శించారు





ప్రఖ్యాత చిత్రకారుడు శ్రీ అంకాల సుబ్బారావుగారు వ్రాసిన తిక్కన చిత్రపటాన్ని భీమవరం కాలేజీలో శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు ఆవిష్కరించారు. ఈ చిత్రంలో కనిపిస్తున్నవారు, సగా, శ్రీ పెద్దాడ రామస్వామిగారు (కాలేజి ప్రిన్సిపాల్), శ్రీ అంకాల సుబ్బారావుగారు, శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు, శ్రీ నండూరి కృష్ణమాచార్య(కాలేజీలో తెలుగు ఉపన్యాసకులు)గారు

Regd. No. M 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras.

Q. H. M. S. No. 857—10,000 Copies.